ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విజయవాడ : fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-6-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 133 పేజీలు: 12 వెల: 6.50

ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం

మాజీ సీఎం రూపానీకి కలసిరాని లక్కీనంబర్ 9లో

## టెన్త్ లోపు విద్యార్థులకు బస్‌పాస్‌లు ఉచితం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో పాఠశాలల చదివే పిల్లల కోసం విద్యార్థి బస్‌పాస్ సౌకర్యాన్ని ఆర్టీసీ కల్పిస్తోంది. 10వ తరగతిలోపు చదివే విద్యార్థులకు ఉచితంగా బస్ పాసులు ఇస్తోంది. దీని కోసం జూన్ 14వ తేదీ నుంచి దగ్గరలోని ఆర్టీసీ బస్టాండులలోని బస్‌పాస్ కౌంటర్లలలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. రెన్యువల్ చేసుకోవాల్సిన విద్యార్థులు పాత పాస్‌లను బస్‌పాస్ కౌంటర్‌లో ఇస్తే కొత్తవి ఇస్తారు. ఇంటర్, డిగ్రీ చదివే విద్యార్థులకు ఒక నెల, మూడు నెలలు, అదే విధంగా ఏడాది పాటు చెల్లుబాటు అయ్యేలా బస్‌పాస్‌లు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ ఫోన్ నుంచే బస్‌పాస్‌ను ఆన్‌లైన్‌లో ఏపీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్.ఇన్ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఏ డిపో పరిధిలోని విద్యార్థులు ఆ డిపోల పరిధిలో దరఖాస్తు చేసుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు సూచించారు. 12 ఏళ్లలోపు ఉన్న బాలురకు, అదే విధంగా 18 ఏళ్లలోపు ఉండి 10వ తరగతి చదివే బాలికలకు ఆర్టీసీ స్టూడెంట్ బస్ పాస్‌లను ఉచితంగా అందిస్తోంది. వీరు 20 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పాఠశాలలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చు.

ఆగస్టు చివరి నాటి వరకు ఉచిత బస్‌పాస్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఐడీ కార్డుకు 50 రూపాయల ఫీజు చెల్లించాలన్నారు. అదే విధంగా 12 సంవత్సరాలు కంటే ఎక్కువ వయసు ఉన్న బాలురతో పాటు ఇంటర్మీడియట్ ఆపై చదివే బాలికలకు సైతం తక్కువ ధరకే బస్‌పాస్‌లను ఇస్తున్నారు.



శుక్రవారం అహ్మదాబాద్ విమానాశ్రయంవద్ద ప్రమాదం జరిగిన ప్రదేశాన్నిపరిశీలిస్తున్న ప్రధాని మోదీ

## దొరికిన బ్లాక్ బాక్స్




**అహ్మదాబాద్, జూన్ 13:** అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో కీలకంగా మారిన బ్లాక్ బాక్సు లభ్యమైంది. విమానం కూలిన బిల్డింగ్ పైకప్పుపై బ్లాక్ బాక్సును అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రమాదం జరిగిన 27 గంటల తర్వాత ఈ బ్లాక్ బాక్సు లభ్యమైంది. దర్యాప్తు బృందం ఈ బ్లాక్ బాక్సు విశ్లేషణను ప్రారంభించింది. ప్రమాదానికి గల కారణాలుఇప్పటి వరకూ తెలియరాలేదు. దీనిపై >>2

# ఇది ఊహించని పెను విషాదం

బోయింగ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రధాని మోడీ

గాయపడిన మెడికోలకు పరామర్శ

**అహ్మదాబాద్, జూన్ 13:** గుజరాత్‌లో జరిగిన బోయింగ్ డ్రీమ్‌లైనర్ విమాన ప్రమాద స్థలాన్ని ప్రధానిమోడీ శుక్రవారం సందర్శించారు. ప్రమాద వివరాలను అధికారులనుంచి అడిగి తెలుసుకున్నారు. అక్కడినుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదంనుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమానప్రయాణీకుడు రమేష్ విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలతోనూ మోడీ మాట్లాడి వారిలో ధైర్యం >>2

బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన 2లో

గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి



శుక్రవారం సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

# విశ్వనగరంగా అమరావతి

ప్రతి ప్రణాళిక వేగంగా అమలు చేయాలి

1450 ఎకరాల్లో వసతులకు రూ.1052 కోట్లతో టెండర్లు

సీడ్ యాక్సెస్ రోడ్డును హైవే16తో కలిపేందుకు టెండర్‌కు ఆహ్వానం

గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో చర్చలు

సిఎం చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశం

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా రాజధాని విశ్వనగరంగా అమరావతిని శరవేగంగా నిర్మించాలని సీఎం చంద్రబాబు పునరుద్ఘాటించారు. నగర నిర్మాణానికి ఉద్దేశించిన ప్రతి ప్రణాళికను అమలు చేయాలన్నారు. దీంతో పాటు ఒక క్రమపద్ధతిలో నగర నిర్మాణం సాగాలన్నారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్ పరిధిలోని 1450 ఎకరాల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.1052 కోట్లతో టెండర్ పిలవడానికి సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్‌ను నేషనల్ హైవే 16కు కలిపేందుకు టెండర్‌లు పిలవాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయంలో ఎక్కడివక్కడ నిలిచిపోయిన రాజధాని అమరావతి నిర్మాణానికి మళ్లీ అడుగులు పడ్డాయి. టిడిపి కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టిన రోజునుండి అమరావతి నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. గతంలో రాజధాని పనులను పర్యవేక్షించిన మంత్రి నారాయణకే మళ్లీ అదే బాధ్యతను అప్పగించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం ఈ విషయమై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఎప్పటికప్పుడు సమీక్షలు, పనుల నిర్ధారణ, టెండర్లు పిలవడం వంటి చర్యలతో రాజధాని పనులు పట్టాలెక్కాయన్న అభిప్రాయాన్ని కలిగించారు. అయితే, రాజధాని నిర్మాణానికి కేంద్రం నుండి నిధులనుసాధించడంలో ప్రభుత్వం విఫలమైంది. దీంతో అప్పులతో అమరావతిని >>2

## 80% రాయితీతో రైతులకు డ్రోన్లు

మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని దేశం లోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 80% రాయితీతో రైతులకు డ్రోన్లు అందిస్తోందని వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదదల చేసారు. వాటితో అన్నదాతలు ఎరువులు,పురుగుమందులు పిచికారీ చేసేలా చర్యలు తీసుకుంటోంది. సాగుకు సాంకేతికతను జోడిస్తే ఖర్చులు ఆదా అవుతాయని, సేద్యం లాభసాటిగా మారుతుందని ఈ ఏడాది ప్రభుత్వం జిల్లాల వారీగా పరిమితంగా రైతు గ్రూపులకు డ్రోన్లు అందించింది. రాష్ట్రానికి 875 యూనిట్లు మంజూరు చేసింది. ఐదుగురు రైతుల గ్రూపులను లబ్దిదారులుగా గుర్తించింది. జిల్లాల వారీగా ఎంపిక పూర్తి చేసి వ్యవసాయ శాఖతో వారికి శిక్షణ ఇప్పించింది. ప్రతి గ్రూపు నుంచి ఒకరి చొప్పున 875 మందికి డ్రోన్ పైలెట్ శిక్షణ ఇచ్చారు.

ఒక్కో యూనిటత్ ధర రూ.9.80 లక్షలు. ఇందులో రైతుల వాటా రూ.1.96 లక్షలు, మిగిలిన రూ.8లక్షలు ప్రభుత్వమే భరిస్తుంది. రైతుల వాటాను బ్యాంకుల ద్వారా రుణమిప్పించి డ్రోన్ కంపెనీలకు చెల్లించేలా చర్యలు తీసుకుంది. ఒక ఎకరంలో పురుగుమందు పిచికారీ చేయడానికి డ్రోన్ పెట్టే సమయం ఏడు నిమిషాలే. అదే రైతు భుజానికి ట్యాంకు తగిలించుకొని స్ప్రే చేయాలంటే రెండు గంటలకు పైగా పడుతుంది. 12 లీటర్ల నీళ్లలో డ్రోన్ ఎకరా పంటకు స్ప్రే చేస్తుంది. అదే >>2

# 16 కల్లా ఉపాధ్యాయుల బదిలీ

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉపాధ్యాయుల బదిలీలు ఈ నెల 16(సోమవారం) కల్లా పూర్తి చేస్తామని విద్యాశాఖా మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. అందరి ఆమోదంతో అద్భుతమైన సంస్కరణలు తీసుకువచ్చాం. ఆంధ్రా మోడల్ ఎడ్యుకేషన్‌ను దేశంలో అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలువుతామన్నారు. ఉండవల్లిలోని తన వ్యక్తిగత కార్యాలయంలో విద్యామంత్రి నారా లోకేష్ శుక్రవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాల దీటుగా ప్రభుత్వ స్కూళ్ళను తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు గత విద్యాసంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. పాఠశాల విద్యలో మౌలిక మార్పులు తీసుకుని వచ్చామన్నారు. ప్రజలందరూ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని విజ్ఞప్తి. తల్లికి వందనం అర్హులు ఎంత మంది ఉంటే అంత మందికీ లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం 42 లక్షల మందికి మాత్రమే అమ్మ ఒడి ఇచ్చింది. కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది విద్యార్థులకు పథకాన్ని వర్తింప చేస్తున్నాం. అర్హులు ఇంకా ఉన్నా ఇస్తామని లోకేష్ తెలిపారు. గత ప్రభుత్వం కంటే రూ.3,405 కోట్లు అదనంగా తల్లికి వందనం నిధులు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. ఇప్పటి వరకూ 18.55 లక్షల మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ అయ్యాయని తెలిపారు. అలానే 9600 పాఠశాలల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు విధానం పెట్టామని గత ప్రభుత్వంలో కేవలం 1200 పాఠశాలల్లో మాత్రమే ఈ విధానం అమలైందని తెలిపారు. సాంకేతిక సమస్యలతో నిధులు జమ కాకపోతే వాట్సాప్ కంప్లెయింట్ ద్వారా వాటిని పరిష్కరిస్తామని మంత్రి అన్నారు. 2 శాతం మంది తల్లుల అకౌంట్ ఇనాక్టివ్‌గా ఉన్నాయని, వారిని మెసేజ్ ద్వారా అప్రమత్తం చేశామని తెలిపారు. తల్లికి వందనంలో రూ. 13 వేలు ఇచ్చి రూ. 2 వేలు నా ఖాతాలో పడ్డాయన్న వైసీపీ నేతలకు తీవ్ర పరిణామాలు తప్పవు అని తీవ్రస్థాయిలో ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్. హెచ్చరించారు. వైకాంగ్రెస్ ప్రచారం చేస్తున్నట్టుగా రూ.2 వేలు నా ఖాతాలో పడినట్లు రుజువు చేయాలి, లేకుంటే క్షమాపణ చెప్పి ప్రకటన ఉపసంహరించుకోవాలి. అలా చేయకుంటే వారిపై చట్ట ప్రకారం ముందుకెళ్తా. అసత్య ఆరోపణలని గతంలో మాదిరి భరించేది లేదు. నిరాధార ఆరోపణలు చేసేవారు మూల్యం చెల్లించుకోక తప్పదని తమపై దుష్ప్రచార చేసేవారిని లోకేష్ హెచ్చరించారు.

**ఇంటర్మీడియట్‌లో సంస్కరణలు:** ఇంటర్మీడియట్‌లో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని వాటిని సక్రమంగా అమలు చేసేందుకు కొంత సమయంపడుతుందని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ఉన్నత విద్యలో ఇంకా చాలా సంస్కరణలు తీసుకురావాల్సి ఉందని వాటిపై దృష్టి సారించామన్నారు. ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ కూడా స్ట్రీమ్ లైన్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. గతంలో ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు ఒకరిని చదివించి మిగిలిన వారిని పనులకు పంపించే పరిస్థితి ఉండేదని ఇప్పుడు అలా లేదని తెలిపారు. ఉదయంనుంచి ఇద్దరు అంతకంటే ఎక్కువ >>2




ఆంధ్రమోడల్ విద్యావ్యవస్థను అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుపుతాం

బడుల్లో మెరుగైన విద్య ప్రభుత్వ లక్ష్యం

'తల్లికి వందనం'పై ఆరోపణలు నిరాధారం: మంత్రి లోకేష్

# సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు

ఒకే చోట ఐదేళ్లు నిండిన వారికి స్థానచలనం

**విజయవాడ,జూన్ 13,ప్రభాతవార్త ప్రతినిది:** గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో వారి స్వంత మండలంలో పోస్టింగ్ ఇవ్వరాదని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియకు సంబంధించి గురువారం జారీ చేసిన మార్గదర్శకాల్లో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2025 మే 31 నాటికి ఒకే సచివాలయంలో ఐదేళ్ళ సర్వీస్ పూర్తి చేసిన వారికి బదిలీ తప్పనిసరి. స్థానచలనం కల్పించిన ఉద్యోగుల వివరాలు హెచ్‌ఆర్ఎంఎస్ పోర్టల్‌లో జులై 10లోగా అప్‌డేట్ చేయాలి. బదిలీల తర్వాత సచివాలయాల్లో నిర్థేశించిన దానికంటే అధికంగా ఉన్న ఉద్యోగులు తదుపరి ఆదేశాలు వెలువడే వరకు ఆయా చోట్లే కొనసాగనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం కలెక్టర్లకే పూర్తి అధికారాలు కల్పించింది. ఈ నెల 30లోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. బదిలీల్లో వీరికి ప్రాధాన్యం ఇస్తారు, వారు అంధులు, మానసిక వికలాంగులైన పిల్లల తల్లిదండ్రులు, గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ళకు పైగా పనిచేసిన వారు, 40శాతానికి పైగా అంగవైకల్యం ఉన్నవారు, కేన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ మార్పిడి సమస్యలున్నవారు, కారుణ్య నియామకాల క్రింద ఉద్యోగాలు పొందినవారు, భార్యాభర్తలిద్దరూ ఉద్యోగులైతే వీలైనంతవరకు సమీప ప్రాంతాల్లో వారిని నియమించాలి. వీరందరికీ >>2



## ముగ్గురి ప్రాణం తీసిన కారు

బంగారుపాళ్యం మండలంలో దుర్ఘటన

**బంగారుపాళ్యం, జూన్ 13 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి తిమ్మోజిపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, నలురుగు గాయపడ్డారు. మృతుల్లో పలమనేరు పాతపేట ఆర్‌కె వీధికి చెందిన సయ్యద్ దిలీప్(54), బంగారుపాళ్యం మండలం తిమ్మోజిపల్లి గ్రామంకు చెందిన వి.రాజేంద్రనాయుడు(53), తిమ్మోజిపల్లి దళతవాడకు చెందిన సాదరయ్య(32)లు మృతి చెందాడు. అలాగే ఈ ప్రమాదంలో మరో నలురుగు గాయపడగా ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు వెల్లడించిన వివరాల మేరకు పలమనేరు >>2

## నేతన్నలకు వేతనాలు పెంపు




ప్రాసెసింగ్ ఛార్జీలు కూడా పెంచుతున్నాం: మంత్రి సవిత

**విజయవాడ జూన్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** వేలాది మంది నేతన్నలకు లబ్దిచేకూర్చే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ చార్జీలను పెంచే కీలక నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లు రాష్ట్ర బి.సి., ఇ.డబ్ల్యు.ఎస్. సంక్షేమం, చేనేత మరియు టెక్స్‌టైల్స్ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం పబ్లిసిటీ సెల్లో ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ సాంప్రదాయ చేనేత రంగాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కీలక నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో దాదాపుగా 1,036 చేనేత సహకార సంఘాలున్నాయని, వాటిలో 89 వేల మగ్గం నేత కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ ఆర్థికంగా ఊతం ఇచ్చే విధంగా, వారి జీవనోపాధి మెరుగుపడే విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీలను గణనీయంగా పెంచడం జరిగిందన్నారు. ఆప్కోకు ఉత్పత్తులను సరఫరా చేసే ప్రాథమిక చేనేత కార్మికుల సహకార సంఘాలు కింద పనిచేసే నేత కార్మికులకు వేతనాలు, ఛార్జీల పెంపు వర్తిస్తుందన్నారు. బ్లీచింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.129 నుంచి రూ.148లకు (15 ), డైయింగ్ ఛార్జీలు బండిల్‌కు రూ.362 నుంచి రూ.434లకు (20 ), బెడ్‌షీట్ నేత మజూరి రూ.83 నుంచి రూ.100లకు (20 ) టవల్ నేత మజూరి రూ.31 నుంచి రూ.40లకు (30 ) పెంచడం జరిగిందని ఆమె తెలిపారు. ఫలితంగా ఒక్కో నేతన్నకు నెలకు అదనంగా రూ.3 వేల ఆదాయం రానున్నదన్నారు. ఈ విధంగా వేతనాలు, ప్రాసెసింగ్ ఛార్జీల పెంపుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసా కలగడమే కాకుండా నేతన్నల సంక్షేమం, అభివృద్ధిపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. దేశం,రాష్ట్రంలోను గ్రామీణ ఉపాధిలో >>2



మర్రిపాడు జాతీయ రహదారి పై భారీగా నగదు పట్టివేత 2లో



విమాన ప్రమాదంలో మరణించిన మాజీ సిఎం రూపానీ కుటుంబ సభ్యులను శుక్రవారం పరామర్శించిన ప్రధాని మోడీ.
ఆసుపత్రిలో ఓ క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ప్రధాని మోడీ

# మాజీ సిఎం రూపానీ కుటుంబాన్ని పరామర్శించిన ప్రధాని మోడీ

**అహ్మదాబాద్,జూన్13:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంపరామర్శించారు. భర్త మరణవార్త తెలుసుకున్న లండన్‌లో ఉన్న విజయ్ రూపానీ భార్య అంజలి రూపానీ శుక్రవారం ఉదయం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి వెళ్లిన ప్రధాని మోడీ.. రూపానీ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. లండన్‌లో ఉన్న కూతుర్ని కలిసేందుకు గుజరాత్ మాజీ సిఎం డ్రీమ్‌లైనర్ విమానం ఎక్కారు. గతవారమే ఆయన భార్య అంజలి రూపానీ లండన్ బయల్దేరి వెళ్లారు. అయితే కొన్ని పనుల కారణంగా విజయ్ రూపానీ ఇండియాలోనే ఉండాల్సి వచ్చింది. పనులు ముగించుకొని విజయ్ రూపానీ కూడా గురువారం లండన్ వెళ్తున్న ఎయిర్ ఇండియా ఫ్లైట్ ఎక్కారు. విమానం టేకాఫ్ అయిన నిమిషాల వ్యవధిలోనే అది కూలిపోయింది. ఈ ఘటనలో విజయ్ రూపానీ ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు ప్రకటించిన సంగతి తెలిసిందే. కుటుంబాన్ని కలిసేందుకని విమానం ఎక్కిన విజయ్‌రూపానీని మృత్యువు ఒక్కసారిగా కబళించడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు గుజరాత్ సీఎంగా రూపానీ బాధ్యతలు నిర్వర్తించారు.

# విశ్వనగరంగా అమరావతి

>> నిర్మించాల్సి వస్తోంది. ప్రపంచబ్యాంకు, ఎఐఐబి నుండి రూ.15 వేల కోట్లు, హడ్కో నుండి 11 వేల కోట్లు, బ్యాంకుల కన్సార్టియం నుండి మరికొంత రుణాన్ని తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం దశలవారిగా రాజధాని పనులను చేపట్టడానికి కసరత్తు చేస్తోంది. తరచు సీఆర్డీఏ సమావేశాన్ని నిర్వహిస్తూ రాజధాని నిర్మాణ పనులుపై సమీక్షిస్తూ కీలక కార్యచరణ చేపడుతున్నారు.ఇప్పటికే అసెంబ్లీ, హైకోర్టు భవనాల టెండర్లకు ఆమోదం తెలిపిన అథారిటీ, ఎల్ వన్‌గా నిలిచిన సంస్థలకు లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్ ఇచ్చేందుకు ఆమోదముద్ర వేసింది. అసెంబ్లీ బేస్‌మెంట్+ జీ+ 3+ వ్యూయింగ్ ప్లాట్ ఫాంలు + పనోరమిక్ వ్యూ (బిల్టప్ ఏరియా 11.22 లక్షల చదరపు అడుగులు, ఎత్తు 250 మీటర్లు) అసెంబ్లీ నిర్మాణానికి టెండర్లలో ఎల్ వన్‌గా నిలిచిన సంస్థకు ఎల్‌వోఏ ఇచ్చేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. హైకోర్టు బేస్‌మెంట్ + జీ + 7 అంతస్తుల్లో నిర్మాణం, బిల్టప్ ఏరియా 20.32 లక్షల చదరపు అడుగులు ఎత్తు 55 మీటర్లు కాగా, ఎల్ వన్‌గా నిలిచిన సంస్థకు ఎల్‌ఓఏ ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. అసెంబ్లీ నిర్మాణ కాంట్రాక్టును 617 కోట్లతో ఎల్ అండ్ టీ, హైకోర్టును 786 కోట్లతో ఎన్‌సీసీ సంస్థలు దక్కించుకున్నాయి .ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఉండవల్లి నివాసంలో సీఆర్డీఏ అథారిటీ 49వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు పలు అంశాలను ప్రస్తావించారు.సీఆర్డీఏ సమావేశంలో గత నిర్ణయాలు,వాటి కార్యచరణ ఇతరంశాలపై అధికారులనుంచి సమాచారం తెలుసుకున్నారు.ఈ సందర్భంలో గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో మాట్లాడామని మంత్రి నారాయణ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో రివర్ బండ్, సాలిడ్ వేస్ట్ ప్లాంట్‌లు ఎలా ఉన్నాయనేది అధ్యయనం చేశామని అన్నారు. యూపీ అధికారులు ఏపీకి వచ్చి సాలిడ్ వేస్ట్ ప్లాంట్‌లపై అధ్యయనం చేయనున్నారని మంత్రి నారాయణ తెలిపారు. గ్రీన్ అండ్ బ్లూ సిటీ నిర్మాణంపై నిపుణులతో చర్చించినట్లు వివరించారు. ఇంకా యూపీ పర్యటనలో ఘనవ్యర్థాల నిర్వహణపై పలు అంశాలు చూశాము. వారు మన రాష్ట్రానికి వచ్చి ప్లాంట్లు స్టడీ చేస్తామని యూపీ అధికారులు చెప్పారు సీడ్ యాక్సెస్ రోడ్డును హైవే16తో కలిపేందుకు టెండర్ పిలవాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.1,450 ఎకరాల్లో వసతులకు రూ.1,052 కోట్లతో టెండర్లకు ఆమోదించారు.ఇక ఇప్పటికే ప్రభుత్వం భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమరావతికి చుట్టు పక్కల ఉన్న ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పలుచోట్ల వినోద, క్రీడలు, తదితర వాటికి హబ్‌లుగా తీర్చిదిద్దేందుకు సీఆర్డీఏ సన్నద్ధమవుతోంది. ఎక్కువ విస్తీర్ణంలో అటవీ భూములు తీసుకునేందుకు సీఆర్డీఏ ప్రయత్నాలను ప్రారంభించింది. మళ్లింపు (డైవర్షన్) విధానంలో ఈ భూములను తీసుకుని ఇతర ప్రాంతాల్లో ఇంతే విస్తీర్ణంలో బదలాయించేందుకు దృష్టి సారించిందన్న విషయం సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. రాజధాని ప్రాంతంలోని వివిధ అటవీ బ్లాక్‌లలో పలు కార్యకలాపాలు చేపట్టేందుకు సీఆర్డీఏ నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాల్లో సుమారు 10,357 ఎకరాల అటవీ భూమి ఇతర అవసరాల రీత్యా మళ్లించనున్నారు. డీనోటిఫికేషన్ కంటే డైవర్షన్ విధానం మేలన్న నిర్ణయానికి వచ్చారు. దీని కోసం సీఆర్డీఏ అధికారులు ఏలూరు, గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అటవీ అధికారుల నుంచి వివరాలను తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని గుడిమెట్ల, కొత్తూరు, చంద్రగూడెం, దాసుళ్లపాలెం, టి.గన్నవరం,తోలుకోడు, వెల్వడం, కొండపల్లి, జంగాలపల్లి. కృష్ణా జిల్లోలోని మెట్లపల్లి, ఏలూరు జిల్లాలోని కాత్రేనిపాడు, వట్టిగుడిపాడు నుంచి 5,090.52 ఎకరాలు తీసుకోనున్నారు. గుంటూరు, పల్నాడులో కర్లపూడి, కొండవీడు, మోతడక, నిడుముక్కల, పెదమద్దూరు, వెంకటాయపాలెం ఎక్స్‌టెన్షన్1, 4, 5, 7, 8 బ్లాక్‌ల్లో 5,267.28 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. ఈ భూములకు సంబంధించి గతంలో సర్వే చేసిన వివరాలు, పటాలను సీఆర్డీఏ అధికారులు తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేష కుమార్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## సొంత మండలాల్లో పోస్టింగ్ లేదు..

>> రిక్వస్ట్ ట్రాన్స్‌ఫర్లుగా పరిగణించి భత్యాలు వర్తింపచేయాలి. +ఐటీడీఏల్లో మొదట ఖాళీలు నింపాలి.అంతర్గత వెనుకబడిప ప్రాంతాల్లో ఖాళీల భర్తీకి ప్రాధాన్యమివ్వాలి.ఐటీడీఏ ప్రాంతాల నుంచి బదిలీ అయిన వారి స్థానంలోకి వేరొకరు వచ్చి చేరాకే రిలీవ్ చేయాలి.హేతుబద్ధీకరణ,బదిలీలు ఒకేసారి జరుగుతాయి.గ్రామ,వార్డు సచివాలయాల ఉద్యోగుల హేతుబద్ధీకరణ,బదిలీలను ప్రభుత్వం ఒకేసారి చేపట్టింది. హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలు (నంబర్లు 1,3,4) అనుసరించి బదిలీలు చేయాలని కలెక్టర్లకు సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరిలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు,'బీ'లో ఏడుగురు,'సి'సీలో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని సూచించింది. జనాభా పరంగా సచివాలయాలను ప్రభుత్వం పలు కేటగిరిలుగా విభజించింది. 'ఏ' కేటగిరి సచివాలయాల్లో ఆరుగురు,'బీ'లో ఏడుగురు,'సీ'లో ఎనిమిది మంది ఉద్యోగులను ఉంచాలని నిర్ణయించింది. వీరికి స్పెసిఫిక్ పర్పస్ (టెక్నికల్),జనరల్ పర్పస్ ఫంక్షనరీలుగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను బదిలీల్లో కలెక్టర్లు పాటించనున్నారు. హేతుబద్ధీకరణ,బదిలీల ప్రక్రియ పూర్తయ్యాక సచివాలయాల్లో మిగులు ఉద్యోగులను ఇతర ప్రభుత్వ శాఖలకు డిప్యుటేషన్‌లపై పంపనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల నుండి 15 వేల మంది మిగులు ఉద్యోగులు ఉంటారని అంచనా. వీరందర్నీ ప్రస్తుతానికి అవే సచివాలయాల్లో కొనసాగిస్తారు. ఇతర ప్రభుత్వ శాఖల్లో అవసరాల మేరకు వీరిని దశలవారీగా డిప్యుటేషన్లపై పంపాలని నిర్ణయించారు. గత వైకాపా ప్రభుత్వం ఒక్కో సచివాలయంలో 8 నుండి 12 ఉద్యోగులను నియమించింది. హేతుబద్ధీకరణలో ఆ సంఖ్యను 6 నుండి 8కి కూటమి ప్రభుత్వం తగ్గించింది.

## తుని మున్సిపాలిటీలో 26లక్షల నగదు గోల్‌మాల్ జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో జూన్ 13 ప్రభాతవార్త:** తుని మున్సిపాలిటీలో 26 లక్షల నగదు గోల్మాల్ ఘటన వెలుగు చూసింది. ఈ గోల్మాల్ వ్యవహారంలో మున్సిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న ఎం. సునీత నిధులను దుర్వినియోగం చేసినట్లు వచ్చిన ఆరోపణపై మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకట్రావు ఆమెను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ భాగాలలో పన్నుల రూపంలో వసులైన నగదుతో పాటు, చిట్టా వసూళ్లను సైతం సునీత బ్యాంకులో పిడిఖాతాలలో జమ చేయాల్సి ఉండగా, గత ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుండి ఈ ఏడాది ఫిబ్రవరి 6వతేదీ వరకు జమైన సొమ్మును 26లక్షల 20వేల 75 రూపాయల నగదును జమ చేయకుండా తప్పుడు లెక్కలతో బురిడీ కొట్టించినట్లుగా తేలింది. ఎట్టకేలకు ఉన్నతాధికారులు రంగంలోకి దిగి రికార్డులను క్షుణంగా పరిశీలించగా నిధులు గోల్‌మాల్ వ్యవహారం బయటపడినట్లు మున్సిపల్ ఆఫీస్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.పురపాలక శాఖ ఆర్డి నాగ నరసింహారావు ఆదేశాలతో అధికారుల బృందం గోల్ మాల్ ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## మర్రిపాడు జాతీయ రహదారి పై భారీగా నగదు పట్టివేత

**మర్రిపాడు (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** మండలంలోని జిల్లా సరిహద్దు వద్ద గుర్తుతెలియని కారు కలకలం స్థానికుల సమాచారంతో బాట సింగనపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై MP 09 ZJ 1076 రిజిస్ట్రేషన్ కియా కారును స్వాధీన పరుచుకున్న పోలీసులు కారులో భారీ ఎత్తున నగదు తరలిస్తూకారు వదిలి నగదుతో పరారైన డ్రైవర్,మరో వ్యక్తి గుజరాత్ కు చెందిన ఓ వ్యాపార వేత్త ఇచ్చిన పిర్యాదుతుతో రంగంలోకి దిగిన పోలీసులు నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని రహస్యంగా విచారిస్తున్నట్లు సమాచారం ఈ ఘటనతో ఒక్క సారిగా యాక్టివ్ అయిన జిల్లా పోలీసు యంత్రాంగం మర్రిపాడు (మం) బాటా సింగనపల్లి సమయపంలో 565 జాతీయ రహదారిపై నిన్న ఉదయం నుండి ఆగి ఉన్న కారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకొని కారును పరిశీలించి అనుమానాస్పద కారుగా గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర రిజిస్ట్రేషన్‌గా గుర్తించిన పోలీసులు కారులో భారీగా నగదు తరలించినట్లు సమాచారం రావడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కారు వదిలేసి పారిపోయిన నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పోలీసులు నిందితుల నుండి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నట్లు అనుమానం. వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.

## కేంద్ర సర్వీసులకు ఇద్దరు సీనియర్ ఐఎఎస్ అధికారులు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి చెందిన ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు కేంద్ర సర్వీసులకు వెళ్తున్నారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శిగా ఉన్న జె. నివాస్‌ను జనగణన కార్యకలాపాల డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అలాగే 2011 బ్యాచ్ కు చెందిన రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ఐజీగా ఉన్న ఎం. హరి నారాయణన్, ఢిల్లీలోని తాగునీరు, పారిశుద్ధ్య శాఖలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వీరు ఇరువురినీ వెంటనే రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. జె. నివాస్ వెళ్లడంతో ఖాళీ అయిన ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి నియామకానికి చర్యలు తీసుకోవాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని సీఎస్ విజయానంద్ ఆదేశించారు. ప్రస్తుతం వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్‌గా ఉన్న వీరపాండియన్‌కు రిజిస్ట్రేషన్ స్టాంపుల శాఖ ఐజీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఎస్ విజయానంద్ ఆదేశాలిచ్చారు.

## మరో నాలుగురోజులు భారీ వర్షాలు

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర కోస్తాంధ్రను ఆనుకుని ఉన్న దక్షిణ ఒడిషా మీదుగా సముద్ర మట్టానికి 5.8 కిలో మీటర్ల ఎత్తు వరకూ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దీని నుంచి ఛత్తీస్‌గఢ్, మరాఠ్వాడ, ఇంటీరియల్ కర్ణాటక వరకూ ద్రోణి విస్తరించి ఉందని ఒక ప్రకటనలో పేర్కొంది. వీటి ప్రభావంతో రానున్న నాలుగు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. శుక్రవారం ఎన్టీఆర్ ,పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కృష్ణా,గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో కొన్ని చోట్ల పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని సంస్థ పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. శనివారం.. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

## 16 కల్లా ఉపాధ్యాయుల బదలీ

>> మంది పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తూ వీడి యోలు, స్క్రీన్ షాట్ మేసేజ్‌లు పెడుతున్నారని తెలిపారు. తల్లి దండ్రుల ఫీడ్ బ్యాక్ చాలా ఆనందం కలిగిస్తోందన్నారు. గతంలో పని చేసిన విద్యశాఖ మంత్రికి కనీసం బేసిక్స్ తెలియవు. యూడైస్‌లో ప్రీప్రైమరీ, ఎల్ కేజీ, యూకేజీ పిల్లలు ఉంటారు. ఈ స్కీమ్ వారికి వర్తించదు. గత ప్రభుత్వం గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియో(జీఈఆర్) చూపించేందుకు 18ఏళ్ల కంటే ఎక్కువ వయసున్న వారిని తీసుకువచ్చి ఏకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువు తున్నారని వారిని ఎన్‌రోల్ చేయడం జరిగింది. పక్క రాష్ట్రంలో చదువుతున్న పిల్లలను తీసుకువచ్చి ఆంధ్ర రాష్ట్రంలో చదువు తున్నారని చూపించడం జరిగింది. నా వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి. విద్యార్థులను డ్రాప్ బాక్స్‌లో పెట్టారు. మొత్తం పరిశీలిస్తే దొంగలెక్కలు ఉన్నాయని తేలింది. ఒక విద్యాశాఖ మంత్రికి ఎంత మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నారో తెలుసుకునేందుకు నాకు వంద రోజులు పట్టింది. గతంలో విద్యాశాఖను ఏవిధంగా నడిపించారో నాకు తెలియదు. ఏదో నెంబర్లు ఉన్నా యంటే వారెందుకు అమ్మఒడి ఇవ్వలేదు? అర్హులు ఎంతమంది ఉన్నారో వారందరికీ ఇచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. మొత్తం లిస్ట్ జీఎస్ డబ్ల్యూఎస్‌లో పెడతాం.సాయం అందకపోతే ఎందుకు రాలేదో మనమిత్రకు వెళ్లి తెలుసుకో వచ్చు. కరెక్ట్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.

## ముగ్గురి ప్రాణం తీసిన కారు

>> పాతపేటకు చెందిన సయ్యద్ దిలీప్‌కు శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అతని అల్లుడు సయ్యద్ అలీ తన కారులో చికిత్స నిమిత్తం చిత్తూరుకు పయనమయ్యాడు. ఆ సమయంలో వీరితో పాటు సయ్యద్ దిలీప్ భార్య ముబినా, కుమార్తె ఫాతిమా, మనుమరాలు సహద్‌లు బయలుదేరారు. చిత్తూరుకు వస్తున్న వీరి కారు అతివేగంగా తిమ్మోజిపల్లి వద్ద సర్వీసు రోడ్డు ప్రక్కన నిల్చొని వున్న రాజేంద్రనాయుడు, సాదరయ్యలను ఢీకొంది. ఆ సమయంలో కారును అదుపు చేయలేకపోవడంతో సమీప మామిడి తోటలోకి కారు దూసుకెళ్ళి పల్టీలు కొట్టింది. ఈ సంఘటనలో రాజేంద్రనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కారు వెనుక సీటులో సయ్యద్ దిలీప్ సైతం మృత్యువాత పడ్డాడు. తీవ్రంగా గాయపడిన సాదరయ్య, ముబినా, ఫాతిమా, సహద్, సాహిద్ అలీలను చికిత్స నిమిత్తం 108 వాహనంలో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అనంతరం మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాదరయ్య మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు.

# పెను విషాదం

>> నింపారు. ఆయన వెంట గుజరాత్ సిఎం భూపేంద్ర పటేల్, కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రహోంమంత్రి హర్షసంఘవి తదితరులు ఉన్నారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థంచేసుకోగలనంటూ విచారం వ్యక్తంచేసారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం వెంటాడుతుందని, ఆ వేదనను మాటల్లో చెప్పలేమన్నారు. విషాద సమయంలో తన ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలగురించేనన్నారు. ఆ తర్వాత అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో మోడీ ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. ఇదేరోజు ఎయిరిండియా ఎండి సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్‌కూడా ప్రమాదస్థలాన్ని సందర్శించి ప్రమాదం తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా అహ్మదాబాద్‌కు చేరుకుని సమీక్షచేసారు. మరోవైపు ప్రమాదస్థలంలో జాగిలాల సాయంతో మృతదేహాలను గుర్తించి వెలికితీసేపనిలో సిబ్బంది నిమగ్నం అయ్యారు.

**ఎలా బతికానోకూడా తెలియదు..మోడీకి బాధితుడి వివరణ:** కాగా చికిత్సపొందుతున్న విశ్వాస్‌కుమార్‌తో మోడీ మాట్లాడారు. నమ్మలేకుండా ఉందని, ఎలా బతికానో కూడా తెలియడంలేదని చెప్పాడు. విమానంలో 11ఎ సీటులోక ఊర్చున్న రమేష్ ఎమర్జెన్సీ విండోనుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నారంటూ తొలుత పోలీసులు చెప్పారు. ఆతని సోదరుడు ధీరేంద్ర సోమ్‌భాయ్‌కూడా అదే స్టేట్‌మెంట్ ఇచ్చారు. అయితే రమేష్ మాత్రం జరిగింది అదికాదని స్పష్టతఇచ్చారు. అంతా క్షణాల్లో జరిగిపోయిందని, తమ విమానం నేలకూలుతుందన్న విషయం తనకు అర్థమయిందని, ఆవెంటనే విమానం కిందకువచ్చి ముక్కలయి పేలిపోయిందని ప్రమాదక్షణాలు గుర్తుచేసుకున్నాడు.38 ఏళ్ల బ్రిటిష్ ఇండియన్ అయిన రమేష్ అద్భుతం జరిగిందని ప్రమాద సమయంలో విమానం రెండుముక్కలయిందని,తనసీటు ఎగిరి కొంచెం దూరంలోపడిపోయిందని ఈక్రమంలోనే తనకు గాయాలయ్యాయని చివరకు ప్రాణాలతో బయటపడ్డానని రమేష్ ప్రధానికి వివరించారు.

## దొరికిన బ్లాక్ బాక్స్

>> అధికారులు విశ్లేషిస్తున్నారు. ఇప్పుడు బ్లాక్ బాక్స్ లభ్యం కావడంతో ప్రమాదానికి ఖచ్చిత మైన కారణాలు తెలిసే అవకాశం ఉంది. విమాన ప్రమాదాల్లో బ్లాక్ బాక్స్ కీలకం అవు తుంది. ఇది ఆరెంజ్ కలర్‌లో ఉంటుంది. విమానం, హెలికాప్టర్ల ప్రమాదం జరిగేకంటే కనీసం రెండు గంటల ముందు ఏం జరిగిందన్న వివరాలను ఈ బ్లాక్‌బాక్స్ స్టోర్ చేసుకుంటుంది. విమానాలు క్రాష్ అయినా ఇందులోని సమా చారం తొలగిపోదు. ప్రమాదానికి గల కారణం, ప్రమాదానికి ముందు ఏం జరిగింది.. తదితర సమాచారం అంతా ఈ బ్లాక్ బాక్సులో నిక్షిప్తమై ఉంటుంది. ఈ సమాచారం ద్వారా ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తారు.

## బోయింగ్ డ్రీమ్‌లైనర్లు నిలిపివేసే యోచన

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాద దుర్ఘటన నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. భద్రతా సమీక్ష జరిపేంత వరకూ బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానాలను తాత్కాలికంగా నిలిపివేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇందు కోసం భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య సంప్రదింపులు జరుగుతున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. అహ్మదాబాద్ దుర్ఘటనపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నందున అది పూర్తి కాగానే 7878 విమాన సేవలు కొనసాగించాలా, వద్దా? అనే దానిపై కేంద్రం ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. అహ్మదాబాద్‌లో గురువారం బోయింగ్ 7878 విమానం కుప్పకూలిన ఘటనలో విమానంలోని 242 మంది ప్రయాణికుల్లో 241 మంది మృతిచెందగా, ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటలకు టేకాఫ్ అయిన వెంటనే అనూహ్యంగా బీజే మెడికల్‌కాలేజీ డాక్టర్ల రెజిడెన్షియల్ క్వార్టర్డ్‌లోకి విమానం దూసుకుపోయింది. ఆ తర్వాత మంటల్లో చిక్కుకుంది. ఇంజన్లలో ముందుకు లాగే శక్తి కోల్పోవడం, పక్షి ఢీకొనడం వంటివి విమానం కూలిపోవడానికి కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787 విమానం అత్యాధునిక నేవిగేషన్ వ్యవస్థలు కలిగి ఉండి ఇంధనాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకుంటుందనే పేరుంది. 2011 అక్టోబర్‌లో ఈ డ్రైమ్‌లైనర్ సేవలు మొదలైనప్పటి నుంచి గత 14 ఏళ్లలో 100 కోట్ల మంది ప్రయాణికులను సురక్షితంగా చేరవేసిందని, ఏవియేషన్ చరిత్రలో ఏ డ్రీమ్‌లైనర్ కూడా ఇంత వేగంగా రికార్డు సాధించలేదని బోయింగ్ వెబ్‌సైట్ చెబుతోంది. ఈ మోడల్ ప్రవేశపెట్టినప్పటి నుంచి 2,500 వరకూ 787 ల అమ్మకాలను బోయింగ్ జరుపగా, ఎయిర్ ఇండియా 47 విమానాలను కొనుగోలుచేసింది. కాగా, అహ్మదాబాద్‌లో విమానంకుప్పకూలిన ఘటనపై ఉన్నత స్థాయి దర్యాప్తునకు కేంద్రం ఆదేశించినట్లు పౌరవిమానయానమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## గాయపడిన మరో ఐదుగురు మెడికోల మృతి

**న్యూఢిల్లీ:** అహ్మదాబాద్‌లో గురువారం ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ దుర్ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మందితో పాటు, విమానంకూలిన ప్రదేశంలోని నివాస భవ నాల్లో ఉన్న ఐదుగురు పౌరులుకూడా మరణించారు. ఈ విషాద ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. భారత్‌కు ఈ క్లిష్ట సమయంలో అండగా నిలుస్తామని, అవసరమైన సహాయం అందించేందుకు అమె రికా సిద్ధంగా ఉందని ఆయన ప్రకటించారు. విమాన శకలాలు, కాలిపోయిన వస్తువులు ఘటనా స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. ఇప్పటికే జిజె వైద్యకళాశాల హాస్టల్‌భవనంపై పడటంతో సీనియర్‌డాక్టర్లు, రెసిడెంట్ డాక్టర్లు పలువురు మృతిచెందారు. ముందురోజు 20 మందికి పైగా మృతిచెందగా శుక్రవారం తాజాగా మరో ఐదుగురు మృతిచెందారని అధికారులు ధృవీకరించారు.

# నేతన్నలకు వేతనాలు పెంపు

>>వ్యవసాయం తర్వాత చేనేత రంగంపైనే ఎక్కువ మంది ఆధారపడి ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నేతన్నల సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగిందన్నారు. అధికారంలోకి రాగానే నేతన్నలకు చేదోడుగా ఉండేందుకై ఎగ్జిబిషన్లు, విక్రయదారులు, కొనుగోలు దారుల సమావేశాలు నిర్వహించడం జరిగిందని, ఆధునిక డిజైన్లపై నేతన్నలకు శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగిందని ఆమె తెలిపారు. అదే విధంగా ఎన్నికల సమయంలో చేనేతలకు 50 సంవత్సరాలకే ఫించను ఇస్తామని ఇచ్చిన హామీని నిలపెట్టుకోవడం జరిగిందని, ప్రతి నెలా రూ.4 వేల చొప్పున దాదాపు 92,274 మంది నేతన్నలకు ఫించను అందజేయడం జరుగుచున్నదన్నారు. నేతన్న మగ్గాలకు ఉచితంగా విద్యుత్తు అందజేయడం జరుగుచున్నదని, మర మగ్గాలకు 500 యూనిట్లు, చేతి మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్లు ఉచితంగా అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. గృహ నిర్మాణ పథకం క్రింద కూడా నేతన్నలకు రూ.50 వేలు అదనంగా అందజేయడం జరుగుచున్నదన్నారు.

**చేనేత, హస్తకళల నూతన డిజైన్ల పోటీలు:** .రాష్ట్రంలోని నేత కార్మికులతో పాటు హస్తకళాకారుల ప్రతిభను వెలికితీసే ఉద్దేశంతో నూతన డిజైన్ల కోసం పోటీలు నిర్వహించబోతున్నామని మంత్రి తెలిపారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఆప్కో, లేపాక్షి ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ నెల 17 నుంచి 30 రోజుల పాటు నూతన డిజైన్లను కళాకారుల నుంచి స్వీకరిస్తున్నామన్నారు. పలు కేటగిరీల్లో ఉత్తమ డిజైన్లను ఎంపిక చేసి విజేతలకు రూ.5 లక్షల నగదు బహుమతులు అందజేయనున్నామని ఆమె తెలిపారు.

**నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం :** నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టం చేశారు. గురువారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్ర కోటి సదాశివం కలిసి పలుసమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ,నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. రూ.1000కోట్లతో ఆదరణ పథకం పునరుద్ధరించామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80% రాయితీతో రైతులకు డ్రోన్లు

>> మనుషులతో అయితే 100 లీటర్ల దాకా పడుతుంది. డ్రోన్ నేరుగా మొక్క మీదకు స్ప్రే చేస్తుంది. దీనివల్ల మందు వృథా కాదు. మనుషులు చల్లితే వృథా ఎక్కువగా ఉంటుంది. డ్రోన్‌తో మందు పిచికారీ చేస్తే ఎకరాకు రూ.350వసూలు చేస్తారు. అదే మనుషులైతే ఇద్దరు కూలీలు అవసరమవుతారు. రైతులకు ఇచ్చే డ్రోన్ 12లీటర్ల ట్యాంకుతో కలిపి దాని బరువు 29 కేజీలు. ఈ డ్రోన్‌తో రోజుకు 10 ఎకరాల్లో మందు పిచికారీ చేయగలదు.డ్రోన్‌తో మందులు స్ప్రేచేయిస్తే ఆరోగ్య సమస్యరావు.మనుషుల చల్లితే ముక్కు,నోట్లోకి మందువెళ్ళి,దీర్ఘకాలం లోపల వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉంది. ఊపిరితిత్తులు, శ్వాసకోశ,జీర్ణాశయ వ్యాధులు సోకే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

## ప్రమాదస్థలంలో చెక్కుచెదరని 'భగవద్గీత' పుస్తకం లభ్యం!



**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లో ఏవియేషన్ చరిత్రలోనే కనీవినీ ఎరుగని విధంగా జరిగిన బోయింగ్ ప్రమాదంలో మొత్తం భస్మీపటలం అయినప్పటికీ ఆ ప్రమాద స్థలంలో ఒక భగవద్గీత పుస్తకం మాత్రం చెక్కుచెదరకుండా నిలిచింది. ఈ పవిత్ర గ్రంథం చెక్కు చెదరకుండా ఉండడం, లోపలి పేజీలుకూడా కాలిపోకుండా సురక్షితంగా నిలవడంపై అందరూ ఆశ్చర్యపోతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో విస్తృతంగా ఈ దృశ్యం వైరల్ అవుతోంది. ప్రమాదస్థలంలో గాలిస్తున్న సిబ్బంది ఒకరు గీత పుస్తకం పేజీలను తిప్పి చూపిస్తున్నారు. ఈసంఘటన గీత సందేశం యొక్క శాశ్వత పవిత్రతను సూచిస్తున్నదని, కష్టసమయాల్లో అర్థంచేసుకునేందుకు కష్టాల్లో ఉన్న వారు గీత పారాయణం చేస్తారని నెటిజన్లు విస్తృతంగా స్పందించారు. హిందూ తత్వశాస్త్రంలో భగవద్గీతకు కేంద్రస్థానం ఉంది. విధి నైతికత జీవితం మరణం యొక్క స్వభావంపై ప్రతిబింబాలను అందిస్తుంది. ప్రమాదం సందర్భంలో కొంతమంది ఈ పుస్తకాన్ని చదువుకుని ఉంటారని తెలుస్తోంది. ఈవిడియో ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌పై షేర్‌చేసిన కొన్నినిమిషాలకే 5.77 లక్షలమంది చూసారు.

## వారం - వర్జ్యం

తేది : 14-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
తదియ మ.3.44
ఉత్తరాషాఢ రా.12.20
వర్జ్యం తె.4.26-7.15
దు.తె.5.35-7.15
శుభసమయం :ఉ.5.15-5.45
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభ కార్యాల ప్రస్తావనవుంటుంది.

**వృషభం:** కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం. ఉద్యోగులలో ఇంక్రిమెంట్లు పొందుతారు.

**మిథునం:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. మానసిక ప్రశాంతత పొందుతారు. ఆరోగ్యంపట్ల జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** బంధువులను కలిసి కష్టసుఖాలను పంచుకొంటారు. కొత్త కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు.

**సింహం:** కళా, రాజకీయ రంగాల వారు సన్మానాలు, సత్కారాలు పొందుతారు.

**కన్య :** దీర్ఘకాలిక కోర్టుకేసుల నుండి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధి సాధిస్తారు.

**తుల :** ప్రముఖులతో ముఖ్య విషయాలపై ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిస్తారు. అనుకోని విధంగా డబ్బు చేతికందుతుంది.

**వృశ్చికం:** సోదరుల నుండి విలువైన సమాచారం అందుకొంటారు. గృహం, వాహనాల కొనుగోలు యత్నాలు నిదానంగా ఫలిస్తాయి.

**ధనుస్సు:** దీర్ఘకాలిక సమస్యల నుండి బయటపడతారు. రుణవత్తిడులు తొలుగుతాయి.

**మకరం:** ఆర్థికపరమైన ఇబ్బందులు తొలుగుతాయి. ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశం మీ చెంతకువస్తుంది.

**కుంభం:** అన్ని పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా జరుగుతాయి.

**మీనం :** వృత్తి, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదురై చికాకులు పెడతాయి. కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## రాయలసీమ రైల్వే డివిజన్ పర్యటనకు దక్షిణ కోస్తా రైల్వే జిఎం సందీప్ మాథూర్



గుంతకల్లు రైల్వే,జూన్ 13,ప్రభాతవార్త నవ్యాంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటు కానున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ తొలి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాథూర్ తన తొలి అధికారిక పర్యటనను రాయలసీమలోని గుంతకల్లు రైల్వే డివిజన్ నుండి శ్రీకారం చుట్టారు. ఈ నెల 15న ఆదివారం తెల్లవారుజామున 3.35గంటలకు విశాఖపట్నం నుంచి తిరుపతికు నెంబర్ 17481బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి తిరుపతికి రాత్రి 10.30గంటలకు చేరుకుంటారు. తిరుగు ప్రయాణంలో తిరుపతి నుంచి విజయవాడకు సోమవారం సాయంత్రం 5.15గంటలకు బెంగళూరు నుంచి కాకినాడ వెళ్లే నెంబర్ 17209శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి విజయవాడ వెళతారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తిరుపతికి దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం పర్యటన ఖరారు కావడంతో గుంతకల్లు రైల్వే డివిజనల్ అధికార యంత్రాంగం తిరుపతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న రైల్వే స్టేషన్ పనుల వివరాలతో పాటు గుంతకల్లు రైల్వే డివిజన్ భౌగోళిక స్వరూపం,సరిహద్దులు, డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, మౌలిక సదుపాయాల కల్పన పనులను, సరుకు రవాణాకు సంబంధించిన లోడింగ్ పాయింట్లు, రైళ్ల రాకపోకల వివరాలు డివిజన్‌కు సంబంధించిన సమగ్ర సమాచార నివేదికను జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్‌కు అందచేసే నిమిత్తం ప్రత్యేకంగా రూపొందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# 20వేల నుండి లక్షదాటిన భక్తులు !



- వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంతోనే వెలుపల క్యూలైన్ల నియంత్రణ

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల: 1990వ సంవత్సరంవరకు రోజుకు 20వేలమంది భక్తులు మాత్రమే తిరుమలకు చేరుకునేవారు. ఇలా వచ్చిన వీరికందరికీ ఆలయంలోపల ఆనందనిలయంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామిని మరీ దగ్గరగా వీక్షించేలా కులశేఖరపడివరకు అనుమతించేవారు. 1992వ సంవత్సరంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య రోజువారీగా 30వేలకు చేరింది. దీంతో అదే సంవత్సరం ఆలయం లోపల రాములవారిమేడవరకు (లఘుదర్శనం) మాత్రమే అనుమతించి దేవుని దర్శనం చేయించేవారు. ఇలా 2000వ సంవత్సరంలో ఈ రద్దీ కాస్త పెరిగి రోజుకు 60వేలమంది వరకు వచ్చేవారు. ఉన్న వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తులు అసౌకర్యానికి గురయ్యేవారు. దీన్ని తెలుసుకున్న అప్పటి రాష్ట్రప్రభుత్వం, టిటిడి పాలకమండలి అదనంగా మరో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ అవసరాన్ని గుర్తించింది. తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య మరింతగా పెరగడంతో 2000 సంవత్సరంలో వైకుంఠమ్ 2 కాంప్లెక్స్ నిర్మించి క్రౌడ్‌మేనేజ్ చేశారు. అక్కడ నుండి ప్రతి ఏటా తిరుమలేశుని దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం శ్రీవారి భక్తులు రోజువారీగా అనూహ్యంగా లక్షమంది దాటడంతో ఔటర్ రింగురోడ్డు శిలాతోరణంవరకు కిలోమీటర్ల క్యూలైన్లలో భక్తులు ఎండకు,వానకు,చలికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. సాధారణ రోజుల్లోనే లక్షమందివరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. ఇక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు, విశేషరోజుల్లో 1.50లక్షల మంది వరకు భక్తులు చేరుకుంటున్నారు. సాధారణరోజుల్లోనే లక్షమందివరకు భక్తులు కొండపైకి వస్తే వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు నిండిపోతున్నాయి. ఒక్కోకంపార్టుమెంట్‌లో 400మంది లెక్కన 25వేలమంది వరకు భక్తులు కూర్చునేందుకు సౌకర్యంగా ఉంటుంది. ప్రస్తుతం తిరుమలలో 40వేలమంది భక్తులు వస్తేనే వైకుంఠమ్ -1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి నారాయణగిరిషెడ్లు నిండి ఆలయం వెలుపల మూడుకిలోమీటర్ల దూరం భక్తుల లైన్లు వ్యాపిస్తున్నాయి. గంటకు 4,500మంది భక్తులకు మహాలఘువిధానం (ఆలయంలోపల జయవిజయులవరకే)లో అనుమతిస్తున్నా 90వేలమందికి మాత్రమే దర్శనం చేయించగలుగుతున్నారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్యదైవమ్... ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం రోజురోజుకూ,ఏడాదికేడాది భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపవుతున్న నేపథ్యంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లు సాధారణరోజుల్లోనే నిండిపోతున్నాయి. వైకుంఠమ్ కాంప్లెక్స్‌లు నిండితేనే భక్తులకు కష్టాలు మొదలవుతాయి. ఎండకు,వానకు ,చలికి ఇబ్బందులు పడటం తప్పడంలేదు. ఇప్పటికీ టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వెలుపల క్యూలన్లలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించారు. దీంతో భక్తులు కొంతవరకు సంతోషంగా నిరీక్షిస్తున్నారు. అయితే తిరుమలేశుని దర్శనార్థం దేశవిదేశాల నుంచి కొండకు వస్తున్న భక్తుల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. నెలవారీగా 23లక్షలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండటం జరుగుతుంది. లక్షమంది భక్తులకు మరింత సులభంగా దేవుని దర్శనం చేయించడం గగనంగా మారింది. వచ్చిన ప్రతి భక్తునికి సంతృప్తికర దర్శనమ్ కల్పించే మాట ఎలా ఉన్నా ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తులు సంతోషంగా తిరిగి వెళ్ళాలని తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు ఆకాంక్షించడం పరిపాటి. అంతేగాక మహాలఘు దర్శనం కూడా లఘుదర్శనం చేయించే భాగ్యం కలుగుతుందనే సూచనలు వినిపిస్తున్నాయి. సులభంగా భక్తులు ఆలయంలోనికి చేరుకునేందుకు వీలుగా 2014వ సంవత్సరంలోనే వైకుంఠమ్ 1కు సమీపంలో ఏటిసి వద్ద ప్రత్యేక ప్రవేశ దర్శనాల కాంప్లెక్స్‌ను, కాలినడక భక్తులకు దివ్యదర్శనం కాంప్లెక్స్‌కు అప్పటి టిటిడి ఇఒ డాక్టర్ సాంబశివరావు,జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజులు ముందుచూపుతో నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఏడుకొండలపై 50వేలమంది భక్తులు సంఖ్య పెరిగితేనే క్యూలైన్లు తిరుమల వెలుపల కిలోమీటర్లదూరం విస్తరిస్తున్నాయి.

# తిరుమల సమాచారం

## టిటిడి ట్రస్ట్‌లకు ఇద్దరు దాతల విరాళాలు



తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలతిరుపతిదేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా పేదవారికి ఉచితంగా అవసరమైన శస్త్రచికిత్సలు, గుండె ఆపరేషన్లు ఇతరత్రా మెరుగైన వైద్యసేవలందించేందుకు వీలుగా టిటిడి అమలుచేస్తున్న ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు, బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి ఇద్దరు దాతలు శుక్రవారం 20.50లక్షలు రూపాయలు డిడిలను అందించారు. విజయవాడలోని ఫార్చ్యూయన్‌ఫైన్ జ్యువెలర్స్ కోమటి సునీల్ ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు 10.50లక్షలు రూపాయలు డిడిలు, తాడేపల్లిగూడెంకు చెందిన మాతురు పంచాక్షరి బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 10,00,116రూపాయలు డిడిని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు. దాతలను ఆయన అభినందించారు.

## 'లడ్డూ'ప్రసాదంపై ఆరోపణలు నమ్మొద్దు

- నాణ్యతతో రుచి, శుచిగా లడ్డూలు తయారీ



తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం తరువాత అంతటి పవిత్రమైన లడ్డూ ప్రసాదం ఎంతో భక్తితో రుచిగా,శుచిగా తయారుచేసి విక్రయిస్తున్నట్లు టిటిడి స్పష్టం చేసింది. అయితే తెలంగాణా రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లాకు చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తి తిరుమల లడ్డూప్రసాదంపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తున్నాడని తీవ్రంగా పేర్కొంది. జూన్ 8వతేదీ స్వామివారిలడ్డూప్రసాదం తినే సమయంలో నోటిలో గాయమైందని ఆరోపణలు చేశాడు. వెంటనే స్పందించిన టిటిడి అధికారులు అతనిని అంబులెన్స్‌లో తిరుమలలో అశ్వనీఆస్పత్రికి తీసుకెళ్ళి వైద్యపరీక్షలు చేశారు.ఆ తరువాత తిరుపతి స్విమ్స్‌ఆస్పత్రిలో కూడా వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపింది. ప్రసాదం తినేసమయంలో నాలుకను తానే కొరుక్కోవడంతో నాలుకక్రింద భాగంలో చిన్నపాటి గాయమైనట్లు రిపోర్టు వెలువడింది. దీనిపై టిటిడి నుండి నష్టపరిహారం పొందాలనే దురుద్దేశ్యంతో లడ్డూప్రసాదంపై సామాజిక మాధ్యమంలో అసత్యఆరోపణలు చేస్తున్నట్లు టిటిడి గుర్తించింది. దీన్ని తీవ్రంగా ఖండించి, భక్తులు గందరగోళానికి గురిచేయడం జరుగుతుందని టిటిడి తెలిపింది. భక్తులు లడ్డూప్రసాదంపై ఆరోపణలు, అపోహలు నమ్మవద్దని, ఎంతో శుచిగా రుచిగా తయారుచేస్తున్నారని వెల్లడించింది. ప్రస్తుతం అత్యాధునిక యంత్రాలతో లడ్డూ ప్రసాదం తయారీలో నాణ్యతలో ,శుచిలో రాజీఉండదని టిటిడి వివరించింది. లడ్డూల నాణ్యత, దిట్టంలో భాగంగా నెయ్యి, జీడిపప్పు, ఎండుద్రాక్ష,యాలకులు,పచ్చకర్పూరంమిశ్రమం కూడా శుచిగానే వాడకం వుంటుంది. లడ్డూల నాణ్యతపై ప్రస్తుత పాలకమండలి, టిటిడి ఉన్నతాదికారులు తరచూ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణా భక్తుడి ఆరోపణలు దురుద్దేశ్యంతోనని టిటిడి స్పష్టం చేసింది.

## శ్రీవారికి మొక్కులు తీర్చుకున్న కేంద్ర హామీలకమిటీ



తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: కేంద్రప్రభుత్వ హామీల కమిటీ ఛైర్మన్ డాక్టర్ ఎం.తంబిదురై ,సభ్యులు, రాజస్థాన్ హోంమంత్రి జవహర్‌సింగ్‌బేదమ క్రీడా మంత్రి కెకె బిష్ణోయ్ అనుచరులతో కలసి శుక్రవారం ఉదయం ఏడుకొండల వేంకటే శ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదా శీర్వచనం చేశారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## వెంకన్న ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి



తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో సినీనిర్మాతదగ్గుబాటి సురేష్‌బాబు, ఎంపి రఘునాథరెడ్డి, కేంద్రమంత్రి మలేశ్‌పాశ్వాన్, రాష్ట్రహైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విఆర్‌కె కృష్ణసాగర్ కుటుంబసభ్యులతో వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# భౌగోళిక వారసత్వ జాబితాలో బెలూం గుహలకు గుర్తింపు : మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: భౌగోళిక వారసత్వ జాబితాలో ప్రఖ్యాత బెలూం గుహలకు గుర్తింపు దక్కడంపై పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలోని బెలూం గుహలకు జీఎస్ఐ ప్రత్యేక గుర్తింపునివ్వడం సంతోషకరమన్నారు. పురాతన సంస్కృతీ నిలయాలు ఈ బెలూం గుహలని వెల్లడించారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటనతో పర్యాటకంగా మరింత ప్రాచుర్యం లభిస్తుందని తెలిపారు. ప్రపంచంలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలూం గుహలకు గుర్తింపు వచ్చింది. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో కొలువుదీరిన వీటిని భౌగోళిక వారసత్వ ప్రదేశంగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. సుమారు 23 ఎకరాల భూమి లోపల ఏర్పడిన వీటిని క్రీ.పూ.450 ఏళ్ల కిందట నివాస స్థలాలుగా వినియోగించినట్లు చరిత్ర చెబుతోంది. హెచ్‌బీ ఫూటే అనే ఆంగ్లేయుడు 1884లో వీటిని కనుగొన్నారు. తర్వాత 198284 మధ్యలో హెచ్‌డీ గేబర్ అనే జర్మనీ దేశస్థుడు తన సహచరులతో కలిసి 3 వేల 225 మీటర్ల వరకు శోధించి పటాన్ని తయారు చేశారు. 1988లో ఆంధ్రప్రదేశ్ పురాతత్వ శాఖ రక్షిత స్థలంగా ప్రకటించింది. 1999లో పర్యాటక శాఖ తమ ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి చేస్తోంది. బెలూం గుహలో 40 మెట్లు దిగిన తర్వాత 10 మీటర్ల లోతులో మొదలై 30 మీటర్ల లోతు వరకు సొరంగాలు ఉన్నాయి. ఇక్కడ కొన్నిచోట్ల ఇరుకుగా, మరికొన్ని చోట్ల విశాలంగా గదుల మాదిరిగా ఉంటుంది. కొన్నిచోట్ల స్టాట్రిక్ లైట్లు, స్మాల్ గేట్లు అని పిలిచే స్ఫటికాకృతులు ఏర్పడి ఉన్నాయి. కృత్రిమ శిలల ఆకృతులను బట్టి కొన్ని ప్రదేశాలకు వెయ్యి పడగలు, కోటి లింగాలు, ఐరావతం, ఊడలమర్రి, మాయామందిరం వంటి పేర్లు పెట్టారు. గాన ధ్యాన మందిరం, మండపం ఉన్నాయి. ఈ బెలూం గుహల చివరి వరకూ వెళ్తే పాతాళగంగ అనే నీటి మడుగుతోపాటు అక్కడే రాతిలో ఉన్న శివలింగం దర్శనమిస్తాయి ఏడాది పొడవునా 33 డిగ్రీల ఉష్ణోగ్రత : గుహల లోపల ఏడాది పొడవునా 33 డిగ్రీల స్థిరమైన ఉష్ణోగ్రత ఉండటమే కాకుండా గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ గుహలోని నీటికి సమీప గ్రామంలోని ఓ శివాలయం పక్కనే ఉన్న రాతి బావిలోని నీటికి సంబంధం ఉంది. 30 కిలో మీటర్ల దూరంలో తాడిపత్రి వద్దనున్న పెన్నా నది నీటిమట్టం కూడా దీనిపై ప్రభావం చూపుతోంది. జీఎస్ఐ జాబితాలో చోటు దక్కడం వల్ల బెలూం గుహలు మరింత అభివృద్ధికి నోచుకోనున్నాయన్నారు. ప్రపంచలో రెండోది, దేశంలోనే పొడవైన అంతర్భాగ గుహలుగా బెలూం గుహలు ప్రసిద్ధి చెందాయని వ్యాఖ్యానించారు. దేశ పర్యాటక ప్రదేశాల్లో రాష్ట్రంలోని బెలూం గుహలకు స్థానం దక్కుతుందని అన్నారు. విదేశీ పర్యాటకులను ఆకట్టుకునేలా మరింత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో పర్యాటక రంగం అభివృద్ధి తెండుతోందని వెల్లడించారు. బెలూం గుహలకు భౌగోళిక వారసత్వ ప్రాంతంగా గుర్తింపు లభించిన నేపథ్యంలో గుహల వద్ద యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

## 'హంస' ఆఫీస్ బేరర్ల ధ్రువపత్రాలు గుర్తించొద్దు

- వైద్య ఆరోగ్య శాఖ ఆదేశం

విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: సాధారణ బదిలీల్లో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్(హంస) నుంచి ఆఫీస్ బేరర్లుగా పేర్కొంటూ అందచేసిన ధృవపత్రాలను పరిగణనలోకి తీసుకోవద్దని వైద్య ఆరోగ్య శాఖ ఆదేశించింది. ప్రజారోగ్య శాఖ పరిధిలో ఉన్న ఈ సంఘం సభ్యత్వ నమోదు జాబితాలో ఉద్యోగ విరమణ చేసిన వారు,పొరుగు సేవల సిబ్బంది,చనిపోయిన వారి పేర్లు ఉన్నాయి. సంస్థాగత ఎన్నికలు,ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు చోటు చేసుకున్నట్లు విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో 'హంస' సంఘం గుర్తింపును తాత్కాలికంగా రద్దు చేసి,లోతుగా విచారణ చేసేందుకు మరో కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. మరోవైపు...ఈ సంఘం తరపున ఆఫీస్ బేరర్లుగా ఉన్నామంటూ ప్రజారోగ్య శాఖ ప్రధాన కార్యాలయం,26 జిల్లాల్లో కలిపి 249 మంది బదిలీల్లో భాగంగా అధికారులకు దృవపత్రాలు సమర్పించారు. ఈ బదిలీల వరకు గుర్తించొద్దని జిల్లాలకు ఆదేశాలు పంపినట్లు ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ వెల్లడించారు.

## చర్లపల్లి-తిరుపతి మధ్య తిరిగే ప్రత్యేక రైళ్లు జూలై వరకు పొడిగింపు

గుంతకల్లు రైల్వే,జూన్ 13,ప్రభాతవార్త సీమాంధ్ర మీదుగా చర్లపల్లి-తిరుపతి-చర్లపల్లి మధ్య రెండు వేర్వేరు మార్గాలలో తిరుగుతున్న ప్రత్యేక రైలు సర్వీసులను ప్రయాణీకుల సౌకర్యార్థం జూలై ఆఖరు వరకు పొడిగించినట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. ప్రతి బుధవారం చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07251ఎక్స్‌ప్రెస్‌ను జూలై 2నుంచి 30వరకు పొడిగించగా, తిరుగు ప్రయాణంలో ప్రతి గురువారం తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07252ఎక్స్‌ప్రెస్‌ను జూలై 3నుంచి 31వరకు పొడిగించారు. ఈ రైళ్లు ఖాజీపేట,విజయవాడ,గూడూరు, రేణిగుంట మీదుగా తిరుగుతాయి. అలాగే ప్రతి శుక్ర,ఆదివారాల్లో చర్లపల్లి నుంచి తిరుపతికి బయలుదేరే నెంబర్ 07017ఎక్స్‌ప్రెస్ జూలై 4నుంచి 27వరకు, తిరుగు ప్రయాణంలో ప్రతి సోమ,శనివారాల్లో తిరుపతి నుంచి చర్లపల్లికి బయలుదేరే నెంబర్ 07018ఎక్స్‌ప్రెస్‌ను జూలై 5నుంచి 28వరకు వరకు పొడిగించారు. ఈ సర్వీసులు కాచిగూడ, మహబూబ్‌నగర్, కర్నూలు,డోన్,గుత్తి,కడప,రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

## దశాబ్దకాలం క్రిందటి విధానం పునరుద్ధరణ!

# తిరుమలలో కాటేజీల వద్దకు ఆర్టీసి ఉచిత బస్సు

తిరుమల,జూన్ 13ప్రభాతవార్తప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమలకు వచ్చేభక్తుల సౌలభ్యంకోసం కొండపైన సిఆర్ఓ, ఆర్టీసి బస్టాండు,ఆలయం ముందుభాగం, ఎంబిసి, పద్మావతివిచారణ కార్యాలయం ప్రాంతాల నుండి భక్తులు గదులకు చేరుకోవడానికి ఉచితంగా ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే విధానం టిటిడి పునరుద్ధరించేందుకు సిద్ధమైంది. అన్ని ప్రాంతాలనుండి కాటేజీల వద్దకుగానీ, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లవరకు, వెలుపల క్యూలైన్లవరకు భక్తులను సులభంగా చేరవేసేందుకు వీలు కల్పిస్తూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, ఇఒ శ్యామలరావు, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి మంచి నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం గతంలోనే 2019కి ముందు కరోన వైరస్ వ్యాప్తిచేందేవరకు అమలులో ఉండేది. 2014లో తిరుమలలో టిటిడి ఇఒగా డాక్టర్ దోండపాటి సాంబశివరావు, తిరుమల జెఇఒ కెఎస్ శ్రీనివాసరాజు పాలనలో భక్తులను చేరవేసుందుకు ఆర్టీసి బస్సులను తిరుమల బాలాజీ బస్టాండ్ నుండి కాటేజీల ప్రాంతాల్లో



తిరుగుతూ గమ్యస్థానంలో దించేవారు. దీనివల్ల యాత్రికులు, భక్తులు తాము వెళ్ళాల్సిన కాటేజీలకు, విచారణ కార్యాలయాలకు నేరుగా చేరుకునేవారు. ట్యాక్సీల దోపిడీనుండి విముక్తికలిగింది. తిరుపతి నుండి తిరుమలకు చేరుకునే తిరుమల,పుత్తూరు, శ్రీకాళహస్తి, చిత్తూరు 1,2,కుప్పం, మదనపల్లి, పలమనేరు, నెల్లూరు, గూడూరు, వెంటకగిరి, సత్యవేడు ఆర్టీసి డిపోల బస్సులు తిరుమలలో కాటేజీల చుట్టూ తిరిగి భక్తులను దించడం ,తిరిగి అక్కడ నుండే ఎక్కించుకోవడం జరిగేది. దీనివల్ల భక్తులకు కూడా ఎలాంటి ఇబ్బందులు, తలనొప్పులు ఉండేదికాదు. అయితే 2019లో కరోన వైరస్ వ్యాప్తితో ఇవన్నీ రద్దయ్యాయి. ఆ తరువాత ఇప్పటివరకు తిరుమలలో ఉచిత ఆర్టీసి బస్సులు భక్తుల కోసం ఏర్పాటుకాలేదు. ప్రస్తుతం తిరుమలలో జిఎన్‌సి టోల్‌గేట్ వద్ద నుండి ఆలయం వరకు పలుకాటేజీల చుట్టూ తిరుగుతూ టిటిడి ధర్మరథాలు (ఉచితబస్సులు) నడుస్తున్నాయి. ఈ బస్సులు పూర్తిగా ఎలక్ట్రిక్(విద్యుత్)తో నడిచేవి ఉన్నాయి. ఇవన్నీ కూడా భక్తుల రద్దీకి సరిపోవడంలేదు. తక్కువ సంఖ్యలో ధర్మరథాలతో భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సమయంలో తప్పనిసరిగా యాత్రికులు కాటేజీల వద్దకు చేరుకోవాలన్నా, కల్యాణకట్ట, సిఆర్ఓ, పద్మావతి,ఎంబిసి విచారణ కార్యాలయల వద్దకు ప్రైవేటు ట్యాక్సీలపై ఆధారపడక తప్పడంలేదు. ట్యాక్సీడ్రైవర్లు భక్తులను దోచేస్తున్నారనేది టిటిడికి అందుతున్న ఫిర్యాదులు. రోజువారీగా తెలుగురాష్ట్రాల నుండేగాక తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుండి 80వేలమంది భక్తులు తిరుమలకు చేరుకుంటుంటే వీరిలో 20వేలమంది వరకు యాత్రికుల తమ సొంత వాహనాల్లో వస్తున్నారు.

## ప్రేమ విఫలమైందంటూ పంట పొలాల్లో చిందులు వేసిన యువతి

ఆమెతో సహా అక్కడున్న వారిని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: తప్పతాగిన స్థితిలో కృష్ణా జిల్లాలో ఒక యువతి నానా హంగామా చేసింది. తన ప్రేమ విఫలమైందంటూ పంటపొలాల్లో చిందులు వేస్తూ కేకలు వేసింది. అతి ప్రయాస మీద ఆమెను ఒక యువకుడు పోలీసులకు తద్వారా తల్లిదండ్రులకు అప్పగించాడు. పామర్రు నియోజకవర్గానికి చెందిన ఒక యువతి రోజూ స్వగ్రామం నుంచి బస్సులో గుడ్లవల్లేరు వస్తూ అక్కడ ఒక కాలేజీలో చదువుతోంది. నాలుగు రోజుల క్రితం మచిలీపట్నం చిలకలపూడి బీచ్‌లో నిర్వహించిన మసులా ఫెస్టివల్‌కు వెళ్ళింది. ఆమెకు అక్కడ గుడివాడ మండలానికి చెందిన ఒక యువకుడి పరిచయం అయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం కాలేజీ ముగిసిన తర్వాత సదరు విద్యార్థిని ఆ యువకుడికి ఫోన్ చేసింది. తన లవ్ బ్రేకప్ అయ్యిందని, బాధగా ఉందని, మందు తాగాలని ఉంది తీసుకు రావాలంటూ అతడిని కోరింది. ఆ యువకుడు మద్యం బాటిల్ తీసుకుని వచ్చాడు. అనంతరం ఇద్దరూ కలిసి అతడి బండిపై గుడ్లవల్లేరు- గుడివాడ మార్గంలో ఉన్న డొంకదారిలోకి వెళ్లారు. రైల్వేట్రాక్ దాటిన తరువాత ఒక పొలం గట్టున కూర్చొని మద్యం తాగారు. ఆ యువతి ఎక్కువగా మద్యం తాగి మత్తులో కూరుకుపోయింది. పొలాల్లో నుంచి లేచి నడవ లేని పరిస్థితికి వచ్చింది. దీంతో ఆ యువకుడు తన స్నేహితులకు సమాచారం ఇచ్చారు. మరో ఇద్దరు యువకులు అక్కడికి వచ్చారు. ఆమె బండిపై కూర్చోలేని స్థితిలో ఉండటంతో, ఇదంతా తనకెందుకని ఒక యువకుడు పారిపోయాడు. దీంతో మిగిలిన ఇద్దరూ ఆమెను తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించినా వీలు కాలేదు. అదే సమయంలో గుడ్లవల్లేరుకు చెందిన ఒక యువకుడు అటువైపుగా వెళుతూ వీరిద్దరినీ గమనించి ఆ విద్యార్థినిపై అఘాయిత్యం జరుగుతుందేమోనని భయపడి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అంతే కాకుండా ఫోన్‌లో వీడియో తీస్తుండగా, అతడిని అడ్డుకుని సెల్‌ఫోన్‌ను పడేశారు. పోలీసులు మహిళా హోంగార్డులతో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు.

# కొమ్మినేని విడుదలకు 'సుప్రీం' ఆదేశం

మరోసారి అలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహించవద్దని హెచ్చరిక

విజయవాడ.జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: అమరావతి మహిళలపై ఓ ఛానల్‌లో అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కొమ్మినేని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం విడుదలకు సంబంధించిన అన్ని నిబంధనలు ట్రయల్ కోర్టు ఇస్తుందని స్పష్టం చేసింది. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని, వాటిని ప్రోత్సహించేలా ప్రవర్తించవద్దని, భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం కొమ్మినేనిని హెచ్చరించారు అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టయిన జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుకు జూన్ 24 వరకు మంగళగిరి కోర్టు రిమాండ్ విధించింది. అసభ్య వ్యాఖ్యలపై మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష ఇచ్చిన ఫిర్యాదుతో తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఏ1గా కృష్ణంరాజు, ఏ2గా కొమ్మినేని శ్రీనివాసరావు, ఏ3గా టీవీ యాజమాన్యాన్ని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో కొమ్మినేనిని అరెస్టు చేసి గుంటూరు నల్లపాడు తరలించారు. మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఛానల్‌లో జరిగిన చర్చకు సంబంధించిన వీడియోలను న్యాయమూర్తి ఎదుట ప్రదర్శించారు. రిమాండ్ విధించాలని పోలీసులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే కొమ్మినేనిపై పెట్టిన ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం సెక్షన్లను న్యాయమూర్తి తొలగించారు.

## ఇంధన, ఎఐ రంగాలపై అమరావతిలో డబ్ల్యూఇఎఫ్ కేంద్రం

విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: ప్రపంచ ఆర్థిక వేదిక 'డబ్ల్యూఈఎఫ్)కి చెందిన నాలుగో పారి శ్రామిక విప్లవ కేంద్రం నెట్ వర్క్ (సీ4ఐఆర్)తో కలిసి రాజధాని అమరావతిలో 'ఆంధ్రప్రదేశ్ సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ సైబర్ రెజిలియెన్స్' పేరుతో ప్రత్యేక కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. భారతదేశంలో ఏర్పాటయ్యే మొదటి థిమాటిక్ సీ4ఐఆర్) సెంటర్ ఇదే అవుతుంది. డబ్ల్యూఈఎఫ్‌కి చెందిన సెంటర్ ఫర్ ఎనర్జీ అండ్ మెటీరియల్స్‌తో కలిసి ఆధునిక ఇంధన రంగం,హరిత పరిశ్రమలపై కృషి చేయడం,డబ్ల్యూఈఎఫ్‌కి చెందిన సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీతో కలిసి...ఏఐ ఆధారిత డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్,సైబర్ సెక్యూరిటీపై పనిచేయడం. ఈ కేంద్రం ఏర్పాటు వెనుక ముఖ్యోద్దేశం. ఆయా రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తెచ్చేందుకు,గ్రీన్ ఎనర్జీ,ఏఐ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెట్టుబడులు ఆకర్షించేందుకు,అంతర్జాతీయ విధాన నిర్ణాయక,నవకల్పనల వేదికలపై ఆంధ్రప్రదేశ్‌కు స్థానం లభించేలా చూడటం ఈ కేంద్రం ప్రధాన లక్ష్యాలు. రాష్ట్ర ఐటీ,మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి దీనికి ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. డబ్ల్యూఈఎఫ్ తరపున సీనియర్ ఎగ్జిక్యూటివ్ కోఛైర్‌గా వ్యవహరిస్తారు. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మెంబర్ సెక్రటరీగా ఉంటారు.

వార్త


ప్రకృతి అంతా త్యాగంతో, ప్రేమతో మనల్ని పోషిస్తుండగా, మనం ప్రకృతి పట్ల, సాటి ప్రాణుల పట్ల, ఎలా ఉంటున్నామో ఆలోచించాలి.

-ఎమ్. షాగిన్యాన్


# మాటలకందని విషాదం

విమానయాన చరిత్రలోనే అత్యంత విషాదకరమైన దుర్ఘటనను తలచుకుంటేనే మనసును కలచివేస్తుంది. ఇంతటి విషాదాన్ని మునుపెన్నడూ మన దేశం ఎరుగదు. విమాన ప్రమాదానికి కారణాలేవైనా, కారణాలెన్నున్నా, దర్యాప్తుకు వీలైన అన్ని కోణాలు సాంకేతిక లోపమేనని ధృవీకరిస్తోంది. ఎన్నో విమానాలు నడిపి దాదాపు 8200కిలోమీటర్లు ప్రయాణించిన పైలెట్ సైతం ప్రమాదాన్ని తప్పించలేని పరిస్థితిలో అశువులు బాసాడు. విధి లిఖితం కాకపోతే మరేమిటి!? విమానంలో ఎంతో ఉత్సాహంతో విదేశంలో పని ముగించుకుని తమ గమ్యస్థానాలకు చేరుకుంటామని ఎదురు చూసే విదేశీ ప్రయాణికులకు మృత్యువు ఎదురొచ్చింది. స్వదేశం నుంచి విదేశాల్లో ఉన్న కుమార్తెను చూసి రావాలనుకున్న గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ రూపానీ వంటి వారిని అకాల మృత్యువు కబళించింది. విమానంలో ఉన్న వారంతా తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. సిబ్బంది, పైలెట్‌లు ప్రయాణీకులు పరిసర జనావాసాల్లో వెరసి 269 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మసిబారిన మృతదేహాలను వారి అస్థికలను గుర్తించాలన్నా డిఎన్ఏ పరీక్షల వల్లనే సాధ్యం. ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్ లైనర్ విమానం ఎఐ 171 అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని గాంట్విక్ విమానాశ్రయానికి మధ్యాహ్నం 1.38 నిమిషాలకు విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో అదుపు తప్పి అహ్మదాబాద్‌లోని మేఘానీ నగర్‌లోని బిజె వైద్య హాస్టల్ భవనాల్లోకి చొచ్చుకునిపోయింది. అహ్మదాబాద్ విమానాశ్రయ చరిత్రలో ఇది రెండో పెద్ద ప్రమాదం. 1988 అక్టోబర్ 19 న ఇండియా ఎయిర్లైన్స్ విమానం విమానాశ్రయంలో లాండింగ్ అవుతుండగా కుప్పకూలి అందులోని 13 మంది ప్రయాణికులు బలయ్యారు. తాజా ప్రమాదంలో బ్రిటన్ పౌరుడు విశ్వాస్ కుమార్ రమేష్ మృత్యుంజయునిగా బతికి బయట పడ్డారు. 11ఎ. సీట్లో ఎమర్జెన్సీ డోర్ వద్దకూర్చోవడమే అతని అదృష్టం కావచ్చు. ఇంతటి విషాదంలో ఇదొక అద్భుతం. అంతర్జాతీయ విమానయాన భద్రతా సంస్థల నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్త విమాన ప్రమాదాల్లో 35శాతం టేకాఫ్ సమయంలో కానీ, ఆ వెంటనే కానీ జరుగుతుంటాయి. మిగిలిన సందర్భాల్లో ప్రమాదాలు బహు తక్కువే. చనిపోయిన వారిలో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటన్ పౌరులు, 7 గురు పోర్చుగీసు వాసులు, ఒక కెనడియన్ ఉన్నారు. విమానం ఢీకొట్టిన బి జె వైద్యకళాశాల హాస్టల్ విద్యార్థులు సిబ్బంది 150మందికిపైగా ఉన్నారు. విమానం టేకాఫ్ అయిన 59 సెకన్లలోనే కుప్పకూలింది. విమానం అక్కడి నుంచే ప్రయాణం ప్రారంభించడంతో, సుదీర్ఘ ప్రయాణానికి అవసరమైన 1.25 లక్షల లీటర్ల ఇంధనం ట్యాంక్ నిండా ఉంది. అదేఇంత పెద్ద ప్రమాద విస్ఫోటానికి కారణమైంది. అసలు కారణంతెలియాలంటే బ్లాక్ బాక్స్ విశ్లేషణ జరగాల్సిందే. ప్రమాద సమయంలో వైద్య కళాశాల హాస్టల్ మెస్‌లో భోజనానికి ఉపక్రమించిన తరుణంలో 'రేపటి డాక్టర్ల' కల చెదిరిపోయింది. వారి కుటుంబాలన్నీ విషాదంలో మునిగిపోయాయి. వారిని ఓదార్చడం ఎవరివల్ల కావడం లేదు. అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో ఎంతో సురక్షితంగా భావించే బోయింగ్ క్రాఫ్ట్ కుప్పకూలడం ఆశ్చర్యమే మరి. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో ఇచ్చిన 'మేడే కాల్'కు స్పందించేలోగానే విమానం భస్మీపటలమయ్యింది. డ్రీమ్ లైనర్ అనగానే 290 మంది ప్రయాణికుల సామర్థ్యం కలది. ఏకబిగిన 13,530 కిలోమీటర్లు ప్రయాణించగలదు. ఖండాంతర ప్రయాణానికి ఎంతో పటిష్టమైనదన్న అభిప్రాయం పైలెట్ లందరిలోనూ వ్యక్తమౌతోంది. రెండు ఇంజన్లు పని చేయక పోవడమే ఈ దుర్ఘటనకు కారణమని కొందరు విశ్లేషిస్తున్నారు. నిర్దిష్ట పదజాలాన్ని ఉపయోగించి మాట్లాడే రేడియో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా ఈ ప్రమాదాల నుంచి కాపాడలేకపోవడం చెప్పుకోవాలి. టేకాఫ్ సజావుగానే జరిగింది. కానీ గేర్లను పైకి తీసుకునేలోపల రెండు ఇంజిన్లు క్రియా శీలకతను కోల్పోయి ఉండొచ్చునని మాజీ సీనియర్ పైలట్ కెప్టెన్ సౌరభ్ భట్నాగార్ ఈప్రమాదాన్ని విశ్లేషిస్తున్నారు. డివిఆర్ రికార్డర్, బ్లాక్ బాక్స్‌లే అసలు కారణాలను నిర్ధారించాలి. ప్రధాని నరేంద్రమోడీ విగత జీవుల మధ్య ఈ ప్రమాదస్థలిని చూసి చలించిపోయారు. దిగ్భ్రాంతి చెందిరు. ఊహించని ప్రమాదం జరగడంతో ప్రపంచవ్యాప్త నిపుణులు ప్రమాద కారణాలపై విశ్లేషణలు చేపట్టారు. కెప్టెన్ కూడా సుదీర్ఘదూరం విమానం నడిపిన అనుభవం ఉన్నవాడే. ప్రమాదాన్ని పసికట్టగలిగిన వాడే. వీటన్నిటినీ క్రోడీకరించు కుంటే ఈ ప్రమాదం సాంకేతిక వైఫల్యమనే నమ్మాలి. ఇదే విమానంలో 6నెలల నాడు సాంకేతిక లోపాలు తలెత్తాయని, వాటిని సజావుగాపూర్తి చేసినట్లు యాజమాన్యం చెబుతోంది. 13 ఏళ్లుగాఈ విమానం ఎన్నో ప్రయాణాలు చేసింది. ఎందరినో గమ్యస్థానాలకు చేర్చింది. మానవ మేధ, కృత్రిమ మేధ కలగలిపితే సాధించలేనిదేదీ లేదని రుజువవుతున్న తరుణంలో ఇలాంటి ప్రమాదాలు విస్మయమే. విమాన ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అవసరం. ఈ ప్రమాదం బోయింగ్ విమానాల భవితవ్యంపై నీలి నీడలు ఏర్పడుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. బోయింగ్ నిర్మాణంలో నాణ్యత నియంత్రణ, ఉత్పత్తి ప్రక్రియల విషయమై మరోసారి ఆలోచించుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. తమ విమానాలు బయలుదేరేముందే వాటి సమర్థతను నిర్ధారించే అంశాలన్నిటిలోనూ ఆధునిక మేళకువలు పాటించాలి.

ప్రతి ఒక్కరికీ తనని గురించి బహుకొద్దిగా మాత్రమే తెలుస్తుంది. మనిషికి తనని తాను తెలుసుకోవడం చాలా కష్టమైన పని.


సిసెరో

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక,దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.


బెర్ట్రండ్ రస్సెల్

## ప్రజావాక్కు



### ఎపి సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవిభజనానంతరం హైదరాబాద్‌లోని డా. బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ సేవలు తెలంగాణాకుమాత్రమేపరిమితమైపోయాయి. ఆంధ్రప్రదేశ్ లోనిఆ విశ్వవిద్యాలయ స్టడీసెంటర్లు కొనసాగటం లేదు. ఎంతో ముందుచూపుతో ఆనాటి ముఖ్యమంత్రి భవనం వెంకటరామిరెడ్డి 1982లో వయోజనులు, అనేక కారణాలతో మధ్యలోనే చదువు ఆపేసినవారు దూరవిద్య ద్వారా డిగ్రీ స్థాయిలో చదువుకునే విధంగా "అందరికీ చదువు" నినాదంతో ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ఏర్పాటుచేశారు. ఆతరువాత ఆ విశ్వవిద్యాలయం పేరును డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా నామకరణం చేశారు. ఒకే పేరుతో రెండు రాష్ట్రాల్లో సార్వత్రిక విశ్వవిద్యాలయం కొనసాగలేదు కనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయంను ప్రారంభించాలి.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ఫీజులపై నియంత్రణ అవసరం

ఇటీవల ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులపెరుగుదల సామాన్య ప్రజలకు తీవ్రఆందోళన కలిగిస్తోంది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా అనూహ్యంగా వేలల్లో ఫీజులు పెంచుతున్న స్కూళ్లు, కాలేజీలు మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఒకవిద్యార్థికి ఒక్క సంవత్సరానికి వచ్చేమొత్తం ఖర్చులక్షలరూపాయలను దాటి పోతోంది. ఇంతటితో ఆగకుండా, కంప్యూటర్ కోర్సులు, పుస్తకాలు, యూనిఫార్ములు, బ్యాగులు కూడా తమ వద్దే కొనాలని బలవంతం చేస్తున్నారు. తక్షణమే ఫీజుల నియంత్రణ కోసం కఠినమైన నిబంధనలను రూపొందించాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### యోగాకు విస్తృత ప్రచారం

జూన్21న నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించే నిమిత్తం ఎపి ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగా మాసం ప్రకటించింది. నేడు యోగ ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తిస్తున్నారు. ఆధునిక జీవనంలో ఒత్తిడినుంచి స్వాంతన చేకోరడానికి యోగ ఉత్తమ సాధనం. యోగాతో ఆరోగ్యం మానసిక ప్రశాంతత కూడా చేకూరుతాయి.

-సి. చంద్రశేఖర్ రెడ్డి, నెల్లూరు జిల్లా

### జన భార(త) మ్

ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత జనాభా 146 కోట్లకు చేరుకుంది. అది నలభై ఏళ్లలో 170 కోట్లకు చేరుకుని, తర్వాత తగ్గడం మొదలుపెడుతుంది. ఎందుకంటే ప్రస్తుత జననాల రేటు స్థిరీకరణకు అవసరమైన 2.1కన్నా తక్కువగా 1.9గా కొనసాగుతోంది. అలా తక్కువగా కొనసాగడం ప్రపంచ వ్యాప్తంగాఉన్నసమస్య. కాబట్టి దాన్నిఅధిగమించాలా, లేదా ప్రపంచంతోనే నడుస్తూ, భారత్ కూడా అట్టే పట్టించుకోనక్కర లేదా అన్నది ఒక కోణం. ఇప్పుడు దృష్టి పెట్టాల్సినవి రెండు ముఖ్యాంశాలు ఉన్నాయి. ఒకటి జనాభాలో 68శాతం పని చేయగల వయస్సు వారు. అరవై నాలుగుసంవత్సరాల లోపు వారు. అందులో యువత కూడా గణనీయ సంఖ్యలో ఉన్నారు. సమగ్ర ప్రణాళికలు, అమలుతో వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దవచ్చు. ప్రస్తుతం తీసికట్టుగా ఉన్న మానవ అభివృద్ధి సూచీల మెరుగుదల సాధించాలి.

-డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### గాల్లో ప్రాణాలు

ఎయిర్ ఇండియా ప్లైన్ క్రేష్ విషాధాతంలో అశువులు బాసిన వారికి కండోలెసెన్స్ తెలియ జేస్తూ ముఖ్యంగా గమనించ విషయాలు ఏమిటంటే ముందుగా ఫిట్నెస్ అఫ్ ఫ్లైట్ ఏమిటి, దాని మైంటెనెన్స్ ఎలా ఉంది క్షుణ్ణంగా పరిశీలించి గాలిలోకి వెళ్ళాలి. చాలా సందర్భాలలో మనము విన్న మాట కొంచెం ఎయిర్ ఇండియా ఫ్లైట్స్ గురించి అసంతృప్తి మాటలే. ఫ్లైట్ కనీసపు ఎత్తుఎగరకుండా క్రేష్ అయ్యిందంటే ఇంజన్ టెక్నికల్‌గా ఫాల్ట్ ఉందా అనేది తెలియవలిసిన విషయం. విషయాలు తరువాత తెలియవలిసినవి ఎన్నిఉన్నా అవి ఆక్సిడెంట్ అయిన తరువాత. మరి ముందుగా చేయవలసిన పనుల నిర్లక్ష్యం వల్లే కదా జరిగిందని అందరూ అనేమాట. ఎన్ని జరిగినా ఇదే పరిస్థితి పోస్ట్ మారటం హడావుడిలే..

-గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### పెరుగుతున్న కరోనా కేసులు

కరోనాతో మరణిస్తున్నవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నది. ఇటీవల మొదలైన కరోనా పట్ల అంత భయం లేకున్నా ఇప్పటికీ స్వీయ రక్షణ చర్యలు అవసరం అని ఈ మరణాలు చాటుతున్నాయి. అయితే దీనికి ప్రధాన కారణం ప్రజలలో కరోనా పట్ల పెరిగిన అవగాహన. ఏది ఏమైనా కరోనా పట్ల తగు జాగ్రత్త అవసరం అని చాటుతున్న సందర్భం ఇది.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# దేవుళ్ల భూములకు శఠగోపం!

**ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మ కర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించు కుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

భారతీయ సంస్కృతిలో మారుపేరుగా భక్తివిశ్వాసాలకు నిలయాలుగా ప్రజాదరణ పొంది ఒకనాడు దేదీప్యమానంగా వెలుగొందిన దేవాలయాలు రానురాను నేడు దీనావస్థకు చేరుకుంటున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు వేలాదికోట్ల రూపాయల ఆస్తిపాస్తులున్నా నిత్య పూజలకు కూడా నోచుకోలేక కనీసం దీపం పెట్టే దిక్కులేక కళావిహీనంగా ఎన్నో ఆలయాలు జీర్ణావస్థకు చేరుకుంటున్నాయి. రాజకీయ అవసరాల కోసం దేవుడిని, దేవాలయాలను, దైవభక్తిని దుర్వినియోగం చేసే దుష్టసంప్రదాయం ఆరంభమైనప్పటి నుంచి దేవాలయాల వ్యవస్థ పతనం ప్రారంభమైందనే చెప్పొచ్చు. పవిత్రమైన హిందూ దేవాలయ వ్యవస్థలో రాజకీయ జోక్యం పెరిగిపోతున్న కొద్దీ, దేవుళ్లకు, భక్తులకు కష్టాలు పెరిగిపోతున్నాయి. ఎన్నోసార్లు ఈ విషయంలో హిందూధర్మాచార్యుల సభ ఆందోళన వ్యక్తం చేసింది. దేవాలయాలపై వచ్చే ఆదాయం దైవప్రచారానికి, ధార్మిక కార్యక్రమాలకు మాత్రమే వినియోగించాలని కొందరు పీఠాధిపతులు, మఠాధిపతులు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేశారు. అంతేకాక దేవాలయ ఆస్తులను కాపాడేందుకు ఒక ఉద్యమం చేపట్టే అవసరం వస్తుందని కూడా పెద్దలు వక్కాణించారు. కానీ ఎవరు ఎంత అరిచి గీ పెట్టినా, ఎన్ని హెచ్చరికలు చేసినా దేవుళ్ల ఆస్తులను దుర్వినియోగాన్ని నివారించలేకపోతున్నారు. ఒర్లి, ఒర్లి వారుపోతారు. వందుకతిని వీరు పోతారన్నట్లుగా ఉంది పరిస్థితి. గతంలో ఎన్నోవిదేశీ దాడులను ఎదుర్కొని, మరెన్నో ఆటుపోట్లను తట్టుకున్న దేవుళ్లు ఇప్పుడు స్వజనుల దోపిడీని, దుర్మార్గాలను నిర్మూలించలేక పోతున్నారేమోననిపిస్తున్నది. జీతభత్యాలపై ఉన్న శ్రద్ధ దేవుళ్ల ఆస్తులపై ఉండడంలేదు. రెవెన్యూ చట్టాల్లో తరుచుగా వస్తున్న మార్పులు, చేర్పులు ఈ దేవాలయ భూములను ఆక్రమించేవారికి కల్పతరువుగా మారుతున్నాయి. అసలు దేవాలయాల భూములకు, భవనాలు ఎన్ని ఉన్నాయి? ఎవరి ఆధీనంలో ఉన్నాయి? వాటిపై రావాల్సిన ఆదాయం ఎంత? ఎంత వస్తున్నది? సబ్‌లీజ్‌ల పేరుతో మధ్యవర్తులు ఎంత భోంచేస్తున్నారు? తదితర వివరాలు దేవాదాయ శాఖ వద్ద స్పష్టంగా లేవనే చెప్పొచ్చు. కొన్ని తెలిసినా, రకరకాల కారణాలతో నోరు విప్పరు. అంతెందుకు తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర పరిధిలో దేవుళ్లకు ఉన్న ఆస్తులు ఎన్ని? వాటిపై వస్తున్న ఆదాయం గురించి తెలుసుకుంటే విస్తుపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం చెప్పే లెక్కల ప్రకారం తెలుగురాష్ట్రాల్లో దాదాపు మూడులక్షల డెబ్బైవేల ఎకరాలకు పైగా దేవాలయ భూములున్నట్లు అనధికార అంచనా. ఇందులో తెలంగాణ రాష్ట్రంలో ఎనభైవేల ఎకరాలకుపైగా భూములున్నాయి. గతంలో ఈ భూములకు రికార్డులు ఎంతో పకడ్బందీగా నిర్వహించేవారు. ఆదాయం, ఖర్చులు తదితర వివరాలు అన్నీ నమోదు చేయడమేకాక జమాబంది రూపంలో తనిఖీలు నిర్వహించేవారు. ఇప్పుడు ఆ రికార్డులు ఏమయ్యాయో? ఏ మేరకు రాస్తున్నారో? ప్రశ్నార్థకమే. దేవాలయ భూములకు సంబంధించి నిజాంకాలం నుండే కాదుఅంతకు ముందు నుంచి కూడా ఒక నిర్దిష్టపద్ధతిలో నమోదయ్యేవి. 1349 ఫసలీ నుంచి తెలంగాణలో మొత్తం దేవాలయ భూములు వాటిపై వస్తున్న ఆదాయం తదితర అంశాలు నమోదు చేసేవారు. ఆదాయం, ఖర్చులకు సంబంధించి ఆర్డీఓ స్థాయి అధికారితో జమాబందిలో లోతుగా పరిశీలించేవారు. దేవుని సొమ్ము ఏమాత్రం భోంచేసినట్లు తేలినా, భూములు ఆక్రమించినట్లు బయటపడినా తీవ్రంగా శిక్షలు ఉండేవి. అప్పటివరకు అమలులో ఉన్న మద్రాసు యాక్టును ఆంధ్రప్రదేశ్ అవతరణ అనంతరం కూడా కొంతకాలంకొనసాగించారు. పి.వి నర్సింహారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ, ఆంధ్ర దేవాలయ శాఖలనుకలిపివేశారు. అప్పటివరకు అంతో ఇంతో రెండురాష్ట్రాల్లో విరివిగా రికార్డులుండేవి. రానురాను భూములు అన్యాక్రాంతం కావడం, దీనికి సంక్షేమం పేరుతో వివిధ కార్యక్రమాలకు ప్రభుత్వం ఇష్టానుసారంగా దేవుళ్ల భూములను కేటాయించడంతో పరిస్థితి అదుపు తప్పింది. దీర్ఘకాలపు లీజుల పేరుతో కొన్ని, మరికొన్ని సాగు పేరుతో ఇలా రకరకాల దేవుని భూములు అన్యాక్రాంతమయ్యాయి. అన్యాక్రాంతమైన దేవాలయ భూములను స్వాధీనం చేసుకుని కాపాడడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ గట్టిగానే చెబుతున్నారు. కాని క్రియశూన్యం. గతంలోనూ ఆ శాఖమంత్రులు, ఇలాగే చెప్పారు. కానీ ఒక్క అడుగు ముందుకు కదిలిన పాపాన పోలేదు. ఎక్కడైనా దేవాలయ భూముల గతి ఇంతే. పర్యవేక్షించేవారు పరాకుగా ఉంటే, దేవుని మాన్యాలను భోంచేసేవారు హుషారుగానే ఉంటారన్నది విదితమే. ఇక్కడా, అక్కడా అనికాదు. తెలుగు రాష్ట్రాల్లో దేవాలయాలకు సంబంధించిన వేలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమైనట్లు చెబుతున్నారు. ఇకపోతే భక్తులు సమర్పించుకునే కానుకలు కొన్ని చోట్ల పక్కదారిపడుతున్నట్లు ఆరోపణలున్నాయి. దేవుల హుండీలకు కూడా కన్నాలు పడుతున్నాయి. ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న తిరుమల తిరుపతి వెంకన్న కూడా ఈ అవినీతిపరుల నుంచి తప్పించుకోలేకపోతున్నారు. ఆ దేవదేవునికి సమర్పించుకుంటున్న ప్రసాదాల్లో ప్రధానంగా లడ్డూల్లో వాడే నెయ్యిలో కల్తీ జరిగినట్టు సాక్షాత్తు అధికారులే ప్రకటించడంతో భక్తులు విస్తుపోతున్నారు. భారీ ఎత్తున జరిగే ఈ కుంభకోణంలో దేశఅత్యుతన్న న్యాయస్థానం జోక్యంతో ఉన్నతస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నది. నిన్నమొన్నటివరకు టిటిడీలో కీలకపాత్ర వహించిన అధికారగణంపై విమర్శలు చుట్టుముట్టుతున్నాయి. మరికొందరు ధర్మకర్తలపైకూడా ఈఆరోపణల పరంపర కొనసాగుతున్నది. వాస్తవంగా ధర్మనిష్టాపరులు, నీతికి, నిజాయితీకి నిలువుటద్దంలా ఉండేవారు పాలనామండలిలో ధర్మకర్తలుగాఉంటే ఇంత భారీ ఎత్తున అవకతవకలకు అవకాశం ఉండకపోవచ్చుననే అభిప్రాయాలను తోసిపుచ్చలేం. అధికారులతో ఇలాంటి ప్రమాదం ఉంటుందనే దేవుళ్ల ఆస్తులను కాపాడేందుకు భక్తులు సమర్పించుకునే ప్రతిపైసాను సద్వినియోగం చేసేందుకు ఎంతో ముందు చూపుతో మనపెద్దలు ధర్మకర్తల వ్యవస్థను ఏనాడో ఏర్పాటు చేశారు. ఎలాంటి జీతభత్యాలు లేకుండా లాభాపేక్షకు తావులేకుండా దేవుని సేవలో తరించిపోవాలనే ఆశయాలున్నవారిని భూ విరాళాలు సమర్పించుకున్నవారిని ధర్మకర్తలుగా నియమించేవారు. నీతి, నియమనిష్టలతో, భక్తి విశ్వాసాలతో, సత్ప్రవర్తనలతో ప్రజలకు ఎంతో ఆదర్శంగా, అనుకరణీయంగా ఉండేవారు. కానీ పంచాయతీరాజ్ వ్యవస్థ వచ్చిన తర్వాత గ్రామ రాజకీయాలు చోటు చేసుకోవడంతో ఆ ప్రభావం దేవాదాయ వ్యవస్థపై పడింది. ధర్మకర్తల మండళ్లు, రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారిపోతున్నాయి. వ్యక్తిగతగుణాలు, దైవచింతన వంటి ఉత్తమ గుణాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ అనుయాయులను, పార్టీ కార్యకర్తలను, ఎన్నికల్లో నిలబడలేని వారిని, నిలబడినా ప్రజలతో తిరస్కరించబడినవారిని పునరావాసంగా ధర్మకర్తల మండలిలో నింపడం ప్రారంభమైనప్పటి నుంచి దేవుళ్లకు కష్టాలు ప్రారంభమయ్యాయని చెప్పొచ్చు. ఈ పదవులను ఉపయోగించుకొని దేవుళ్ల సొమ్మును స్వాహా చేసిన పెద్దలు ఎందరోఉన్నారు. దేవుళ్లను ఉపయోగించుకొని తమ వ్యాపారాలను విస్తరించుకున్నవారు కూడా లేకపోలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరి సహకారం, అధికారుల తోడ్పాటు లేకుండా దేవుడి సొమ్మును అక్రమమార్గాలవైపు మళ్లించడం అంత సులభం కాదు. ఏయే కార్యక్రమాల్లో పాల్గొనాలో దేవుడి సొమ్ము ఎంతెంత భోంచేశారో ఆయా ప్రాంతాల భక్తులకు కూడా తెలియందికాదు. ఇప్పటికైనా పాలకులు శ్రద్ధ తీసుకొని దేవుళ్లఆస్తులు కాపాడడంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపితే దేవుళ్లకు ఎంతో సేవ చేసినవారవుతారు. అలాగే దేవాలయ ధర్మకర్తలను నియమించేటప్పుడు వ్యక్తిగత చరిత్రను, సేవాధర్మనిరతిని పరిగణనలోకి తీసుకోవాలి. దేవాలయ ఆస్తులను పరిరక్షించే ఉద్యమంలో భాగస్వాములను అవుతామన్న విశ్వాసం ఉన్నవారిని ధర్మకర్తలుగా నియమిస్తే కొంతవరకైనా ఈ ఆస్తులకు రక్షణ ఏర్పడుతుంది. ఇందులో నిర్లక్ష్యం చేస్తే, ఇదే పరిస్థితి కొనసాగితే ఈ నిర్వాహకం చూసి తాము భక్తితో సమర్పించుకుంటున్న కానుకలు సద్వినియోగం కావడం లేదని ప్రజలు విశ్వసిస్తే పరిస్థితి ఎటువైపు దారితీస్తుందో పాలకులు మనసుపెట్టి ఆలోచించాలి. ●

## ఒక్క మాట

# ఆదాయ అసమానతలు తగ్గితేనే ఆర్థిక వృద్ధి సాధ్యం!


డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు

జిడిపి పరంగా 4.187 లక్షల కోట్ల డాలర్లతో ప్రపంచ దేశాలలో నాలుగవ స్థానంలో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత మన దేశం ఉన్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధిసంస్థ మన దేశపు నీతి అయోగ్ తెలియజేయడం ఎంతో సంతోషం. ఐఎంఎఫ్ ప్రకారం మనదేశంలో తలసరి ఆదాయం 2013-14 లో 1438 యూఎస్ డాలర్లు ఉండగా 2025 నాటికి 2880 డాలర్లుగారెట్టింపు అయిందని తెలుస్తున్నది. ఇప్పుడు ఏ విధంగా మన ఆర్థిక వ్యవస్థ నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అని చెప్తున్నారు. బిలియనీర్ల సంఖ్య పెరిగితే దేశం ఆర్థిక అభివృద్ధి జరిగినట్లేనా?1990లలోఇద్దరే ఇద్దరు బిలియనీర్లు మనదేశంలో ఉండగా నేడు 332మంది ఉన్నారు. వీరి సంపద విలువ మన దేశస్థూల జాతీయోత్పత్తిలో సుమారు ఒకటి బై మూడు వంతు ఉన్నది. భారత్ లీబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుధైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో, వస్తు ఉత్పత్తులతో గణనీయంగా పెరిగిమానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగా వెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించినారు. అయితే ఈ విధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థిక విధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించలేకపోయారు. ప్రభుత్వం రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదని, నష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. దేశంలో నిరుద్యోగిత, మానవ వనరుల విధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారులవశం చేయడానికి దేశంలోవృద్ధి ప్రక్రియ అంతా పెట్టుబడిదారుల కనసన్నల్లోకి పోయింది. మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యా, వైద్య జీవన ప్రమాణాలు రీత్యాఉన్నది. 193 దేశాలలో ఆయుష్ ప్రమాణం రీత్యా మనదేశం స్థానం134గా ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125 దేశాలలో111వ దేశం మనది. ఎల్పిజి ఫలితాల వలన ఏర్పడిన దుష్పరిణామం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మన దేశం అభివృద్ధి చెందుతున్నదనే పాలకులు ఎలా చెబుతున్నారో అర్థం కావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలినియర్లు ఉన్న దేశంలో నేడు 332 బిలినియర్లు పెరిగినందున దేశం నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతున్నదా? ప్రజలఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణలోకి తీసుకొనే అవసరం లేదా? అపారమైన వ్యవసాయ సంపద ఉన్న మన దేశంలో తీవ్రమైన పోషక ఆహార లోపం ఉన్నది. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రకారం 127 దేశాలలో మన దేశంస్థానం 105వది. మనదేశంలో 35.5శాతం పిల్లలు పోషక ఆహార లోపంతో, 45శాతం పిల్లలు ఈ లోపంతోనే మరణాలకు గురవుతున్నారని పేర్కొంది. మానవ వనరుల అభివృద్ధిరీత్యా 130వది. ఆదాయ అసమానతల రీత్యా113వది. సామాజిక న్యాయం లేని ఆర్థికాభివృద్ధివలన ఎంత పెద్ద ఆర్థికవ్యవస్థ అయితే ఏమి ఎవరికి లాభం? నేడు మన దేశ జనాభా142 కోట్ల మందితో ప్రపంచంలో మొదటి స్థానంలోఉన్నాం. మన దేశ జనాభా ఎక్కువ శ్రామిక శక్తి కలిగి ఉన్నందువలన వారికి ఉపాధి అవకాశాలు కల్పించగలిగితే నిరుద్యోగిత, పేదరికం, ఆదాయ అసమానతలు ఉండవు. ●

# రక్తదానంపై అవగాహన అవసరం

రామ కిష్టయ్య సంగనభట్ల

అన్ని దానాల కంటే ముఖ్యమైనది రక్తదానం. చావుతో కొట్టుమిట్టాడుతున్న మనిషిని బతికిస్తుంది రక్తం. ఎ,ఒ,బి,బ్లడ్ గ్రూపులను కనుగొన్న కార్ల్ లేండ్ స్టీనర్ జ్ఞాపకార్థం ఆయన పుట్టిన రోజైన జూన్ 14న 'ప్రపంచ రక్త దాతల దినోత్సవము' ను ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో జరుపు కుంటారు. రక్తదాతలకు ధన్యవాదాలు తెలిపేందుకు, సురక్షితమైన రక్తం ఆవశ్యకతను తెలియ జేసేందుకు, రక్తదాతల నుంచి సేకరించిన రక్తాన్ని భద్రపరచే విధానాలను మెరుగు పరచుకునేందుకు 2005 లో ఈ కార్యక్రమం ప్రారంభమయింది. ఈ సందర్భంగా రక్తదానం ఎలా చేయాలి, ఎవరు రక్తదానానికి అర్హులు, రక్తాన్ని దానం చేయడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలేమిటి అనే విషయాలను తెలుసుకుందాం. రక్త దానం చేయాలంటే చాలామంది ముందుకు రారు. రక్తం తగ్గితే తమ ఆరోగ్యానికి ప్రమాదమని భయపడుతుంటారు. అయితే దీనిపై ప్రతి ఒక్కరికి అవగాహన రావాలి. ఎంత రక్తం బయటికి పోతే అంత స్వచ్ఛమైన రక్తం మళ్లీ తయారవుతోంది. దీంతో మనిషి మరింత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే వైద్య శాస్త్రవేత్త 1900 సంవత్సరంలో రక్తాన్ని తొలిసారిగా వర్గీకరించాడు. తన పరిశోధనల్లో నాలుగు రక్త వర్గాలను కనుగొన్నాడు. ఆ తర్వాత వీటిని మళ్లీ ప్రతి గ్రూపులోనూ నెగెటివ్, పాజిటివ్‌గా వర్గీకరణ చేశారు. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలుకాదు. శరీరంలో అత్యంత కీలకమైన ద్రవరూప కణజాలం రక్తమే. మొత్తం శరీర బరువులో ఎనిమిది శాతం బరువు రక్తానిదే. రక్తాన్ని పరిశీలించాలనుకుంటే పరీక్ష నాళికలో వేసిన కొంత సేపటికే అది మూడు పొరలుగా విడిపోతుంది. ఈ మూడింటిలో ఎక్కువ మందం ఉన్న పొర, ఎండు గడ్డిరంగులో, పారదర్శకంగా పైకి తేలుతూ కనిపిస్తుంది. దీనిని 'ప్లాస్మా' అంటారు. దీని దిగువన, అతి తక్కువ మందంతో ఉండే తెల్లటి పొర తెల్లరక్త కణాలు. అట్టడుగున దరిదాపు ప్లాస్మా లేయర్ ఉన్నంత మందంగానూ ఎర్రటిపొర ఎర్రరక్త కణాలుగా గుర్తించవచ్చు. రక్తంలో మొత్తం 4000 విభాగాలున్నా అందులో ముఖ్యమైనవి నాలుగు మాత్రమే. ఇవి ఎముక మజ్జలో ఎప్పటికప్పుడు తయారవు తుంటాయి. అయితే దాతలు ఎవరైనా సరే రక్తాన్ని దానం చేసి, మరొకరి ప్రాణాలను కాపాడొచ్చు. రోగ నివారణ కోసం, ప్రమాదాల సమయంలో, విపత్కర ఆరోగ్య పరిస్థితుల్లో బాధితుల శరీరంలో రక్తం తగినంతగా లేకపోతే మరొకరి నుంచి రక్తాన్ని ఎక్కిస్తుంటారు. ఇలాఒకరి రక్తం మరొకరికి ఇచ్చే విధానమే రక్తదానం. ఇలా రక్తదానం చేయడం కేవలం సేవ మాత్రమేకాదు, ప్రతిఒక్కరి బాధ్యత. రక్తాన్ని తీసుకొనే వ్యక్తిని 'గ్రహీత' అని, ఇచ్చేవ్యక్తిని 'దాత' అని అంటారు. 'ఒ' గ్రూప్ రక్తం కలిగిన వారిని 'విశ్వదాత' అంటారు. రక్తం రంగు చూడడానికి అంతా ఒకేలా ఎర్రగా కన్పించినా కొంత మంది రక్తం కొన్ని గ్రూపుల వారికే ఉపయోగపడుతుంది. ఎవరు ఎవరికి రక్తం దానం చేయవచ్చంటే...ఎబి గ్రూప్ వారు ఎబి గ్రూప్ కి, ఎ గ్రూప్‌వారు, ఎబి గ్రూపుల వారికి, బి గ్రూప్ వారు బి, ఎబి గ్రూపుల వారికి, 'ఒ' గ్రూప్ వారు ఎ,బి, ఎబి, ఒ గ్రూప్‌ల వారందరికిదానం చేయొచ్చు. అదే విధంగా ఎవరు ఎవరి నుంచి రక్తం తీసుకోవచ్చంటే ఎబి గ్రూప్ వారు అన్ని గ్రూపుల వారి నుంచి. బి గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఎ గ్రూప్ వారు బి, ఒ గ్రూపుల వారి నుంచి, ఒ గ్రూప్ వారు ఒ గ్రూప్ నుంచి మాత్రమే రక్తాన్ని తీసుకోవాలి. తగినంత ఆరోగ్యంగా ఉంటూ 16 నుంచి 60 సంవత్సరాల వయసు లోపల ఉన్నవారెవరైనా రక్తదాతలు కావొచ్చు. 45 కేజీల కంటే అధిక శరీర బరువు కలిగిన వారు, రక్తపోటు, నాడీ రేటు, గుండె కొట్టుకునే స్థితి, సాధారణంగా ఉన్నవారు రక్తాన్ని దానం చేయవచ్చు. ఒక వ్యక్తి ప్రతి 34 నెలలకు ఒక్కసారి రక్తాన్ని దానం చేయొచ్చు. 18 ఏళ్లు నిండిన వారు జీవిత కాలంలో 168 సార్లు రక్తదానం చేయొచ్చు. ఈ లెక్కన ప్రతి ఒక్కరూ 672 మంది ప్రాణాలు కాపాడొచ్చు. రక్తాన్ని సేకరించిన తర్వాత 35నుంచి 45 రోజుల పాటు నిల్వ చేస్తారు. ఈ రక్తాన్ని మూడు రూపాల్లో విభజిస్తారు. రెడ్ సెల్స్, ప్లాస్మా, ప్లేట్లెట్స్ అనే ఈమూడు రకాలని ముగ్గురికి వారి వారి అవసరాలను బట్టి అందిస్తారు. రక్తం అవసరమైనవారికే కాదు. దానిని దానం చేసే దాతలకూ ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. రక్తదాతలకు సాటి మనుషుల ప్రాణాలు కాపాడే అవకాశం లభిస్తుంది. ఇది సాటిలేని సంతృప్తిని ఇస్తుంది. రక్తదానం చేసేవారిలో గుండెకు సంబంధించిన రోగాలు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. తరచూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో ఉత్పత్తయ్యే ఇనుము శాతం పూర్తి నియంత్రణలో ఉండడమే దీనికి కారణం. రక్తదానం క్యాన్సర్ బారిన పడే అవకాశాల్ని దాదాపుగా తగ్గిస్తుంది. రక్తదానం చేసేవారికి తమ శరీరానికి సంబంధించిన అనేక రకాలైన రక్త పరీక్షలను పూర్తిగా, ఉచితంగా చేసుకునే అవకాశం దొరుకుతుంది. దీనివల్ల రక్తదానం చేసేవారు తమకు తాము ఆరోగ్య వంతులుగా ఉండడానికి తగిన జాగ్రత్తలు తీసుకునే సదుపాయం ఉంది. రక్తదానం చేయడం వల్ల శరీరంలోని కేలరీలు ఖర్చు అవుతాయి. దీంతో బరువు పెరిగే ప్రమాదం నుంచి సులభంగా తప్పించుకోవచ్చు. కొవ్వు తగ్గుతుంది. రక్తపోటు నియంత్రణలో ఉండి, శరీరం ఫిట్‌గా ఉంటుంది. ఎర్ర రక్తకణాల్లో చెడు, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడానికి రక్తదానం చాలా ఉపయోగకరం. శరీరంలో ఇనుము స్థాయిని సమతుల్యం చేస్తుంది. రక్తంలో ఎక్కువగా ఐరన్ ఉంటే గుండెకు హానిచేస్తుంది. కార్డియో వాస్కులర్ వ్యాధులను నివారించేందుకు రక్తదానం ఉపకరిస్తుంది. మహిళల్లో వయస్సు పెరిగిన తర్వాత రుతుస్రావం పూర్తిగా నిలిచి పోయినప్పుడు (మెనోపాజ్ సమయంలో) వారి శరీరంలో నిల్వ ఉండే ఐరన్ స్థాయిని సమతుల్యం చేసుకోవడానికి రక్తదానం చేయడం చాలా మేలు కలిగిస్తుంది. ఏటా మన దేశంలో 4 కోట్ల యూనిట్ల రక్తం అవసరమవుతుంటే, అందుబాటులో ఉన్నది కేవలం 40 లక్షల యూనిట్లు మాత్రమే. మానవ రక్తానికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేదు. దేశంలో ఏటాకొత్తగా 10 లక్షల మంది క్యాన్సర్‌బాధితులుగా తేలుతున్నారు. కీమోథెరపీ చికిత్స సందర్భంగా తరచూవారికి రక్తం అవసరం ఉంటుంది. రక్తదాన ప్రక్రియ పావుగంటలో పూర్తవుతుంది. మన శరీరంలో 10 యూనిట్ల రక్తం ఉంటే, ఒక యూనిట్ రక్తాన్నిదానం చేయవచ్చు. ●



# ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ ఆదర్శంగా నిలవాలి

## కలెక్టర్ లక్ష్మీషా సూచన

విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీని ఎన్టీఆర్ జిల్లాలో ఆదర్శంగా తీర్చిదిద్దటానికి అన్ని రకాల సేవలు అందించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా కోరారు. నూతనంగా



ఎంపికైన ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గంతో జిల్లా కలెక్టర్ శుక్రవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఎన్టీఆర్ జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీచైర్మన్ డాక్టర్ జి.సమరం,



వైస్‌చైర్మన్ డాక్టర్ వెలగా జోషీ ఆధ్వర్యంలో కార్యవర్గం జిల్లా కలెక్టర్‌తో సమావేశమైంది. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త కార్యవర్గం ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో సేవలు విస్తృతం చేయాలన్నారు. విద్యారంగంలోనూ ఎంఎస్ఎస్‌లోనూ డాక్టర్ వెలగా జోషి చేసిన సేవలుఇపుడు రెడ్‌క్రాస్ సొసైటీకి పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు.

## లుక్ ఛారిటీ ఆధ్వర్యంలో నిత్యావసరాల పంపిణీ

గుంటూరు,జూన్13, ప్రభాతవార్త: లుక్ కల్చరల్ మీడియా ఆధ్వర్యంలో శుక్రవారం ఛారిటీ కార్యక్రమం నిర్వహించారు. లుక్ డైరెక్టర్ రాబర్ట్ క్యారీ, మేనేజర్ లూసీల సూచనల మేరకు పెదకాకాని మండలంలోని వెనిగండ్ల హైస్కూల్ సమీపంలో ఉన్న పేదలను గుర్తించి 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, గోధుమపిండి, నూనె ప్యాకెట్‌లు వారికి అందజేశారు. లుక్ విజయవాడ టీమ్ ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. లుక్ ఛారిటీ సంస్థ నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పేదలను గుర్తించి సేవా కార్యక్రమాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లుక్ విజయవాడ టీమ్ ప్రతినిధులు డా॥రాజశేఖర్, డా॥యం.వి.రావు, డా॥నాయక్, బి.సతీష్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్లకు అభిషేకాలంకారాలు - చండీహోమం

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : స్థానిక మల్లారెడ్డినగర్‌లోని శ్రీ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి,శ్రీవిద్యాసరస్వతి,పర్వతవర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏం.కె.ఆర్.అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్న క్రమంలో శుక్రవారం ఉదయం గోపూజ,గురుప్రార్ధన,మండపారాధన,మండప దేవతా హోమాలు వేదమంత్రాల నడుమ నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలోని శ్రీపర్వతవర్ధిని,మాలికాపురోత్తమ్మ అమ్మవార్లకు పంచామృతాలు,సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకాలు జరిగాయి.అనంతరం చండీహోమం,తీర్థప్రసాద వితరణ జరిగింది.ఆలయ పూజారులు శివకుమారశర్మ,చంద్రశేఖర శర్మ,అర్చకబృందం వేదమంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు,అమ్మవార్లకు విశేషాలంకారాలు నిర్వహించారు.సాయంత్రం ప్రతిరోజూ జరిగే హోమాల్లో భాగంగా లలిత సహస్రనామ హోమం జరిగింది.కార్యక్రమాలను అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి,కొండారెడ్డి తదితర కార్యవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

## లేమల్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినికి మెరిట్ స్కాలర్‌షిప్

గుంటూరు విద్య,జూన్ 13,ప్రభాతవార్త : మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ స్నేహితులు,ప్రవాసాంధ్రులు చుండూరు వెంకట లక్ష్మీ సత్యనారాయణ సౌజన్యంతో 2024-25విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 7వ తరగతి విద్యార్థిని వి.శ్రీనిఖి కి రూ.10,000ల నగదుతో మెరిట్ స్కాలర్‌షిప్ ను అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలోని బాలబాలికల విద్యాభివృద్ధికి మెరిట్ స్కాలర్‌షిప్‌లు కొంత దోహదపడతాయని ఈ నేపథ్యంలోనే ఈ తరహా ప్రోత్సాహకరమైన నగదు పురస్కారాలను బాలబాలికలకు అందజేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.ప్రతి విద్యా సంవత్సరంలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బాలబాలికలకు ఈ ప్రోత్సాహకాలు అందించడం జరుగుతుందని శ్రీధర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రవాస ఆంధ్రులైన తన స్నేహితులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రామపెద్దలు పాతూరి కృష్ణారావు,ఒంగోలు కృష్ణయ్య పాల్గొన్నారు.పిల్లల విద్యాభివృద్ధికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసుపులేటి శ్రీధర్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## పథకం ప్రకారమే వైసిపి దుష్ప్రచారం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట,జూన్13,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వంపై, పథకాల అమలుపై పనిగట్టుకొని మరీ దుష్ప్రచారం చేయడం వైసిపి నేతలకు, ఆ పార్టీ పేటియమ్ బృందానికి ఒక వ్యసనంగా మారిందని, పద్ధతి మార్చుకోకుండా వికృతానందం పొందుతూ వారు చేసే విషప్రచారానికి తగిన మూల్యం చెల్లించుకుంటారని మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుపరిపాలన ఏడాది పూర్తయిన శుభసందర్భాన్ని పురస్కరించుకొని కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం అమలుచేస్తుంటే ఓర్వలేని వైసిపి పెయిడ్ ప్రచార కర్తలు డబ్బులు బ్యాంకులో పడటం లేదని, కోతలు పెట్టారని, అర్హులకు అన్యాయం జరిగిందని ప్రచారం చేయడాన్ని ప్రత్తిపాటి తీవ్రంగా ఖండించారు. ఆర్థిక సమస్యల వల్ల పథకం అమలులో జరిగే కొద్దిపాటి జాప్యాన్ని కూడా వక్రీకరించి ప్రచారం చేయడం మంచి విధానం కాదని అన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో తల్లికి వందనం అమలుపై అధికార యంత్రాంగం సమీక్షిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి నిధులు అందేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యాకిట్లు పంపిణీతో పాటు తల్లికి వందనం అమలుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు.

**వాస్తవాలు గ్రహించకుండా పనిగట్టుకొని ప్రజలలో విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ప్రభుత్వం ఉపేక్షించదు**

జగన్ చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల కోలుకోలేని విధంగా దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడినపెడుతూనే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. ఏడాదిలోనే ఎన్నో పథకాలు అమలు చేశారని, సామాజిక ఫించన్ల పెంపు, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు, నాలా పన్ను, చెత్తపన్ను రద్దు, అన్నాక్యాంటిన్ల పునరుద్ధరణ, మత్యకారులకు, చేనేతలకు ఆర్థిక సహాయం, మెగా డీఎస్సీ అమలు, ఉద్యోగస్తులకు ఠంచన్‌గా ఒకటో తేదినే జీతాల చెల్లింపు, ఎస్సీ వర్గీకరణ అమలు, ఇంటింటికి సురక్షిత తాగునీరు, అర్చకులు, నాయిబ్రాహ్మణుల జీతాల పెంపు, 21 ప్రధాన ఆలయాలలో నిత్యాన్నదానంచేనేత మగ్గాలకు, ఎస్సీఎస్టీలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, జీఓ 217,117 రద్దు, రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల వంటి ఎన్నో ప్రజా ప్రయోగ పనులు, పథకాలు చేపట్టడం జరిగిందని అన్నారు. తల్లికి వందనం పథకంపై కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో రూ 10వేల కోట్లు ఖర్చుపెట్టనుందని తెలిపారు. జగన్ రెడ్డి ఐదేళ్ల కాలంలో ఖర్చుపెట్టింది కేవలం రూ5వేల కోట్లు మాత్రమేనని తెలిపారు. మీ పిల్లల భాధ్యతనాది అని ప్రచారం చేసుకున్న జగన్ 2019 ఎన్నికలలో అధికారంలోకి వచ్చాక రూ 15వేలు ఇవ్వకుండా కేవలం రూ 13వేలు మాత్రమే చెల్లించాడని, అర్హుల సంఖ్యలో కూడా కోతపెట్టాడని ప్రత్తిపాటి విమర్శించారు. ప్రజలు భారీ మెజారిటీతో ఎన్నుకున్న ప్రభుత్వాన్ని ప్రసార, సామాజిక మాధ్యమాలలో పథకం ప్రకారం బదనాం చేయాలని చూసేవారు, వారిని వెనకుండి నడిపించేవారు జైళ్లల్లో శేష జీవితం గడపటం ఖాయం అని ప్రత్తిపాటి హెచ్చరించారు.

## నవోదయం-2లో భాగంగా హస్నాబాద్‌తండాలో కార్డన్ సెర్చ్

మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారులు సూచనల మేరకు మాచర్ల మండలం హస్నాబాద్‌తండాలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్లో మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాష, ఎస్సై మొహమ్మద్ షఫీ, పట్టణ ఎస్సై సంధ్యారాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నల్ల బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి



పెదనందిపాడు జూన్ 13 (ప్రభాతవార్త) మాటలతో కాలయాపన చేయకుండా ప్రభుత్వం వెంటనే రైతులు వద్ద నిల్వ ఉన్న నల్లబర్లి పొగాకును మార్క్ ఫెడ్ ద్వారా. రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకోవాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ రావు అన్నారు. ఈ మేరకు వారు పెద్దనందిపాడు తహసిల్దార్ హెన్నా ప్రియ కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో దళిత బహుజన్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్ కుమార్. బి సునీల్ కుమార్. ఐలా మాణిక్యరావు. తదితరులు ఉన్నారు.

# అమరావతి వార్త



## రోడ్లు, డ్రైన్లు, త్రాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలి

### -కమీషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు తూర్పు, జూన్ 13 (ప్రభాతవార్త) : నగరపాలక సంస్థ పరిధిలో మౌలిక వసతులపై రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రాధాన్యత క్రమంలో చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని నగర కమీషనర్ పులి శ్రీనివసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమీషనర్ గోరంట్ల, కోదండరాం నగర్ నగరాలలోని పలు ప్రాంతాల్లో



పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ ఏఈల వారీగా ఆయా ప్రాంతాల్లో ముఖ్యమైన మౌలిక వసతులైన రోడ్లు, డ్రైన్ల, త్రాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రాంతంలో సిసి రోడ్లు కాకుండా తొలుత ప్రజల రాకపోకలకు వీలుగా జిఎస్బి రోడ్లను డ్రైన్లతో కలిసి ప్రతిపాదించాలన్నారు. కోదండరాం నగర్ స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, మౌలిక వసతులను పరిశీలించి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల నుండి అందే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య పనులపై ప్రజారోగ్య అధికారులతో మాట్లాడుతూ నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ జరిగితే రోడ్ల మీద ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు ఉండవన్నారు. పర్యటనలో డిఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అపర సంజీవని సీఎంఆర్ఎఫ్

### - ఏడాది పాలన ప్రజారంజకం -విజనరీ లీడర్ చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

గుంటూరు తూర్పు, జూన్ 13 (ప్రభాతవార్త) : సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు ఆర్థిక అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. శుక్రవారం గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు రూ.5లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితులకు అందజేశారు. నగరంలోని షేక్ కరిమున్నీసా చేపూరి రమాదేవి, కందుల శివసృజన్ రామిరెడ్డి వివిధ అనారోగ్య సమస్యలతో ఈ క్రమంలో సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత కోసం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్‌ను సంప్రదించగా వెంటనే స్పందించారు.



బాధితుల వివరాలు తెలుసుకుని వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాది పాలన ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సాగిందని తెలిపారు. ఒక విజనరీ లీడర్ సిఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తిరిగి రాష్ట్రంలో ప్రగతికి బాటలు పడ్డాయని వివరించారు. యువత భవితకు సరికొత్త చిరునామాగా సాగిన ఏడాది సుపరిపాలనను ప్రజలందరూ పెద్ద మనస్సుతో దీవిస్తున్నారని పేర్కొన్నారు. మరింత సేవ చేసే విధంగా పాలన అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్స్ ముప్పవరపు భారతి, పోతురాజు, సమత, వేముల జ్యోతి, శనక్కాయల రాజకుమారి, రిహానా తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ తల్లికి వందనం ఇవ్వాలి-సిపిఎం నాయకులు

గుంటూరు తూర్పు, జూన్ 13 (ప్రభాతవార్త) : అనేక నిబంధనలతో ప్రత్యేకించి రేషన్ కార్డు ఉన్న వారికే తల్లికి వందనం ఇస్తామన్న పేరుతో పేదలు, చిరుద్యోగులకు తల్లికి వందనం ఆర్థిక సహాయం



ఇవ్వకపోవడం అన్యాయమని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ ఒక ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు అన్న పేరుతో చిరుద్యోగులు, అంగన్‌వాడీ, ఆశ యానిమేటర్లు తదితర స్కీం వర్కర్లు మరియు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇంతకుముందే రేషన్ కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు ఇవ్వకుండా దూరం చేయబడ్డారు. ప్రస్తుతం తల్లికి వందనం పేరుతో ఇచ్చే ఆర్థిక సహాయం కూడా రేషన్ కార్డు ఉన్న వారికే ఇస్తామనడంతో ఇలాంటి వారందరూ ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందే అవకాశం లేకుండా పోతున్నదన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం చిరు ఉద్యోగులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. హామీ మేరకు ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోగా ఇందుకు విరుద్ధంగా తల్లికి వందనం నుండి కూడా వారిని దూరం చేయడం సరైనది కాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా చిరుద్యోగులు, పేదలు అర్హులైన వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తున్నదన్నారు.

## 15న అవగాహన...లో ఆరోగ్యసభ

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : అవగాహన సంస్థ గత 15సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఆరోగ్యసభలో భాగంగా ఈవారం మెదడు నరాల సంబంధిత వ్యాధులపై సభ ఏర్పాటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.జూన్ 15వ తేది ఆదివారం ఉదయం 11గంటలకు అవగాహన సంస్థ కార్యాలయంలో జరిగే ఆరోగ్యసభకు సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ వివేక్ లంకా ప్రధాన వక్తగా పాల్గొంటారన్నారు.ఆరోగ్యాభిలాషులందరూ ఈ 347వ ఆదివారం ఆరోగ్యసభకు హాజరు కావలసిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## యావత్ భారతీయ సాహిత్యం గర్వించదగ్గ సాహితీమూర్తి డాక్టర్ సినారె

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : బహుభాషా కోవిధుడు,మహాకవి,సాహితీశిఖరం, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన విశ్వకవనమూర్తి,గొప్ప పరిశోధకుడు,విమర్శకుడు డాక్టర్ సి.నారాయణరెడ్డి అని అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యులు నివాళులర్పించారు.శుక్రవారం అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో డాక్టర్ సింగిరెడ్డి నారాయణరెడ్డి వర్ధంతి కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో కళాసౌధ అధ్యక్షుడు,గాయకులు బీళా అశోక్ మాట్లాడుతూ సాహితీ ప్రియులందరికీ క్లుప్తంగా సినారె గా సుపరిచితులైన సి.నారాయణరెడ్డి యావత్ భారతీయ సాహిత్యం గర్వించదగిన సాహితీమూర్తి అన్నారు.కార్యక్రమంలో గాయనీ లక్ష్మీ,బాబురావు,మల్లేశ్వరరావు,రాజ్యలక్ష్మి,తదితరులు సినారె గీతాలను ఆలాపించారు.

## మాటలకు అందని మహావిషాదం

గుంటూరు కల్చరల్,జూన్ 13,ప్రభాతవార్త : గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లోఎయిరిండియా విమానం కుప్పకూలి అందులోని ప్రయాణీకులు,సిబ్బంది,కూలిన ప్రాంతంలో ఉన్న వైద్యవిద్యారులు దుర్మరణం చెందటం అత్యంత విషాదకరమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.గమ్యాన్ని నిక్షేపంగా చేరుకుంటామన్న ప్రయాణీకుల నమ్మకాన్ని ఆ ఎయిర్ ఇండియా విమానం వమ్ము చేసిందని,అనేక ఆశలు,ఆశయాలు,ఊసులను గుండెల్లో నింపుకొని,నేలవాలగానే ముంచెత్తబోయే సన్నిహితుల,ఆత్మీయుల ఆలింగానాల కోసం ఎదురు చూస్తున్నవారు అర్ధాంతరంగా అతి విషాదంగా తమ జీవితాన్ని ముగించాల్సి వచ్చిందని అవగాహన సంస్థ విచారం వ్యక్తంచేస్తుంది.ఈ ప్రమాదానికి కారణాలన్నింటినీ నిజాయితీతో గుర్తించి కఠినచర్యలు చేపట్టడంతోపాటు సరైన పరిష్కారాలను సాధించడం అవసరమని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## కొండపైన అనధికార కట్టడాలను నిర్మూలించండి : కమీషనర్ ధ్యానచంద్ర

### సివిఆర్ ఫ్లై ఓవర్ కింద ఉన్న అవుట్‌ఫాల్ డ్రైన్‌ను పరిశీలన

విజయవాడ కార్పొరేషన్,జూన్ 13,ప్రభాతవార్త: ప్రజల క్షేమమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని, కొండపైన ఉన్న అనధికార కట్టడాలను నిర్మూలించాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన వన్‌టౌన్,పంజా సెంటర్,చిట్టినగర్,కెఎల్ రావు పార్క్,సివిఆర్ ఫ్లై ఓవర్,పైపుల్ రోడ్,అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండపైన అనధికార కట్టడాలను నిర్మించాలని,అధికారులు



ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణాలను ఎటువంటి భంగం కల్గకుండా ఉండేందుకు కార్పొరేషన్ తీసుకుంటున్న చర్యలు కూడ తప్పకుంటా అందరూ పాటించాలని అధికారులను ఆదేశించారు. ఒన్‌టౌన్ లో బ్రిడ్జి వద్ద కూలిన గోడను చూసి త్వరగా మరమ్మత్తులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కల్గకుండా చూసుకోవాలని, గోడ నిర్మాణం పూర్తయ్యేలోపు వెంటనే మెస్ వేసి ప్రజలకు ఎలాంటి హానీ కల్గకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కెఎల్ రావు రోడ్,కెఎల్‌రావు పార్క్ ప్రాంతాలన్నీ పర్యటించి పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని,పారిశుద్ధ కార్మికులు ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంటేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. సివిఆర్ ఫ్లై ఓవర్ కింద ఉన్న అవుట్‌పాల్ డ్రైన్‌ను పరిశీలించి,గత కొంతకాలంగా చేస్తున్న డీసిల్టింగ్ ప్రక్రియ కృషి కనబడుతోందని అవుట్‌ఫాల్ డ్రైన్ కొంత వరకు పరిశుభ్రంగా ఉందని, మరో వైపు జెసిబితో వ్యర్థాలను తీస్తున్న పనులు కనబడుతున్నాయని అధికారులందరూ నిత్యం ఇలాగే ప్రతి అవుట్ ఫాల్ డ్రైన్‌లలో ఈ కృషి పెడితే ఖచ్చితంగా డీ సిల్టింగ్ ప్రక్రియ విజయవంతమై రోడ్డుపైన నీటి నిల్వలు లేకుండా చూసుకోగలమన్నారు. నిజాంగేట్,గాంధీహిల్ ఔట్‌ఫాల్ డ్రైన్‌ల స్థితిగతులను అధికారులనడిగి ఆయన తెలుసుకున్నారు.

## తల్లికి వందనం అమలుపై తల్లిదండ్రుల్లో ఆనందం..



ఎ కొండూరు, జూన్ 13, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం 'తల్లికివందనం' బృహత్తర కార్యక్రమాన్ని విద్యార్థులకు అమలు చేయడంపై విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎన్టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కృష్ణారావుపాలెం టిడిపి బూత్ కన్వీనర్ భరోతు తిరుపతిరావు, తిరువూరు ఎఎంసి డైరెక్టర్ భరోతు రాణిలు సిఎం చంద్రబాబుకు మంత్రి నారా లోకేష్‌బాబుకు హర్షం ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్-5 పథకాలు ఒక్కొక్కటి చేయడం ఎన్టిఆర్ భరోసా పెన్షన్‌లు ఉచిత గ్యాస్ తల్లికి వందనం అమలు చేస్తున్నారని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా మాజీ సిఎం జగన్ విధ్వంసక పాలన నుండి రాష్ట్రంలో అభివృద్ధిని సంక్షేమాన్ని గాడిలో పెట్టడం చంద్రబాబు విజనరీ లీడర్‌గా ఖ్యాతి గడించారని తిరుపతిరావు రాణి దంపతులు పారదర్శక పాలనపై ప్రశంసించారు. గత వైసిపి ప్రభుత్వం ఇంట్లో ఒక్కరికే ఈ పథకాన్ని వర్తింప చేశారని కాని నేడు సిఎం చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఇంట్లో ఎంతమంది ఉన్నా అంతమంది పిల్లలకు విద్యార్థులకు ఈ పథకాన్ని వర్తింప చేసి తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమచేయడం పట్ల చంద్రబాబు లోకేష్‌బాబుకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారని తిరుపతిరావు, రాణి దంపతులు పేర్కొన్నారు.

## రహదారి వెంట కాలుష్యం వెదజల్లుతున్న స్టోన్ క్రషర్లు

### పట్టించుకోని అధికారులు.. శ్వాసకోశ ఇంకా ఇతర వ్యాధులు సోకే ప్రయాణీకుల హైరానా



ఎ కొండూరు, జూన్ 13, ప్రభాతవార్త :ఇబ్రహీంపట్నం మైలవరం తిరువూరు జాతీయ రహదారి-30పై ఎన్టిఆర్ జిల్లా జి కొండూరు మండల వెంకటాపురం జాతీయ రహదారికి ఆనుకొనివున్న స్టోన్ క్రషర్‌ల దుమ్ము ధూళి వల్ల ప్రయాణీకులు ద్విచక్ర వాహన చోదకులు పాదచారులు సైక్లిస్టులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఈ స్టోన్ క్రషర్ల నుండి వెదజల్లుతున్న కాలుష్యం వల్ల ప్రజలకు శ్వాసకోశ వ్యాధులు ఇంకా ఇతర జబ్బులు సోకుతున్నాయని ఈ కాలుష్యం వల్ల ఎదురెదురుగా వచ్చే వాహనాలు సరిగా కనపడటం లేదని దీనివల్ల రహదారి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపించారు. జాతీయ రహదారిపై ఈ స్టోన్ క్రషర్ యజమానులు గత ఎన్నో ఏళ్లుగా నిబంధనలు పాటించకుండా క్రషర్‌లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక వేతనాలు చట్టాలు అమలు చేయకుండా శ్రమతో దోపిడీ చేస్తున్నా క్రషర్ యజమానులు మామూళ్ల మత్తులో రెవెన్యూ పోలీస్ జోగుతూ యజమానుల పట్ల ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని పలువురు ఈ శాఖల పనితీరును ఆక్షేపించారు. ఇకనైనా ఈ వెంకటాపురం గ్రామంలో రహదారికి ఆనుకుని ఉన్న ఈ క్రషన్ యజమానులు నిబంధనలు పాటించే విధంగా కార్మిక చట్టాలు అమలు చేసే విధంగా కఠిన చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు ప్రయాణీకుల ద్విచక్ర వాహన చోదకులు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని ఎన్టిఆర్ జిల్లా కలెక్టర్‌కు జి కొండూరు, ఇబ్రహీంపట్నం, మైలవరం, ఎ కొండూరు, తిరువూరు మండల ప్రాంత ప్రయాణీకులు విజ్ఞప్తి చేశారు.

## ఫాదర్స్‌డే సందర్భంగా తండ్రి శ్రేయస్సుకు బహుమతి

విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త : ఈ ఫాదర్స్ డే సందర్భంగా మీ తండ్రికి ఎల్లప్పుడు తోడుగా వుండి రక్షణ కలిగించే కోల్గేట్ అడ్వాన్స్‌డ్ హెల్త్‌ను, విజిబ్ వైట్ ఓ2 టూత్‌బ్రష్‌ను బహుమతిగా అందించాలని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 130కన్నా ఎక్కువ గ్లోబల్ పేటెంట్లతో సూక్ష్మక్రిముల వృద్ధిని మూడురెట్లు సమర్థంగా ఎదుర్కొని చిగుళ్ళ,పళ్ళ సమస్యలను నివారిస్తుందన్నారు.

## దేశవ్యాప్తంగా ఇసుజు-ఐకేర్ మాన్సూన్ సర్వీస్ క్యాంప్

విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త : ఉత్తమ సర్వీస్, యాజమాన్య అనుభవాన్ని అందించేందుకు దేశవ్యాప్తంగా అందించే ఇసుజు ఐకేర్ మాన్సూన్ సర్వీస్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఇసుజు మోటార్స్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఇసుజు డి మ్యాక్స్ పికప్స్, ఎస్‌యువి శ్రేణి కొరకు నిర్వహించే ఈ క్యాంప్‌లో డ్రైవింగ్‌లో వర్షాకాలం ఎదురయ్యే ఇబ్బందులను నివారించడానికి చెక్ చేస్తామని ఈనెల 16 నుండి 21 వరకు కస్టమర్ల వారి వాహనాలకోసం ప్రత్యేక ఆఫర్లు, ప్రయోజనాలందుకోవాలన్నారు.

## అమేజాన్ ప్రైం మెంబర్‌షిఫ్‌లో మరింత ఆదాలు అందుకోండి

విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త : అత్యంత వేగమైన డెలివరి, ఆదాను, సౌలభ్యాన్ని, వినోదాన్ని అందుకోవాలని అమేజాన్ ప్రైం ప్రతినిధులు తెలిపారు. అమేజాన్‌పే, ఐసిఐసిఐ క్రెడిట్‌కార్డులతో కొనుగోళ్ళుపై 10లక్షలకు పైగా ఉత్పత్తుల విషయంలో అదేరోజు డెలివరి, 40 లక్షలకు పైగా ఉత్పత్తులను తదుపరి రోజు డెలివరి, అపరిమిత 5"%' క్యాష్‌బ్యాక్ అందిస్తామన్నారు.

## జూన్ 18నుండి ఐక్యుజెడ్ 10లైట్ ప్రారంభం

విజయవాడ, జూన్ 13, ప్రభాతవార్త : అధిక పనితీరు కలిగిన 5జి స్మార్ట్‌ఫోన్ ఐక్యూ జెడ్ 10 లైట్‌ను జూన్ 18న అమ్మకాలు ప్రారంభిస్తున్నామని ఐక్యూ ప్రతినిధులు తెలిపారు. రోజువారి అవసరాలతో పాటు, విద్యార్థులకు తరగతులకు హాజరవ్వడం, రీల్స్ స్క్రోలింగ్, ప్రయాణంలో గేమింగ్‌లకు అనుగుణంగా మల్టిటాస్కింగ్ యాప్‌లను ఆనందించడానికి వీలుగా అత్యాధునిక సాంకేతికతతో రూపొందించామన్నారు.

## ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ



తిరువూరు, జూన్ 13, ప్రభాతవార్త : ఎన్టిఆర్ జిల్లా తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామంలో గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు అధ్యక్షతన ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపివో మున్ని, ఆడిట్ అధికారి వెంకటేశ్వరరావు, మామిడి శరత్, నరసింహారావు, షేక్ మస్తాన్, రామారావు, ఉపాధి హామీ కూలీలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వెంగళరావునగర్ మున్సిపల్ స్కూల్లో విద్యామిత్ర కిట్లు పంపిణీ


గుంటూరు విద్య,జూన్ 13,ప్రభాతవార్త : గుంటూరు నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల,ప్రాథమిక పాఠశాల నంబర్ 88వెంగళరావు నగర్‌లో సర్వేపల్ల రాధాకృష్ణన్ విద్యాకిట్‌లను విద్యార్థులకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వీర్ల త్రివేణి,హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె.ప్రమీల,పిఎస్‌హెచ్ఎం గుర్రం లక్ష్మీదేవి విద్యాకమిటీ మెంబర్లు ఆరుమళ్ళ చెంచు,పవన్,రుద్రా కిషోర్,కట్టా కోటయ్యల చేతుల మీదుగా అందించడం జరిగింది.స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ గౌరవసభ్యులు ఈ సందర్భంగా మాట్లాడుతూ మంచి నాణ్యమైన బ్యాగులు ఆకర్షణీయమైన పుస్తకాలు విద్యార్థులను ఆకట్టుకునే విధంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్ ఉందని

14-6-25 TERA PAGE 8.qxd:14-6-25 TERA PAGE 8.qxd 14/06/25 12:18 AM Page 1



# గోపీచంద్ బర్త్ డే గ్లింప్స్ రిలీజ్

**మాచో స్టార్** గోపీచంద్ ప్రస్తుతం తన కొత్త చిత్రం గోపీచంద్33లో నటిస్తున్నారు. విజనరీ సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ హిస్టారికల్ ఎపిక్ షూటింగ్ జరుగుతోంది. గోపీచంద్ పుట్టినరోజును పురస్కరించుకుని, మేకర్స్ అద్భుతమైన పోస్టర్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. గోపీచంద్ లుక్ చూస్తే షాక్ అవ్వాల్సిందే. ఒక యోధుడిగా అద్భుతంగా ట్రాన్స్‌ఫార్మ్ అయ్యారు. పొడవాటి జుట్టు, యుద్ధగాయాలు, నుదిటిపై వీర తిలకంతో కనిపించిన ఇంటెన్స్ లుక్ ఫ్యాన్స్‌ను సర్ ప్రైజ్ చేసింది. చేతిలో ఖడ్గంతో యుద్ధరంగంలో కనిపించిన ఈ పోస్టర్ శక్తి, శౌర్యాన్ని ప్రజెంట్ చేస్తోంది. మంచుతో కప్పబడిన అద్భుతమైన పర్వత శ్రేణుల నడుమ గ్లింప్స్ ప్రారంభమవుతుంది. ఓ యోధుడు తన టెంట్ నుంచి బయటకు వస్తాడు. తాను ప్రేమగా పెంచిన గుర్రంతో మమేకమయ్యే విజువల్‌లో తన తలను గుర్రం తలపై ఆనిస్తూ, మౌనంగా ఓ వాగ్దానాన్ని చేస్తాడు. దీనికి బ్యాక్గ్రౌండ్‌లో "ధీర ధీర" సంగీతం మ్యాజికల్ అనుభూతిని కలిగిస్తుంది. ఈ విజువల్స్ మనసును తాకుతూనే పవర్‌ఫుల్‌గా, పీస్ మెడిటేటివ్ ఫీల్‌ను ఇస్తున్నాయి. ఐబి 71 (ఆకాశంలో), ఘాజి (నీటిలో), అంతరిక్షం (అంతరిక్షంలో) వంటి విభిన్న కథనాల చిత్రాలతో తన ప్రత్యేక కథనశైలి, సాంకేతిక నైపుణ్యంతో గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి, ఇప్పుడు మరో డిఫరెంట్ జానర్‌లోకి అడుగుపెట్టారు. సంకల్ప్ రెడ్డి ఈ సినిమాలో భారతదేశ చరిత్రలో మరిచిపోయిన ఒక కీలక ఘట్టాన్ని అద్భుతంగా మలిచారు. 7వ శతాబ్దం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా, ఇప్పటి వరకు ఎవరూ టచ్ చేయని ఒక చారిత్రక ఘటనను ఆవిష్కరిస్తూ, మరిచిపోయిన అధ్యాయానికి మళ్లీ జీవంపోస్తోంది. గోపిచంద్ ఈ సినిమాలో ఇప్పటివరకు ఎప్పుడూ చూడనివంటి విభిన్న పాత్రలో కనిపించనున్నారు. ఈ ఏప్రిల్‌లో కాశ్మీర్ అందమైన లొకేషన్లలో తొలి షెడ్యూల్ చిత్రీకరణ పూర్తయ్యింది. ఆ అద్భుత దృశ్యాలు బిగ్ స్క్రీన్‌పై గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వనున్నాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రూపొందించిన సెట్లో నెక్స్ట్ షెడ్యూల్ ప్రారంభమైంది. ఈ చిత్రానికి సంబంధించి ఇతర నటీనటులు , సాంకేతిక బృందానికి సంబంధించిన వివరాలను మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.



తారాగణం: గోపీచంద్, సాంకేతిక సిబ్బంది: రచన, దర్శకత్వం: సంకల్ప్ రెడ్డి
నిర్మాత: శ్రీనివాసా చిట్టూరి, బ్యానర్: శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్,
సమర్పణ: పవన్ కుమార్
పీఆర్వో: వంశీశేఖర్
మార్కెటింగ్: విష్ణు తేజ్ పుట్ట.

# 'గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకను విజయవంతం చేయాలి: దిల్‌రాజు

**కొంత విరామం** తరువాత సినిమా నటీనటులను, సాంకేతిక నిపుణుల ప్రతిభను ప్రోత్సాహించే సంప్రదాయ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం మళ్లీ శ్రీకారం చుట్టింది. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్‌ను ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు వాటిలో నటించి ఉత్తమ ప్రతిభను చూపిన నటీనటులకు, సాంకేతిక నిపుణులతో పాటు 2014 జూన్ నుండి 2024 డిసెంబర్ 31 వరకు సెన్సారు జరుపుకున్న చిత్రాల్లో కూడా ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి ఇందులో భాగంగా అవార్డ్స్ ఇవ్వనున్నారు. ఇటీవల విజేతల జాబితాను కూడా ప్రటించారు. కాగా అపూర్వ వేడుక కోసం హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదిక సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. జూన్ 14న అంగరంగ వైభవంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ వేడుకను తెలంగాణ ప్రభుత్వం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తోంది. దాదాపు కొంత విరామం తరువాత ప్రభుత్వ అందిస్తున్న తెలంగాణ గద్దర్ అవార్డులు అందుకోవడం పట్ల అవార్డుల విజేతలు, తెలుగు సినిమా ప్రముఖులు, తెలుగు సినిమా ప్రేక్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ప్రతిభను గుర్తించి తగు రీతిలో సత్కరించబోతున్న తెలంగాణ ప్రభుత్వం మీద ప్రశంసల జల్లులు కురిపిస్తున్నారు. ఈ వేడుకను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, అత్యంత ఘనంగా జరిపించడానికి తగు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక వేడుకకు తెలుగు తారాలోకమంతా తరలి రాబోతున్నారు. తప్పకుండా జూన్ 14న హైటెక్స్ వేడుక తారల తళుకులతో ప్రకాశవంతం కాబోతుంది. కాగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ, ఈ నెల 14న హైటెక్స్ వేదికగా తెలంగాణ గద్దరు అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా జరగనుంది. 14 సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఈ కార్యక్రమం విజయవంతం చేయాలసిన బాధ్యత సినీ పరిశ్రమపై కూడా ఉంది. ఆ రోజు కార్యక్రమానికి ఐ అండ్ పీఆర్ ద్వారా లైవ్ ప్రసారం కానుంది. ప్రపంచవ్యాప్తంగా ఈవెంట్ అందరికి రీచ్ అవ్వాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. సాయంత్రం ఆరు గంటలకు ఈ వేడుక ప్రారంభం కానుంది. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాల్లో ప్రతి ఏడాది నుంచి మూడు ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి వాటికి ఈ వేడుకలో అవార్డులు అందిస్తున్నాం. ప్రతి సంవత్సరానికి సంబంధించి ఎంపికైన మూడు ఉత్తమ చిత్రాలకు పనిచేసిన హీరో, హీరోయిన్, దర్శకుడు, నిర్మాతలకు అంది స్తున్నాం. ఇలాంటి ఓ మంచి సాంప్రదా యాన్ని గద్దర్ ఫిల్మ్ అవార్డులతో ఇంట్రు డ్యూస్ చేస్తున్నాం. 2024లో విడుదలైన ఉత్తమ చిత్రాలకు, ఉత్తమ సాంకేతిక నిపుణు లకు కూడా అవార్డులు అందజేస్తున్న సంగతి తెలిసిందే. 14 సంవత్సరాల తరువాత జరు గుతున్న ఈ వేడుకను తెలుగు సినీ పరిశ్రమ లోని అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.



# 'డ్యూడ్' 80శాతం షూటింగ్ పూర్తి

**మల్టీ టాలెంటెడ్** తేజ్ నటిస్తూ కన్నడ తెలుగు మలయాళ భాషల్లో దర్శకత్వం వహిస్తున్న త్రిభాషా చిత్రం డ్యూడ్. ఫుట్ బాల్ నేపథ్యంలో బలమైన భావోద్వేగాలతో సాగే ఈ చిత్రాన్ని ఫుట్ బాల్ ప్రేమికుడైన స్వర్గీయ కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ కు అంకితం చేస్తున్నారు. 80శాతం షూటింగ్ పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న డ్యూడ్ చిత్రం టీజర్ త్వరలో విడుదల చేయనున్నారు. హీరో కమ్ డైరెక్టర్ తేజ్ మాట్లాడుతూ, హీరోగా, డైరెక్టర్‌గా డ్యూడ్ చిత్రం ఔట్ పుట్ పట్ల చాలా హ్యాపీగా ఉన్నాను. రష్ చూసుకుంటుంటేనే చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. ఎప్పుడెప్పుడు ఆడియన్స్‌తో కలిసి థియేటర్స్‌లో సినిమా చూసుకుంటామా అని చాలా ఆత్రంగా ఉంది. సినిమా ఇంత బాగా రావడానికి కారకులైన నటీనటులు, సాంకేతిక నిపుణులు అందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. త్వరలో టీజర్ రిలీజ్ చేసి, అప్పటి నుంచి ప్రచార కార్యమాలు ముమ్మరం చేస్తాం అని అన్నారు. రంగాయన రఘు ఫుట్ బాల్ కోచ్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని ఇదే ఏడాదిలో విడుదల చేసేం దుకు సన్నాహాలు చేస్తున్నారు. తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో ఏక కాలంలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న రాఘవేంద్ర రాజ్ కుమార్, ఈ చిత్రానికి స్క్రిప్ట్ కన్సల్టెంట్‌గా కూడా వ్యవహరించడం విశేషం.



# 'హార్ట్ బీట్'తో యోగలక్ష్మి పాపులర్

**అందానికి** మరింత అందాన్ని తెచ్చేవి.. ఆకర్షణకి మరింత ఆకర్షణ పెంచేవి కళ్లే.. అందమైన కళ్లు మాట్లాడతాయి.. పాటలు పాడతాయి.. పాఠాలు కూడా చెబుతాయి. ఆ మాటకొస్తే మాటల్లో చెప్పలేని భావాలను ఆవిష్కరించే అందమైన వాకిళ్లు కళ్లు. తళుక్కుమని మెరిసే కనుల నుంచి కరెంటు పుడుతుందనే విషయం కుర్రాళ్లందరికీ తెలుసు. అలాంటి కళ్లున్న అమ్మాయి కనిపిస్తే, కలలు కనని కళ్లు ఉండవు. అలా ఇప్పుడు కలల్లో తేలిపోతున్న కుర్రాళ్ల సంఖ్య పెరిగిపోతోంది. ఎప్పటి నుంచి అంటే, టూరిస్ట్ ఫ్యామిలీ సినిమాలో యోగలక్ష్మిని చూసినప్పటి నుంచి అనే చెప్పాలి. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్ రాఘవన్ కూతురు కురల్ పాత్రలో ఆమె కనిపిస్తుంది. కథానాయకుడు ధర్మదాస్ పెద్ద కొడుకుతో ప్రేమలో పడుతుంది. ఈ పాత్రలో యోగలక్ష్మి కనిపించింది అక్కడక్కడే అయినా, ఆకర్షణీయమైన కళ్లతో.. పదునైనచూపులతో విన్యాసాలు చేసింది. దాంతో అసలు ఈ అమ్మాయి ఎవరూ అనేది తెలుసుకోవడానికి కుర్రాళ్లంతా సెర్చ్ చేయడంలో పడ్డారు. తమిళనాడు కు చెందిన యోగలక్ష్మి ఇంతకుముందు షార్ట్ ఫిలిమ్స్ చేసింది.. వెబ్ సిరీస్‌లు చేసింది. అయితే ఇటీవల హాట్ స్టార్‌కి వచ్చిన హార్ట్ బీట్‌తో ఆమె చాలామంది కళ్లలో పడింది. ఈ సిరీస్‌లో ఆమె నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను చేసినప్పటికి, మంచి మార్కులు కొట్టేసింది. అందుకు కారణం నేరేడుపండ్ల లాంటి ఆమె కళ్లు.. అవి సంధించిన చురుకైన చూపులే అని చెప్పాలి. టూరిస్ట్ ఫ్యామిలీతో ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్న ఈ బ్యూటీ, ఇకపై సినిమాలలో మరింత బిజీ అయ్యే



# 'మార్గన్' మూవీ తెలుగులో విడుదల

సంగీత దర్శకుడిగా, పాటల రచయితగా, ఎడిటర్‌గా ఇలా మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోని ఎప్పుడూ ఆడియెన్స్‌ను కొత్త పాయింట్‌తో ఆశ్చర్యపరుస్తూనే ఉంటారు. ఆయన నటిస్తూ, నిర్మించిన నూతన చిత్రం మార్గన్. లియో జాన్ పాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్‌పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. మర్డర్ మిస్టరీక్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతున్న ఈ మూవీని జూన్ 27న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ద్వారా విజయ్ ఆంటోని మేనల్లుడు అజయ్ ధీషన్ విలన్‌గా పరిచయం అవుతున్నారు. రీసెంట్‌గా రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. మళ్లీ విజయ్ ఆంటోని హీరోగా, నిర్మాతగా, ఓ డిఫరెంట్ కాన్సెప్ట్, కొత్త పాయింట్‌ను టచ్ చేశారని ట్రైలర్ చూస్తేనే అర్థం అవుతోంది. ఇక ఇలాంటి కొత్త కాన్సెప్ట్, కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రాల్ని అందించడంలో సురేష్ ప్రొడక్షన్స్ ముందుం టుందన్న సంగతి తెలిసిందే. మార్గన్ మీదున్న నమ్మకంతో సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్ సురేష్‌బాబు ఈ చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేసేందుకు ముందుకు వచ్చారు. జూన్ 27న ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నట్టుగా ప్రకటించారు. ఈ మేరకు హీరో, నిర్మాత విజయ్ ఆంటోని సురేష్ ప్రొడక్షన్స్ అధినేత సురేష్ బాబు కలిసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



# 'గేదెలరాజు కాకినాడ తాలూకా' ఫస్ట్‌లుక్

**చూస్తే ఒకటే నిజం** చూడకపోతే వంద అనుమానాలు అనే ఒక నిజాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తున్నారు చిత్రయూనిట్. శుక్రవారం రఘు జన్మదినం సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను విడుదలచేశారు. ఫస్ట్‌లుక్‌లో ఎంతో ఫెరోసియస్‌గా కనిపిస్తున్నారాయన. మోటూరి టాకీస్ పతా కంపై రఘుకుంచే సమర్పిస్తున్న ఈ చిత్రానికి చైతన్య మోటూరి దర్శకత్వం వహించారు. రవిఆనంద్ చిన్నిబిల్లి, రామచంద్రం, శ్రావ్య, వికాశ్, మోనిక తదితరులు నటించారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు- రవిఆనంద్ చిన్నిబిల్లి, తాడాల వీరభద్రరావు, గీతార్థ్ కుంచే ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్- కిరణ్ తాతపూడి , దివ్య మోటూరి పబ్లిసిటి డిజైనర్- ఏజే ఆర్ట్స్ అజయ్, విఎఫ్ఎక్స్- కొత్తపల్లి సునీల్, లిరిక్స్- గిరిధర్ రాగోలు, లలిత కాంతారావు ఎడిటర్- సుధీర్ ఎడ్ల, కాస్ట్యూమ్ డిజైనర్- సింధూ ధిలీషా, పిఆర్ఓ- శివ మల్లాల, మూర్తి మల్లాల ఆర్ట్- అమర్ తలారి, చీఫ్ అసోసియేట్ గౌరి శంకర్ కో డైరెక్టర్- శేఖర్ కుంపట్ల, సంగీతం- రఘు కుంచే, నిర్మాత- వాణి రవికుమార్ మోటూరి, కథ, మాటలు, స్క్రీన్‌ప్లే దర్శకత్వం-చైతన్య మోటూరి.






# లేటెస్ట్ ఫొటో షూట్‌లో 'మాళవిక మోహనన్'

**ఇటీవల కాలంలో** సెలబ్రిటీలు సోషల్ మీడియాను ఓ సాధనంగా వాడుతున్నారనే విషయం తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా అభిమానులకు ఈజీగా రీచ్ కావొచ్చనే అభిప్రాయం చాలామంది సెలబ్రిటీల్లో నెలకొంది. అయితే కొంతమంది సెలబ్రిటీలు ఈ సోషల్ మీడియా ద్వారా తమ టాలెంట్‌ను బయటపెడుతున్నారు. స్టార్ హీరోయిన్లు సైతం సోషల్ మీడియా గట్టిగానే వాడుతున్నారు. సరిగ్గా ఇప్పుడు ఇదే పని చేస్తోంది హీరోయిన్ మాళవిక మోహనన్. తమిళ ఇండస్ట్రీలో మాళవిక మోహనన్ ఇప్పుడు స్టార్ హీరోయిన్. ఆమె ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు.మోహనన్ కుమార్తె. ఆమె 1993 ఆగస్టు 4న కేరళలోని పయ్యనూరులో జన్మించింది. మాళవిక మోహనన్ 2013లో మలయాళ చిత్రం పట్టం పోల్ ద్వారా సినీ ఎంట్రీ ఇచ్చింది. తమిళంతో పాటు, మలయాళం, తెలుగు, హిందీ చిత్ర పరిశ్రమలలో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆ తర్వాత ఆమె ది గ్రేట్ ఫాదర్, పేట్ట, మాస్టర్ వంటి విజయ వంతమైన చిత్రాలలో నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది. ఆమె తన నటనకు గాను అనేక అవార్డులను అందుకుంది. మాళవిక మోహనన్ తెలుగులో హీరో అనే చిత్రంలో నటించింది. ఆమె ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాడీలక్స్ సినిమాలో కూడా నటిస్తోంది. మాళవిక మోహనన్ సోషల్‌మీడియాలో యాక్టివ్‌గా ఉంటోంది.



# సంహిత్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో 'వైల్డ్ బ్రీత్'

**కంటెంట్** బాగుంటే చిన్న చిత్రాలు కూడా మంచి సక్సెస్ అందుకుంటాయని, హీరోలు అవసరం లేదని అన్నారు ప్రముఖ నటుడు శివాజీ రాజా. రేవు వంటి మంచి మూవీని నిర్మించిన ప్రొడక్షన్ హౌస్ సంహిత్ ఎంటర్ టైన్ మెంట్స్‌లో మరో ఇంట్రెస్టింగ్ మూవీ వైల్డ్ బ్రీత్‌ను యంగ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పుట్టినరోజు సందర్భంగా అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి హరినాథ్ పులి దర్శకత్వం వహిస్తున్నారు. డా.మురళీ చంద్ గింజుపల్లితో కలిసి పర్వతనేని రాంబాబు నిర్మిస్తున్నారు. వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను హైదరాబాద్ ఫిలింఛాంబర్‌లో జరిగినకార్యక్రమంలో ప్రముఖ నటుడు శివాజీ రాజా చేతుల మీదుగా లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలుతుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్ అతిథులుగా హాజర య్యారు. పలువురు పాత్రికేయ మిత్రుల సమక్షంలో వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లాంచ్ కార్యక్రమం సందడిగా జరిగింది. ఈ కార్యక్రమంలో నటుడు శివాజీ రాజా మాట్లాడుతూ, నాకు ఎంతో సన్నిహితులైన మీడియా మిత్రులు ఉన్నారు. నేను కెరీర్ ప్రారంభం నుంచీ వారితో స్నేహం చేస్తున్నా. అలాంటి మీడియా మిత్రుల్లో ఒకరైన పర్వతనేని రాంబాబు నిర్మాతగా వైల్డ్ బ్రీత్ సినిమా చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ మధ్య కంటెంట్ ఉన్న చిన్న చిత్రాలెన్నో విజయాలు సాధిస్తున్నాయి. వైల్డ్ బ్రీత్ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ చాలా బాగున్నాయి. పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతూ ఆయన నిర్మాతగా ఎన్నో చిత్రాలు చేయాలని కోరుకుంటున్నా. అలాగే దర్శకుడు హరినాథ్ పులి మంచి పేరు తెచ్చుకోవాలి. స్టార్స్ వెంట పడటం కాదు కథ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు అన్నారు. నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, పర్వతనేని రాంబాబుకు పుట్టినరోజు శుభా కాంక్షలు. ఆయన పుట్టినరోజున ఈ వైల్డ్ బ్రీత్ సినిమా ఫస్ట్ లుక్ లాంచ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. మన మీడియా ఫ్రెండ్స్‌లో బీఏ రాజు నిర్మాతగా మంచి పేరు తెచ్చుకున్నారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

పెదకూరపాడు, (అచ్చంపేట) జూన్ 13 ప్రభాతవార్త : సూపర్ సిక్స్ పథకాలలో తల్లికి వందనం పథకం విజయవంతంగా ప్రజలకు అందించారని టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ముంతాజ్ అన్నారు. శుక్రవారం తల్లిదండ్రులు చిన్నారులతో కలిసి సిఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కుటుంబంలో చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం ఒకసారిగా పడిపోయిందని ఆమె అన్నారు. నేడు తల్లిదండ్రుల ముఖాల్లో ఆనందం కనిపిస్తుందని ఆమె అన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు సిఎం చంద్రబాబుతో కలిసి తల్లికి వందనం విడుదల చేశారన్నారు.



అందరూ చదవాలి అందరూ ఎదగాలని ఉద్దేశంతో తల్లికి వందనం ప్రవేశపెట్టారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలనాడు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి షేక్.ముంతాజ్, షేక్ హసీనా ఆయేషా జహీదా సల్మా సాజిదా బషీరున్ ఆసిషా, ఆర్తిమళ్ళ సుజాత, రజిని, వడ్లమూడి లక్ష్మి, వడ్లమూడి బుజ్జి, నంబూరి పుష్ప, ఆర్తిమళ్ళ పద్మావతి, శ్రీలక్ష్మి రాచమంటి మస్తానమ్మ బాజీ, రాచమంటి సుధ హైమావతి, ఫాతిమా ఫాతిమున్, మహబూబ్, జాన్సి తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



అమరావతి, జూన్ 13 ప్రభాతవార్త : అమరావతిలో విద్యుత్ మరమ్మత్తు పనుల నిమిత్తం రెండవ శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రవికిరణ్ శుక్రవారం తెలియజేశారు. ఉదయం 9 గంటల నుండిఇ మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అమరావతి సబ్‌స్టేషన్, మల్లాది సబ్‌స్టేషన్ పరిధిలో సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ఈ అసౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

బాపట్ల, జూన్13, ప్రభాతవార్త:ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా దర్బార్ లక్ష్యమని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజాదర్బార్‌కు పెద్దఎత్తున ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు భారీగా తరలివచ్చారు. పెన్షన్ ల కోసం వృద్ధులు, వికలాంగులు, మహిళలు, ఉద్యోగాల కోసం యువత, సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల ఉద్యోగాలు, విద్య, వైద్య సాయం కోసం సామాన్యులు, తాము



ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కేందుకు బాధితులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఎమ్మెల్యే అందరి నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

## నాటు సారా విక్రయిస్తే కఠిన చర్యలు

బాపట్ల, జూన్13, ప్రభాతవార్త: నాటు సారా తయారు చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి బి వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం నవోదయం2.ఓ కార్యాక్రమంలో భాగంగా జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు, బాపట్ల మండల తహసీల్దారు షేక్ షలీమా మరియు వెలుగు ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్ ఆధ్వర్యంలో బాపట్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల స్టువర్టుపురం మరియు బేతపూడి గ్రామాలలో నాటు సారాయి తయారి స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని పాత నాటుసారాయి ముద్దాయిలను మరియు పిడి యాక్ట్ ముద్దాయిలను వారియొక్క ప్రస్తుత కార్యకలాపాలు, జీవనోపాధి



గురించి వివరములు తెలుసుకొని, తదుపరి ఎటువంటి నాటుసారాయి కార్యకలాపాలు చేయవద్దని, భవిష్యత్తులో అలా జరిగిన యెడల మరింత కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. నాటుసార స్థావరాలపై నిర్వహించిన దాడులలో ఎస్‌టిఎఫ్, మంగళగిరి ఇన్స్పెక్టర్ బాలనరసింహం, ఎన్ఫోర్స్మెంట్ ఒంగోలు ఇన్స్పెక్టర్లు రామారావు, నరహరి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి.గీతిక , సబ్ ఇన్స్పెక్టర్లు ఎస్.మోనిక మరియు ఈఎస్‌టిఎఫ్ బాపట్ల సబ్‌ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, వెదుళ్ళపల్లి పోలీస్ సిబ్బంది, స్టువర్టుపురం, బేతపూడి మరియు వెదుళ్ళపల్లి గ్రామ విఆర్వోలు పాల్గొన్నారు. అనంతరం నలుగురు పాత నాటుసారాయి ముద్దాయిలని 129 బిఎన్ఎస్ఎస్ మరియు ఒకరిని 128 బిఎన్ఎస్ఎస్ ప్రకారం బాపట్ల మండల తహసీల్దారు ఎదుట బైండోవర్ చేయడం జరిగిందన్నారు.

## మాదకద్రవ్యాలు నివారిద్దాం మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం


కర్లపాలెం, జూన్13, ప్రభాతవార్త: మాదకద్రవ్యాలను నివారించి మెరుగైన సమాజాన్ని నిర్మించాలని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర అన్నారు. శుక్రవారం కర్లపాలెం సెంటర్‌లో ఈగల్ సెల్ సభ్యులతో కలిసి డ్రగ్స్ వద్దు అనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుం దని దీనివలన ఎందరో యువత చెడు మార్గంలో నడుస్తున్నారన్నారు. వ్యస నాలకు అలవాటు పడి తల్లిదండ్రులను ఇబ్బందులు గురి చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న యువతకు మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక



సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా పోలీసు ఆధ్వర్యంలో ఈగల్ సేల్ సభ్యులు మాదకద్రవ్యాల నివారణపై కరపత్రాలు ముద్రించి ప్రజలలో అవగాహన కల్పించడం శుభ పరిణామం అన్నారు. పిల్లల పట్ల తల్లితండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు వారి నడవడికను గమనించాలని చెడు మార్గంలో పయనిస్తున్న పిల్లలను, విద్యార్థులను మార్చవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం ఇన్చార్జి దుర్గాప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## రైతులతో భేటీ అయిన అగ్రికల్చర్ కమీషనర్, డైరెక్టర్ ఢిల్లీరావు


కొల్లూరు, జూన్ 13 (ప్రభాతవార్త) : అగ్రికల్చర్ కమీషనర్ అండ్ డైరెక్టర్ ఢిల్లీరావు శుక్రవారం కొల్లూరులోని ఆర్ఎస్‌కె 2 సందర్శించి రైతులతో ముఖాముఖి మాట్లాడారని కొల్లూరు మండల వ్యవసాయ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఢిల్లీరావు మాట్లాడుతూ వరి వంట ఎప్పుడు నాటుకుంటారు ఏ విత్తన రకాలు సాగు చేస్తారు, రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు పంపిణీ చేస్తామని ఈనెల 26వ తేది తరువాత



కాలువలకు సాగునీరు విడుదల చేస్తామని తెలియజేశారు. ముందుగానే రైతులు పచ్చిరొట్టె విత్తనాలు కలిపిన విత్తనాల కిట్స్‌ను అందిస్తామని ఆ విత్తనాలను తొలకరి వర్షాలు కురియగానే పొలములో జల్లుకుని 45రోజులు తరువాత రోటో వేటర్‌తో భూమిలో కలియ దున్నడం ద్వారా రసాయనిక ఎరువులు వాడకం తగ్గుతుందని ఆయన తెలియజేశారు. విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్లతో కలిసి డి.క్రీషియాప్ ద్వారా విత్తనాలు పంపిణీ ఎలా జరుగుతుందో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏడిఏ విజయ్‌బాబు, ఏపీ సీడ్ డిఎం.సుమలత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విఏఏలు పాల్గొన్నారు.


## రేషన్‌కార్డుకు గడువు లేదు..ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు-తహశీల్ధార్ సిద్ధార్థ

కొల్లిపర, జూన్ 13 ప్రభాతవార్త: రేషన్‌కార్డుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చుని తహశీల్ధార్ గుమ్మడి సిద్ధార్థ అన్నారు. శుక్రవారం స్థానిక తహశీల్ధార్ కార్యాలయంలో వెల్‌ఫేర్ అసిస్టెంటులతో కొత్త రేషన్‌కార్డులు..పెన్షన్‌లు నమోదుపై సమీక్షా



సమావేశం నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ అర్హులందరికీ తప్పనిసరిగా రేషన్‌కార్డు ధరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటి తహశీల్ధార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


## బ్యాంకు రుణాలు చెల్లించండి..మరలా రుణాలు పొందండి



కొల్లిపర, జూన్ 13 ప్రభాతవార్త: డ్వాక్రా సంఘాలు ప్రతి నెలా సమావేశాలు ఏర్పాటు చేసి సంఘాల మరింత బలోపేతం చేయాలని డీఆర్‌డిఏ ఏపిఎం రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో పొదుపు సంఘాల సభ్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా సమావేశాలు నిర్వహణ గురించి ఆన్‌లైన్ లావాదేవీలపై పొదుపు సంఘాల సభ్యులకు తగిన సూచనలు..సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సక్రమంగా చెలిస్తూ ఉంటే తిరిగి అధిక రుణం పొందే అవకాశం ఉందన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ..అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. ఏపిఎం రమాదేవి, సీసీలు మధు, పూర్ణయ్య.ఎమ్ఎస్ఏ సీతామహాలక్ష్మీ తదితరులు ఉన్నారు.

# రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి

బాపట్ల, జూన్13, ప్రభాతవార్త: రుణాల పంపిణీలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు నూరు శాతం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో బ్యాంకర్ల జిల్లా స్థాయి సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరంలో రైతులకు ఒక లక్ష సీసీఆర్సి కార్డులు జారీ చేయగా, అందులో కేవలం 23 వేల మందికి మాత్రమే రుణాలు మంజూరు చేశారని ఆయన బ్యాంకర్లకు తెలిపారు. ఈ సంవత్సరం లక్ష సీసీఆర్ సి కార్డుల మంజూరుకు లక్ష్యాలను నిర్దేశించారని, అందులో ఇప్పటివరకు 3,800 కార్డులు జారీ చేయడమైనదన్నారు. పాత సిసి ఆర్సి కార్డులను రెన్యువల్ చేయాలని వ్యవసాయ శాఖ అధికారికి జిల్లా కలెక్టర్ సూచించారు, సిసిఆర్సి కార్డు దారులకు 25-26 ఆర్థిక సంవత్సరంలో 200 కోట్లు రుణాలు ఇవ్వాలని, బ్యాంకు బ్రాంచీల ప్రకారం లక్ష్యాలను నిర్దేశించాలని జిల్లా కలెక్టర్ ఎల్డీఎంకు సూచించారు. పి యం సూర్యఘర్ పథకం అమలుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో చొరవ చూపిస్తున్నారని, ఆ ప్రకారంగా జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి బ్యాంకులు లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు సూచించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి ఈ పథకంలో స్వయం సహాయక గ్రూపు సభ్యులను చేర్చడమైనదని ఆయన తెలిపారు. ఈ పథకం అమలుకు భారత ప్రభుత్వం 78 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తుందని ఆయన తెలిపారు. ప్రతి ఎస్ ఎస్ జి సభ్యుల గృహానికి 3 యూనిట్లు స్థాపనకు నిర్దేశించడమైనదని, అందుకుగాను ప్రతి సభ్యునికి 78 వేలు సబ్సిడీ కింద వస్తుందని ఆయన తెలిపారు. దరఖాస్తుదారుడు వెండర్ను నిర్దేశించిన తర్వాత బ్యాంకులకు దరఖాస్తులు వస్తాయని, వాటికి వెంటనే లోన్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు తెలిపారు. బ్యాంకులలో డిపాజిట్ మొత్తాలను జమ చేయుటకు డిఆర్డిఏ శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. రుణాలను తిరిగి చెల్లించుటలో డిఆర్డిఏ శాఖ బ్యాంకులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తాయన్నారు. జిల్లాలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ఒకటే ఉన్నదని, అది ప్రైవేట్ బ్యాంకు కాదని ప్రభుత్వరంగ బ్యాంక్ అని ప్రజలకు అవగాహన కల్పించాలని మహారాష్ట్ర బ్యాంక్ మేనేజర్ కు సూచించారు. జిల్లాకు 36 కిసాన్ డ్రోన్ యూనిట్ల ను లక్ష్యంగా ఇచ్చారని ఆయన తెలిపారు. ఒక్కొక్క యూనిట్ కు సుమారు 12 లక్షల ఖర్చు అవుతుందని ఆయన తెలిపారు. అందులో 50 శాతం లబ్ధిదారుడు బ్యాంకు కు డిపాజిట్ చేయాలని, 40 శాతం బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇందుకుగాను వారికి 80 శాతం సబ్సిడీ వస్తుందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం సూర్య ఘర్, చేనేతలకు ముద్ర రుణాలు, గేదెల బీమా కొరకు, పశుబీమా పథకం అమలుపై ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామకృష్ణ, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, నాబార్డ్ డిడిఎం రవికుమార్, ఆర్బిఐ ఎల్డిఓ నవీన్ బాబు, యూనియన్ బ్యాంక్ రీజనల్ అధికారి మాధురి, ఎల్ డి ఎం శివకృష్ణ, వివిధ బ్రాంచీల బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.



## కుప్పడం పట్టు చీరకు జాతీయ అవార్డు

### -ఢిల్లీలో అవార్డు అందుకోనున్న బాపట్ల కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల, జూన్13, ప్రభాతవార్త: చీరాల కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డు లభించనుంది. ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద కుప్పడం పట్టు చీరలకు జాతీయ అవార్డును ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 18వ తేదీన న్యూ ఢిల్లీలోని ప్రగతి మైదానం భారత్ మండపంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరుగునుందని ఆ ఉత్తర్వులలో పేర్కొంది. చీరాల కుప్పడం పట్టు చీరకు ప్రకటించిన జాతీయ అవార్డును బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి న్యూ ఢిల్లీలో అందుకోనున్నారు. సంప్రదాయ మగ్గాలపై నేతన్నలు నేసిన చీరాల



కుప్పడం చీరలకు మార్కెట్ లో ఇప్పటికే కొంత డిమాండ్ ఉంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా జాతీయ అవార్డు ప్రకటించడంతో మరింత ప్రాచుర్యం పొందనుంది. దీంతో చేనేతల కష్టం ఇక ఫలించనుంది. జాతీయ మార్కెట్ లోనూ కుప్పడం చీరలు ప్రత్యేకతను సంతరించుకోనుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చీరాల కుప్పడంకు జాతీయస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. చేనేత వృత్తినే నమ్ముకుని వందలాది చేనేత కుటుంబాలు బాపట్ల జిల్లా చీరాల పేరాలలో కొన్నేళ్లుగా జీవనం సాగిస్తున్నాయి. సంప్రదాయ మగ్గాలపై చేనేత కార్మికులు కష్టపడి నేసిన కుప్పడం చీరలకు ఒకప్పుడు ఎంతో డిమాండ్ ఉండేది. యంత్రాల జొరబాటుతో కుప్పడం చీరల ఉత్పత్తి సన్నగిల్లిందని కార్మికులు ఆందోళన చెందుతున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో చేనేతల ఆశలు పునర్జీవం పోసుకున్నాయి. అలనాటి స్వాతంత్ర ఉద్యమంలో మహాత్మా గాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల పేరాల చేనేత కార్మికులు విదేశీ వస్త్రాలను వ్యతిరేకించడంలో ప్రధానపాత్ర పోషించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏడాది జనవరి 9వ తేదీన కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా క్షేత్రస్థాయి పరిశీలనపై బాపట్ల చీరాలలో పర్యటించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు, జిల్లా కలెక్టర్ కలిసి పరిశీలించారు. ఆ సమయంలోనే చీరాలలో చేనేత వస్త్రాలైన కుప్పడం చీరల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై కేంద్ర బృందానికి కలెక్టర్ నివేదిక అందజేశారు. పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం చీరాల కుప్పడం చీరలకు ఒకే జిల్లా ఒకే ఉత్పత్తి (ఒడిఒపి)కింద గుర్తింపునిస్తూ జాతీయస్థాయి అవార్డును ప్రకటించింది. జాతీయస్థాయి అవార్డును జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఈనెల 18వ తేదీన అవార్డును అందుకోనున్నారు.

## బూత్ లెవల్ ఏజంట్ల వివరాలు ఇవ్వండి

### -అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రమేష్‌బాబు

పొన్నూరు, జూన్ 13, ప్రభాతవార్త: అన్ని రాజకీయ పార్టీల నాయకులు బూత్ లెవల్ ఏజెంట్ యొక్క వివరాలను అందజేయాలని మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ముప్పాళ్ళరమేష్‌బాబు కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ బూత్ లెవల్ ఏజంట్ల వివరాలను, ఏజంట్ల ఫోటోలను, వారి సంతకాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి పంపించాలని కోరినట్లు నాయకులకు తెలిపారు. ఏజెంట్ (బిఎల్ఏ) యొక్క పోలింగ్ స్టేషన్‌లో ఎవరైనా మరణించినవారి ఓట్లు ఉన్నట్లయితే వాటిని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారు ఇచ్చిన



ప్రొఫార్మాలో పూర్తి చేసి ఇవ్వాలని కోరారు. అదేవిధంగా ఎవరైనా పర్మినెంట్‌గా షిఫ్ట్ అయినట్లయితే వారి యొక్క వివరాలను అదే ప్రొఫార్మాలో నమోదు చేసి అందజేయాలని కోరినట్లు చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు త్వరగా బిఎల్ఏలకు సంబంధించిన సమాచారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో కార్యాలయ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రామారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మొగదాటి శ్రీనివాస్, పఠాన్ అహమ్మద్‌ఖాన్, యాతాటి కిషోర్‌బాబు, టి.లక్ష్మీనారాయణచౌదరి, ఆరేటి రామారావు, మాదల వెంకటేశ్వర్లు, ఆల శ్రీనివాసరావు, దేశంశెట్టి సూర్య, గోపిశెట్టి శ్రీనివాసరావు, గోవాడ వెంకటకృష్ణారావు, అందె దిలీప్‌కుమార్, బండ్లమూడి చింపిరయ్య తదితరులున్నారు.

## మండలంలో 5,715మంది 'తల్లికి వందనం'కు అర్హులు

### -మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్

పొన్నూరు, జూన్ 13, ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం విద్యార్థుల విద్యాభ్యాసానికి సంబంధించి అమలు చేస్తున్న కొత్త పథకం తల్లికి వందనంకు మండలంలో 5,715మంది అర్హులు ఉన్నారని మండల విద్యాశాఖాధికారి కొల్లి విజయభాస్కర్ తెలిపారు. మరో 753మంది అనర్హుల జాబితాలో ఉన్నారన్నారు. అనర్హుల జాబితాలో ఉన్నటువంటి వారు గ్రామ సచివాలయానికి వెళ్ళి సరిచూసుకోవాలని విజయభాస్కర్ కోరారు. గ్రామాల వారీగా ఆరెమండ-186 మంది, బ్రాహ్మణకోడూరు-434, చింతలపూడి-478, దండమూడి-197, దొప్పలపూడి-235, కసుకర్రు-294, కట్టెంపూడి-214, కొండముది-305, మాచవరం-343, మామిళ్ళపల్లి-460, మన్నవ-225, ములుకుదురు-372, మునిపల్లె-305, నండూరు-479, పచ్చలతాడిపర్రు-190, పెదపాలెం-242, సీతారామపురం-114, ఉప్పరపాలెం-223, వడ్డిముక్కల-193, వెల్లలూరు-226మంది అర్హత సాధించిన జాబితాలో ఉన్నట్లు చెప్పారు. తల్లికి వందనం పథకంలో అర్హులైన ఉండి నగదు జమకానటువంటి వారు సంబంధిత సచివాలయానికి వెళ్ళి వివరాలను తెలుసుకోవాలన్నారు. పథకం వర్తించని వారు అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను సచివాలయంలో సమర్పించి మళ్ళీ నమోదు చేయించుకోవాలన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పొన్నూరు, జూన్ 13, ప్రభాతవార్త: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు విద్యుత్‌శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తోందని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఎఈ మురళీకృష్ణ అన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి, గాలులకు విద్యుత్‌కు అక్కడక్కడ అంతరాయం ఏర్పడుతుందని, ఈ అంతరాయాన్ని అధిగమించేందుకు శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ మరమ్మత్తులను నిర్వహించేందుకు పట్టణ, మండల పరిధిలో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. ఈ అసౌకర్యాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తుంచుకోవాలని, విద్యుత్‌శాఖాధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు.

## నేడు జువ్వలపాలెం, ఈపూరులంక సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు

కొల్లూరు, జూన్ 13 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని 33-11కెవి జువ్వలపాలెం, ఈపూరులంక సబ్ స్టేషన్లు విద్యుత్ మరమ్మత్తులు చేయనున్న కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని కొల్లూరు మండలం విద్యుత్‌శాఖ అధికారి కె.సుధాకర్‌బాబు శుక్రవారం తెలియజేశారు. తెలిపిన సబ్ స్టేషన్ల క్రింద గల జువ్వలపాలెం, కిష్కిందపాలెం, పోతార్లంక, తిప్పలకట్ల, తోకలవానిపాలెం, తురకపాలెం, కృష్ణనగర్, తడికేలపూడి, ఈపూరులంక, చింతల్లంక, పెదలంక, కాపులపాలెం, సుగ్గుణలంక, చిలుమూరు లంక, మరియు కొల్లిపర మండలం క్రిందగల అన్నవరపులంక, కొత్తూరు లంక గ్రామాలకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఆయా గ్రామ ప్రజలు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### -ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి. రుక్మిణి

పొన్నూరు, జూన్ 13, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.రుక్మిణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో జరిగే ఈ కార్యక్రమంలో పొన్నూరు కోర్టు పరిధిలోని కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కోర్టు పరిధిలో కక్షిదారులు రాజీపడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ తగాదాలు, మనోవర్తి, చెక్‌బౌన్స్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులను జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో సామస్యపూర్వకంగా రాజీపడవచ్చుని న్యాయమూర్తి తెలిపారు. అదేవిధంగా న్యాయవాదులు, పోలీసులు అధికారులు ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులకు పరిష్కారం చూపించేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

## మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు కంకణాల జన్మదిన శుభాకాంక్షలు

తాడేపల్లి, జూన్ 12, ప్రభాతవార్త : మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్యకు మంగళగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు కంకణాల శంకరరావు జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కిలారీ రోశయ్యను కంకణాల శంకరరావు గుంటూరులోని ఆయన నివాసంలో కలసి కేక్ కట్ చేయించి, శ్రీశైలం ప్రసాదాన్ని అందజేసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాజ గ్రామ జనసేన పార్టీ నాయకులు చెన్నం వీరాంజనేయులు, బోనం రామారావు, కె.సాయికృష్ణ, నీలాద్రి వంశీసాయి తదితరులు పాల్గొన్నారు.

## కళాకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి

### --ఏపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ

తాడేపల్లి, జూన్ 12, ప్రభాతవార్త : కళాకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏపి నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అన్నారు. జిల్లాలోని తాడేపల్లి మండలం కుంచనపల్లి-ప్రాతూరులో రాష్ట్ర కార్యాలయ ఏర్పాటుకు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఏపి నాటక అకాడమి ఛైర్మన్, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ నేతృత్వంలోసమీప ప్రాంతాల కళాకారులు, కళాపోషకులు, వివిధ కళాపరిషత్తుల నిర్వాహకులు, పలువురు రచయితలు, ఆత్మీయులు హాజరై ఏపి నాటక అకాడమీ కార్యాలయంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ కళాకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. త్వరలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహంతో రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేయూతతో రంగస్థలం, వృత్తి కళాకారులకు భరోసాతో కూడిన వరాలు వెలువడనున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్‌కళ్యాణ్, యువనేత మంత్రి నారా లోకేష్ కళలు, కళాకారులకు అండగా ఉంటున్నారని వివరించారు. ఏపి నాటక అకాడమీ కార్యాలయలో ఆధునీకరణ పనులు మరో పదిహేను, ఇరవైరోజుల్లో పూర్తి కానున్నాయని అప్పుడు రాష్ట్రంలోని కళాకారులందరికీ ఆహ్వానం పంపి కార్యాలయం ప్రారంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించుకుందామని తెలిపారు. కార్యక్రమంలోకళాకారులు, దర్శకులు, రచయితలు కావూరి సత్యనారాయణ, చెరుకూరి సాంబశివరావు, పొగర్తి నాగేశ్వరరావు, పోపూరి నాగేశ్వరరావు, ఏపూరి హరిబాబు, నరేన్, రంగనాయకులు, హసన్, స్వామి, పిళా ్ర నటరాజ్, దొంతాల ప్రకాష్, రావులపల్లి ఇన్నయ్య, బండారుపల్లి సాంబశివరావు, కోగంటి ప్రసాద్, అర్వపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిసీలకు వెన్నుదన్నుగా ప్రభుత్వం -కేశన శంకరరావు

తాడేపల్లి, జూన్ 12, ప్రభాతవార్త : చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, బిసి కులాలను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అనేక పథకాల ద్వారా బిసీలకు వెన్నుదన్నుగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు కొనియాడారు. గత ప్రభుత్వం నవరత్నాల పేరుతో అందర్ని ఒకే గాటిన కట్టి, వెనుకబడిన తరగతులకు తీవ్ర అన్యాయం చేసిందని, అలా కాకుండా కూటమి ప్రభుత్వం బిసిల్లోని అన్ని కులాలను బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టిందన్నారు. ఆనాడు బిసీల కుల ఫైనాన్స్ కార్పొరేషన్లకు నిధులు కేటాయించకుండా నామమాత్రం చేశారని, అలా కాకుండా కూటమి ప్రభుత్వం వేలాది కోట్లు కేటాయించి, బిసి కులాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయడాన్ని శంకరరావు హర్షిస్తున్నా మన్నారు.

## ఎమ్మెస్సెస్ భవనంలో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై సంబరాలు

తాడేపల్లి, జూన్ 13, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా మంగళగిరి తెదేపా కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్‌లో సంబరాలు అంబరాన్ని అంటాయి. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని కేక్ కట్‌చేసి తమ ఆనందాన్ని వ్యక్తంచేశారు. ప్రభుత్వ పాలనలోని ప్రజానిబద్ధతపై అభినందనలు తెలిపి బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాది పూర్తయిందని ఏడాది పాలన ప్రజలు నచ్చే విధంగా మెచ్చే విధంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన అనీ ్న హామీలను నెరవేరుస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తుందని చెప్పారు.

ఎంటిఎంసీ జనసేన అధ్యక్షులు వెంకట మారుతీరావు మాట్లాడుతూ....ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అభివృద్ధికి నిలువెత్తు నిదర్శనం అని కొనియాడారు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని అభినందించారు. మంగళగిరి నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ ...తొలి ఏడాదిలోనే ఎన్నో విజయాలు కూటమి ప్రభుత్వం సాధించిందని చెప్పారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళలో అమలు చేయగల సామర్థ్యం కూటమి ప్రభుత్వానికి ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందని, వైఎస్సార్ సిపీ నేతలు అసత్య ప్రచారం చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. మంత్రి నారా లోకేష్ మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుత్తికొండ ధనుంజయరావు, గోవాడ దుర్గారావు, ఆకురాతి నాగేం ద్రం తదితరులు పాల్గొన్నారు.

## పెదవడ్లపూడిలో రూ.2.7లక్షల ఎల్‌ఓసి చెక్కు అందజేత

### --మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో అందజేసిన స్థానిక నాయకులు

మంగళగిరి/తాడేపల్లి, జూన్ 13, ప్రభాతవార్త : అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడికి మంత్రి నారా లోకేష్ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.2.7లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ ఇపి ్పంచారు. మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ భాషా అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. షేక్ భాషా ఆరోగ్య పరిస్థితి గురించి స్థానిక నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీస్కెళ్ళగా వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2లక్షల 7వేల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసి) మంజూరు చేయించారు. స్థానిక నాయకులు ఆ ఎల్‌ఓసి పత్రాన్ని షేక్ భాషా కు అందజేశారు. మంత్రి నారా లోకేష్‌కు భాషా కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి మార్కెట్‌యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లక్షలాది మందికి ఆర్థిక సాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పెదవడ్లపూడి శివరామయ్య, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, షేక్ అమీర్ బేగ్, ఏసు, నాగమణి, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# యోగా స్ఫూర్తితో పరవశించిన కొండవీడు కోట

## ..విచ్చేసిన జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు

యడ్లపాడు, జూన్ 13, ప్రభాతవార్త : చారిత్రక పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోట యోగా స్ఫూర్తితో పరవశించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించ తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొండవీడు కోట ప్రాంతములోని ఘాట్ రోడ్డులో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ కార్యక్రమానికి విచ్చేసి అందరితో







యోగా అభ్యాసనాలు చేయటం జరిగింది. ఉదయం 6గంటలకు ప్రారంభమైన కార్యక్రమం ఉదయం 8గంటల వరకు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ప్రసంగిస్తూ యోగా కేవలం శారీరక వ్యాయామం కంటే ఎక్కువని, ఇది సమతుల్యత సామరస్యం మరియు సమగ్ర శ్రేయస్సును ప్రోత్సహించే జీవనశైలి అని, క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వల్ల శరీరం, మనస్సు మరియు ఆత్మకు గొప్ప ప్రయోజనాలు లభిస్తాయని, ప్రతిఒక్కరూ విధిగా అందరికీ తెలియజేసి వారి ద్వారా యోగా సాధన అయ్యేవిధంగా ప్రయత్నించాలన్నారు. తొలుత స్థానిక తహశీల్దార్ విజయశ్రీ విచ్చేసిన అతిధులకు మొక్కలు అందించి ఆహ్వానించారు. కార్యక్రమంలో డిఎఫ్ఓ కృష్ణ ప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, స్థానిక వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, పరిసర గ్రామాల గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మికుల మధ్య ఘర్షణ, హత్యకు దారితీసిన వైనం

యడ్లపాడు, జూన్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ సమీపంలోని మంజునాథ నూలు మిల్లులో ఇద్దరు కార్మికుల మధ్య జరిగిన ఘర్షణ చివరికి హత్యకు దారితీసిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మిల్లులో విధులు నిర్వహించుతున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన జగన్నాథ్ కుల్దీప్(38) కుటుంబ సభ్యులతో కలసి మిల్లులో క్వార్టర్స్‌లో ఉంటూ విధులు నిర్వహించుతున్నాడని, అయితే అతని భార్య రునికుల్దీప్ మరియు ముగ్గురు పిల్లలతో కలిసి నెల రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లిందని, అప్పటి నుండి ఒంటరిగా ఉంటూ విధులు నిర్వహించే వాడని, అయితే అదే మిల్లులో విధులు నిర్వహించే మరో కార్మికుడు మంగూలు లేంక అనే వ్యక్తి జగన్నాథ్ భార్య గురించి ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకోవటంతో మంగూలు లేంక ఆగ్రహావేశుడై వెంటనే తన గదిలోకి వెళ్లి కత్తి తీసుకొని వచ్చి జగన్నాథ్ పొత్తికడుపు భాగంలో పొడవటం జరిగిందన్నారు. ఈ సంఘటన ఈ నెల 10వ తేది జరుగగా వెంటనే అంబులెన్స్‌లో చిలకలూరిపేట వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స నిర్వహించుతూ మెరుగైన చికిత్స నిమిత్తం 11వ తేది గుంటూరు జీజీ హెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ 13వ తేది ఉదయం 10గంటలకు మృతి చెందటం జరిగిందన్నారు. జగన్నాథ్ భార్య రునికుల్దీప్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయటం జరిగిందన్నారు. సంఘటనకు సంబంధించి రూరల్ సిఐ సుబ్బనాయుడు, ఎస్సై టి శివరామకృష్ణ సంఘటనా స్థలంకు చేరుకొని విచారణ చేపట్టామన్నారు.



## సచివాలయాలలో తల్లికి వందనం... అర్హులైన జాబితా వివరాలు

యడ్లపాడు, జూన్ 13, ప్రభాతవార్త : మండల పరిధిలోని అన్ని సచివాలయాలలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తల్లికి వందనం పధకంకు సంబంధించిన జాబితాలను నోటీస్ బోర్డులలో అందుబాటులో ఉంచారు. ఇందులో తల్లికి వందనం పథకంలో అర్హులైన విద్యార్థులు, అనర్హులు కాని వారి వివరాల జాబితాలు ఉంచారు. ఇందులో తల్లి లేక సంరక్షకుని పేరు, అధార్ నెంబరు, విద్యార్థి ఐడి, విద్యార్థి పేరు, విద్యార్థి అదార్‌నెంబరు, పాఠశాల కోడ్, వచ్చిన నగదు వివరాలు, ఎన్‌పిసీ స్టేటస్ వివరాలను పొందు పరిచారు. ఎన్‌పిసిఐ యాక్టివేట్ కాకపోతే బ్యాంకు ఖాతాకు అధార్ నెంబరు అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

## మాచర్ల మండల వ్యవసాయ శాఖాధికారిగా పాపకుమారి



మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: మాచర్ల మండల వ్యవసాయశాఖ అధికారిగా డి.పాపకుమారి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల శాఖ సిబ్బంది వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈఓలతో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులందరూ ఈ నెల 20 తేదీలోపు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ బయోమెట్రిక్ విధానంలో వేలిముద్ర వేయాలని తెలిపారు.

## వెల్దుర్తి మండల వ్యవసాయశాఖాధికారిగా బాలాజీ గంగాధర్

మాచర్ల, జూన్ 13 ప్రభాతవార్త: వెల్దుర్తి మండల వ్యవసాయ శాఖ అధికారిగా టి.బాలాజీ గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ సిబ్బందితో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులు ఈ నెల 20వ తేదీలోపు గ్రామ రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని కోరారు.

## మండల వ్యవసాయ శాఖ అధికారిగా పోట్ల నరసింహారావు

కారంపూడి, జూన్ 13 ప్రభాతవార్త: కారంపూడి మండల వ్యవసాయ శాఖ అధికారిగా పోట్ల నరసింహారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తాడికొండ మండలం వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న నరసింహారావు బదిలీలో భాగంగా కారంపూడికి వచ్చారు. కారంపూడి మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేసిన యలమందారెడ్డి బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. నాగేశ్వరరావు గతంలో రెంటచింతల, క్రోసూరు, తాడికొండలో విధులు నిర్వహించారు. ఎమ్మెస్ అగ్రికల్చర్‌లో 2001లో గోల్డ్ మెడల్ సాధించారు. ఐటీఐలో కూడా పదేళ్ల పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రైతులకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా కృషి చేస్తానన్నారు.



## పాఠశాలలకు చేరుకున్న పాఠ్య పుస్తకాలు

కారంపూడి, జూన్ 13 ప్రభాతవార్త: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ అధికారులు అందజేశారు. 43 పాఠశాలల్లో 10 ఉన్నత పాఠశాలలు, 27 ప్రాథమిక పాఠశాలలు, ఆరు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 22,846 పాఠ్యపుస్తకాలు, 31,000 నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు మెరుగైన విద్యను నేర్చుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను వేసవి సెలవుల్లోనే విద్యాశాఖ కార్యాలయానికి పంపారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలని ఆయా గ్రామాల్లో ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పాఠ్యపుస్తకాలతోపాటు యూనిఫాం కూడా అందజేయనున్నట్లు ఎంఈఓలు రవికుమార్, శ్రీనివాసరెడ్డిలు తెలిపారు.




## మెగా వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలి

కారంపూడి, జూన్ 13 ప్రభాతవార్త: ఈ నెల 15న కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెదేపా వాణిజ్య విభాగ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, తెదేపా మండల అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్ అన్నారు. గుంటూరు అర్కా హాస్పిటల్, పిడుగురాళ్ల ఉన్నం హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచితంగా అన్ని ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ప్రముఖ వైద్యులు ఉన్నం నాగమల్లికార్జునరావులు పాల్గొననున్నారు. కారంపూడి, దుర్గి మండలాల ప్రజల సౌలభ్యం కోసం.. ఏర్పాటు చేసిన భారీ ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు ఉన్నం లక్ష్మీనారాయణ, గాడిపర్తి పూర్ణయ్య, పంగులూరి అంజయ్య, గంగవరపు పుష్పలత శివరాం, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, కోదాడ ప్రభాకర్, తెలుగు యువత అధ్యక్షుడు మాదల శ్రీహరి, ఉన్నం హరిబాబు, బొల్నేడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం



కారంపూడి, జూన్ 13 ప్రభాతవార్త: కారంపూడి మండలంలోని కారంపూడి, గాదెవారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలో నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్తు శాఖ అధికారులు తెలిపాపారు. రెండవ శనివారం సందర్భంగా కారంపూడి, గాదెవారిపల్లె సబ్‌స్టేషన్ పరిధిలోని 33 కేవీ ఫీడర్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఫీడర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్స్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. విద్యుత్తు వినియోగదారులు, ప్రజలు సహకరించాలని ఏఈఈ గొల్లపల్లి వీరాంజనేయులు కోరారు.

# పల్నాడు జిల్లా వార్త




## పిఎం సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన కల్పించండి : కలెక్టర్

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు విద్యుత్‌శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. శుక్రవారం పథకానికి సంబంధించి సమీక్షా సమావేశాన్ని కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ళల్లో ఉచితంగా 25 ఏళ్ళ పాటు నిరంతర విద్యుత్ పొందడమే కాక అదనపు విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి ఆదాయం చేసుకునే వెసులుబాటు సూర్యఘర్ పథకంలో ఉందన్నారు. ఎస్సీ ఎస్టీలకు వంద శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. బిసిలకు రూ.98 వేల వరకు, ఇతరులకు రూ.78 వేల వరకు సబ్సిడీ అందుతుందన్నారు. స్థానిక నియోజకవర్గంలో పది వేల సాధారణ కనెక్షన్‌లను లక్ష్యంగా పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జూన్ నెల 25లోపు ఈ కార్యక్రమం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్.రాంబొట్లు, అధికారులు వై.ఏడుకొండలు, వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు పాల్గొన్నారు.



## ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సపాలెం గ్రామంలో ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. శంకర నేత్రాలయం సహకారంతో తడికిమళ్ళ కుటుంబసభ్యులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు మాట్లాడుతూ ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో శంకర నేత్రాలయం వైద్యులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. ఉచిత వైద్య శిబిరాల ద్వారా ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 13వతేదీ నుండి 19వతేదీ వరకు ఏడు రోజుల పాటు కంటి పొరలను పరిశీలించి అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేస్తామని నిర్వాహకులు తెలియజేయడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. రాష్ట్ర బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు కపలవాయి విజయ్‌కుమార్, స్థానిక నాయకులు బత్తుల మురళి, ఆర్యవైశ్య ప్రముఖులు ఊరా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



## సుపరిపాలన కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : సుపరిపాలన కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. దశాబ్దాలుగా ఉన్నటువంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవతో ముందుకు వెళ్తున్నామన్నారు. మొత్తం 68 అర్జీలు తమకు అందాయని తెలియజేశారు. దరఖాస్తుదారులు రేషన్‌కార్డులు, ఇళ్ళ స్థలాలు, నూతన గృహాల కొరకు అర్జీలు అందించారని తెలియజేశారు. నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు.



## డంపింగ్‌యార్డులో బయో రెమిడేషన్ ప్రారంభం

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : పట్టణ శివారులోని డంపింగ్‌యార్డుకు సంబంధించి దశాబ్దాలుగా ఉన్న సమస్యకు పరిష్కారం చూపుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. శుక్రవారం రూ.2 కోట్లతో ఏర్పాటు చేసిన పరికరాలు, ఫిల్టరింగ్, లిఫ్టింగ్ మిషనరీకి సంబంధించి ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ అరవింద్‌బాబు ప్రారంభించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ జశ్వంత్‌రావు అధ్యక్షత వహించారు. దుర్గంధభరితమైన డంపింగ్‌యార్డుకు కూటమి ప్రభుత్వం మోక్షం కలిగించిందని ఎమ్మెల్యే తెలిపారు. నిత్యం ఆ వైపుగా రాకపోకలు సాగించే వాహనదారులు పొగతో ఇబ్బందిపడేవారని గుర్తు చేశారు. స్వచ్ఛ నరసరావుపేట దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. డంపింగ్‌యార్డు చుట్టూ ఉన్న నివాసితుల సమస్యలను శాశ్వితంగా పరిష్కరిస్తున్నామన్నారు. వ్యర్థాలను బయో రెమిడేషన్ చేయడం ద్వారా వర్మీ కంపోస్టుగానూ, మిగిలిన వ్యర్థాలను జిందాల్‌కు తరలించి విద్యుత్ ఉత్పత్తిని చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసిరెడ్డి రవి, కపలవాయి విజయ్‌కుమార్, యార్డు ఛైర్మన్ పూనాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## 'తల్లికి వందనం' అర్హులు 2,974 మంది: కమిషనర్ శివన్నారాయణ

గురజాల, జూన్ 13 ప్రభాతవార్త: గురజాల నగర పంచాయతీ పరిధిలో తల్లికి వందన పథకం కింద 2025 - 2026 ఆర్థిక సంవత్సరమునకు 2974 మందికి అర్హులుగా గుర్తించినట్లు కమిషనర్ శివన్నారాయణ తెలిపారు. కాగా 483 మంది అనర్హులుగా ఉన్నట్లు చెప్పారు. వీరి వివరాలను సంబంధిత సచివాలయ నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. అభ్యంతరాలను సచివాలయాల్లో స్వీకరిస్తారన్నారు. అభ్యంతరాల వెరిఫికేషన్ అనంతరం జాబితా సిద్ధం చేసిన అనంతరం అర్హులను జాబితా ప్రచురించి తల్లికి వందనం అందిస్తారని చెప్పారు.


## పెదనెమలిపురిలో ఫ్రై డే డ్రైడే

రాజుపాలెం, జూన్ 13 ప్రభాతవార్త : మండలంలోని పెదనెమలిపురి గ్రామంలో ఫ్రై డే డ్రై డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి మాట్లాడుతూ నీటి నిల్వలు ఉంచవద్దన్నారు. దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన ప్రజలు పడతారని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ రక్తపరీక్షలు చేయించుకొని మందులు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి రవితేజ, సబ్ యూనిట్ అధికారి చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ లక్ష్మిదుర్గా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.




## యుక్త వయస్సులో గర్భం ధరించడం వలన అనర్థాలు

రాజుపాలెం, జూన్ 13 ప్రభాతవార్త : మండలంలోని నెమలిపురి గ్రామంలో యుక్త వయస్సులో గర్భం ధరించడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అధిక రక్తపోటు వంటివి వస్తాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి తెలిపారు. ప్రతి ఒక్కరూ సరైన వయస్సులో వివాహం జరిపించాలన్నారు. ప్రభుత్వం అందించే వైద్య సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. గర్భం దాల్చిన సమయంలో తీసుకునే ఆహారం, జాగ్రత్తల గురించి వివరించారు.



## డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పెదకూరపాడు, జూన్ 13 ప్రభాతవార్త : బస్టాండ్ సెంటర్‌లో ఎస్.ఐ. అల్లురెడ్డి ఆధ్వర్యంలో డ్రగ్స్ వలన కలిగే నష్టాల గురించి వాహనదారులకు, విద్యార్థులకు, ప్రయాణికులకు వివరించారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని అందుకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. డ్రగ్స్ వలన జీవితాలు పాడైపోతాయని, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి చదువుకు దగ్గర కావాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు నియోజకవర్గ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట, జూన్13, ప్రభాతవార్త: పట్టణంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు, రెండవ శనివారం మరియు ట్రీ కటింగ్ కారణంగా చిలకలూరిపేట టౌన్1 పరిధిలోని ఎన్ఆర్‌టి సెంటర్, గాంధీపేట, సుబ్బయ్యతోట, చీరాల రోడ్, మద్దినగర్, కొమరవల్లిపాడు, మరియు టౌన్2 పరిధిలోని సుభానినగర్, రాగన్నపాలెం, గుండయ్యతోట, బొందిలపాలెం, ఆవుల దొడ్డి, వడ్డెరపాలెం, పురుషోత్తమపట్నం, అడ్డరోడ్డు, సుగాలీకాలనీ, భావనారుషినగర్ ప్రాంతములలోఅదేవిధంగా రూరల్ మండల పరిధిలోని మానుకొండవారిపాలెం, మిట్టపాలెం, గొట్టిపాడు, దండమూడి, నాగభైరువారిపాలెం, గుదేవారిపాలెం, కుక్కపల్లివారిపాలెం, పసుమర్రు, మద్దిరాల, మురికిపూడి, గంగన్నపాలెం, గోవిందపురం, కమ్మవారిపాలెం, కోమటినేనివారిపాలెం, యడవల్లి గ్రామాలలో ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నాం 2 గంటలవరకు, నాదెండ్ల మండలంలో అన్ని గ్రామాలలో ఉదయం 8 గంటలనుండి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని విద్యుత్‌శాఖ డిఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిదిగా ఆయన కోరారు.

## టిడిపి నాయకులు నాగభైరు అప్పారావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్13, ప్రభాతవార్త: మండలంలోని నాగభైరువారిపాలెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నాగభైరు అప్పారావు ఇటీవల మరణించారు. కాగా శుక్రవారం మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి అప్పారావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జవ్వాజి మదన్‌మోహన్, కందుల రమణ, మద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు, తూబాటి శ్రీహరి, ఎన్ ఆంజనేయులు, ధూళిపాళ్ల శ్రీను, పి గిరి, సీతారాంబాబు మరియు గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## సీనియర్ పాత్రికేయుడు దండా గోపికి మాతృవియోగం

### ...నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూన్13, ప్రభాతవార్త: సీనియర్ పాత్రికేయుడు, ఏపి జర్నలిస్ట్ ఫోరం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు దండా గోపి మాతృమూర్తి శుక్రవారం ఉదయం మృతిచెందారు. విషయం తెలుసు కున్న మాజీమంత్రి, స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మిట్టపాలెం గ్రామంలోగల వారి నివాసానికి వెళ్లి ఆమె పార్థీవ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు దండా గోపిని, వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటితో పాటు టిడిపి నాయకులు షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జవ్వాజి మదన్‌మోహన్, కందుల రమణ, మద్దుమాల రవి, గంగా శ్రీనివాసరావు, తూబాటి శ్రీహరి, రియాజ్ మరియు మిట్టపాలెం గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు. దండా గోపి మాతృమూర్తి దండా సుమతి పార్థికదేహన్ని సందర్శించి నివాళులు అర్పించిన పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ అసిస్ట్ అధినేత జాష్టి రంగారావు, ఎపిజెఎఫ్ నాయకులు నాగభైరు శ్రీనివాసరావు, మురికిపూడి ప్రసాద్, ఆరాధ్యుల రామకృష్ణ, వెంకటేశ్వరరావు, సిద్దిక్, రవికిరణ్, కిరణ్, పృధ్వీసాయి, చొప్పా వీరనారాయణ, అంకిరెడ్డి రమేష్, లోక్‌సత్తా రాష్ట్ర నాయకుడు మాదాసు భానుప్రసాద్, వెంకట్రావు, మురికిపూడి రమేష్‌బాబు, ఎపి డబ్ల్యుయుజె సీనియర్ నాయకులు పుల్లగూర భక్తవత్సలం, అన్నాలదాసు గిరి, షేక్ అబ్దుల్ సత్తార్, ఉప్పాల బాలు, జగదీష్, విజయ్, బుజ్జి, వివిధ జర్నలిస్ట్ సంఘాల నాయకులు, పట్టణ ప్రముఖులు దండా సుమతి భౌతికకాయాన్ని సందిర్శించి నివాళులు అర్పించారు.



**దండా సుమతికి నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్**

చిలకలూరిపేట, జూన్13, ప్రభాతవార్త: పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, ఎపిజెఎఫ్ ఉమ్మడి గుంటూరుజిల్లా అధ్యక్షుడు దండా గోపి మాతృమూర్తి శుక్రవారం ఉదయం మండలంలోని మిట్టపాలెం గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ మిట్టపాలెం గ్రామంలోని వారి నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం దండా గోపిని, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌తో పాటు కొత్తా శ్రీనివాసరావు, దండా నాగేశ్వరరావు, నాగభైరు కామేశ్వరరావు, దండా శ్రీను, చిలుకూరి రామారావు, బాబు తదితరులు పాల్గొని తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.



## 15 ద్విచక్ర వాహనాలు పోలీస్‌స్టేషన్‌లకు అందజేత

నరసరావుపేట క్రైం, జూన్ 13 ప్రభాతవార్త : పల్నాడు జిల్లాకు చెందిన నూతన ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు పోలీస్‌స్టేషన్‌లకు శుక్రవారం అందజేశారు. 14 ఆపాచీ బండ్లు, ఒక బుల్లెట్, పోలీస్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ద్వారా జిల్లాకు కేటాయించారు. కేటాయించిన వాహనాలను ట్రాఫిక్ రెగ్యులేషన్ విధులకు వినియోగించడం జరుగుతుందని ఎస్పీ శ్రీనివాసరావు తెలియజేశారు. నరసరావుపేటకు -2 వాహనాలు, ఒక బుల్లెట్ వాహనం, చిలకలూరిపేటకు-2, వినుకొండకు-2, పిడుగురాళ్ళకు-2, సత్తెనపల్లికి-2, మాచర్లకు-2, గురజాలకు -1, దాచేపల్లికి -1 కేటాయించడం జరిగిందని ఎస్పీ కె.శ్రీనివాసరావు వివరించారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట, జూన్ 13 ప్రభాతవార్త : పట్టణంలోని పలు ప్రాంతాలలో రెండవ శనివారాన్ని పురస్కరించుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబొట్లు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు విద్యుత్ మరమ్మత్తుల కారణంగా సరఫరాలో కలుగుతున్న అంతరాయాన్ని గమనించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రజలు తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా రాంబొట్లు కోరారు.

## విజయవంతమైన రక్తదాన శిబిరం

నరసరావుపేట టౌన్, జూన్ 13 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఛైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రెడ్‌క్రాస్ సొసైటీ అందించే సేవలకు ఎస్‌బిఐ తమవంతు సహకారం అందించడం సంతోషమన్నారు. రక్తదాన శిబిరాల నిర్వహణ వలన ఆపదలో ఉన్నవారికి ప్రాణాలను కాపాడే గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. ఎస్‌బిఐ 70 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నరసరావుపేటతో పాటు మాచర్ల, గురజాల, చిలకలూరిపేటలలో సేవా కార్యక్రమాలను ఏర్పాటు చేయడం సంతోషమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.రవికుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు జి.మురళీకృష్ణ, కె.ఎం.ఎస్.వి.శ్రీనివాసగుప్తా, రెహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.




## రొంపిచర్ల మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

రొంపిచర్ల, జూన్ 13 ప్రభాతవార్త : మండలంలో రెండవ శనివారాన్ని పురస్కరించుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కె.రాంబాబు శుక్రవారం తెలియజేశారు. పిడుగురాళ్ళ 220 కె.వి.సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీని వలన రొంపిచర్ల, రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో 33 కె.వి. 11కె.వి.లైన్లతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ నిలిచిపోతుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఏఈ కె.రాంబాబు సూచించారు.

## విజయపురిసౌత్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

విజయపురిసౌత్, జూన్ 13 ప్రభాతవార్త: విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం నిధులు




విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమ చేయడం హర్షణీయమన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం అందించే సన్నబియ్యాన్ని టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డి.జ్యోతి, ఎస్ఎంసీ ఛైర్మన్ రామ్‌చంద్‌నాయక్, టీడీపీ నేతలు ఆడెపు కోటయ్య, సీహెచ్ అప్పలరాజు, కట్టా రాజు, మస్తాన్‌వలి, ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, లక్ష్మీ, విజయలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

14-6Pg5.qxd:14-6Pg5.qxd 01/01/01 6:09 AM Page 1



# ఇజ్రాయెల్ దాడులతో పశ్చిమాసియా ఉద్రిక్తం

## దౌత్యమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించిన భారత్



**వాషింగ్టన్/న్యూఢిల్లీ, జూన్ 13:** ఇరాన్‌పై 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పశ్చిమాసియా రణరంగంగా మారింది. ఈ ఉద్రిక్తతలపై భారత్ స్పందిస్తూ ఆందోళన వ్యక్తం చేసింది. దౌత్యమార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని ఈ సందర్భంగా ఇరు దేశాలకు సూచించింది. భారత విదేశాంగ శాఖ శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న పరిస్థితులపై న్యూఢిల్లీ ఆందోళన వ్యక్తం చేసింది. అణు కర్మాగారాలే లక్ష్యంగా జరిపిన దాడులతో సహా అన్ని విషయాలను నిశితంగా గమనిస్తున్నామని తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా చూసుకోవాలని ఇరు దేశాలను కోరింది. దౌత్యపరమైన మార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించింది. ఇరాన్-ఇజ్రాయెల్‌తో తమకు సన్నిహితమైన సంబంధాలు ఉన్నాయని, సమస్యను పరిష్కరించుకునేందుకు తాము మద్దతిస్తామని ఈ సందర్భంగా న్యూఢిల్లీ పేర్కొంది. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయా దేశాల్లోని భారత కమ్యూనిటీలతో అక్కడి భారత రాయబార కార్యాలయాలు సంప్రదింపులు జరుపుతున్నాయని వెల్లడించింది. అక్కడి భారత పౌరులంతా అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారులు చెప్పే భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరింది.

**దాడులను ఖండించిన సౌదీ:** కాగా.. ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడాన్ని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. 'ఇరాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇవి ఆ దేశ సార్వభౌమాధికారాన్ని, భద్రతను బలహీనపరుస్తాయి. టెల్‌అవీవ్ దాడులకు దిగి అంతర్జాతీయ చట్టాలు, నిబంధలను ఉల్లంఘించింది' అని సౌదీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్ మహమ్మద్ బాఘేరి కూడా మరణించారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు 'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు.

**ఇరాన్‌పై దాడుల గురించి ముందే తెలుసు: ట్రంప్**
ఇరాన్‌పై ఇజ్రా యెల్ చేస్తున్న దాడుల గురించి



తమకు ముందే తెలుసని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ దాడుల్లో తమ ప్రమేయం లేదని స్పష్టం చేశారు. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ దీనిపై మాట్లాడారు. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు. దీనిపై ఆ దేశం చర్చలకు తిరిగి రావాలని తాను కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇక, ఇరాన్ ఏదైనా ప్రతీకార దాడులకు పాల్పడితే దాన్ని ఎదుర్కొనేందుకు తమ సెంట్రల్ కమాండ్ సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. దాని నుంచి అమెరికా తనను తాను రక్షించుకోవడంతోపాటు సిద్ధంగా ఉందన్నారు.

**ఇరాన్ గొప్ప దేశం కావొచ్చు కానీ..** ఇజ్రాయెల్ దాడులకు ముందు ట్రంప్ చేసిన పోస్టు ప్రస్తుతం వైరల్‌గా మారింది. 'ఇరాన్ అణు సమస్యను దౌత్యపరమైన మార్గాలతో పరిష్క రించుకునేందుకు మేం కట్టుబడి ఉన్నాం. దీనిపై చర్చలు జరపాలని నా అధికారులను ఆదేశించాను. అది గొప్ప దేశమే కావొచ్చు. కానీ, వారు ముందుగా అణ్వాయుధాలను కలిగి ఉండాలనే ఆశను వదులుకోవాలి' అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా ఇజ్రాయెల్ పూర్తిగా అప్రమత్తంగా ఉందని మిలిటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్ తెలిపారు. పదివేల మంది సైనికులను సరిహద్దు వద్ద సిద్ధంగాఉంచా మన్నారు. తమపై దాడులు చేయడానికి ప్రయ త్నించేవారు ఎవరైనా భారీ మూల్యం చెల్లించు కుంటారని ఆయన ఈసందర్భంగా హెచ్చరించారు.

ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెల కొన్న తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమా సియా మళ్లీ రణరంగంగా మారింది. ఇరాన్ న్యూక్లియర్ ప్లాంట్, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెల్‌అవీవ్ వైమానిక దాడులుచేసింది. ఈ దాడు ల్లో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ హొస్సేన్ సలామీ మృతి చెందారు. ఆ దేశ మిలిటరీ చీఫ్‌మహమ్మద్ బాఘేరి కూడా మరణిం చారు. కాగా ఇరాన్ అణు లక్ష్యాలను దెబ్బతీసేందుకు'ఆపరేషన్ రైజింగ్ లయన్'ను ప్రారంభించామనిఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. ఆ దేశ అణు కార్యక్రమానికి గుండె లాంటి ప్రదేశాన్ని ధ్వంసం చేశామన్నారు.



# విమానం నేలను తాకగానే
## 1000 డిగ్రీల ఉష్ణోగ్రతతో మంటలు

**అహ్మదాబాద్,జూన్ 13:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కుప్పకూలి ప్రమాదం జరిగిన తీరు, అనంతర పరిణామాలపై మరిన్నివివరాలు వెలుగులోకి వస్తున్నాయి. విమానం కూలిపోయిన ప్రదేశంలో దాదాపు 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు ఎగిసిపడ్డాయని, సహాయక చర్యలు చేపట్టడం అత్యంత క్లిష్టతరంగా మారిందని అధికారులు తెలిపారు. ఈ విమానంలో సుమారు 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, అది పేలి మంటలు తీవ్రంగా వ్యాపించడంతో ఎవరినీ రక్షించే అవకాశం లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఇప్పటికే వెల్లడించారు. ఘటనపై ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారి ఒకరు మాట్లాడుతూ, "ప్రమాద సమాచారం అందిన వెంటనే మధ్యాహ్నం 2 నుంచి 2:30 గంటల సమయంలో మా బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అప్పటికే స్థానికులు కొందరు హాస్టల్ శిథిలాల కింద చిక్కుకున్న వారిని కాపాడారు. అయితే, మంటలు తీవ్రంగా వ్యాపించడంతో పరిస్థితి అదుపు తప్పింది" అని వివరించారు. మరో అధికారి ప్రమాద స్థలంలోని భయానక వాతావరణాన్ని వివరిస్తూ, "మేము గతంలో అనేక సహాయక చర్యల్లో పాల్గొన్నాం, కానీ ఇంతటి విపత్తును ఎప్పుడూ చూడలేదు. విమాన ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో పెద్ద అగ్నిగోళంలా మారింది. క్షణాల్లోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో ఎవరూ బయటపడే మార్గం లేకుండా పోయింది. మేము పీపీఈ కిట్లు ధరించి ఘటనా స్థలానికి వెళ్లినా, వేడి తీవ్రత అధికంగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. ఆ ప్రాంతంలోని పక్షులు, కుక్కలు కూడా తప్పించుకోలేనంత వేగంగా ఉష్ణోగ్రత పెరిగింది. ప్రమాద స్థలంలో అనేక పక్షులు, శునకాలు కాలి బూడిదయ్యాయి. ఎటు చూసినా శిథిలాలే కనిపించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికుల మృతదేహాలను గుర్తించడం సవాలుగా మారిందని ఆవేదన్యక్తం చేశారు.

## బోయింగ్ ప్రమాదంలో ఇద్దరు ఫ్లైట్ అటెండెంట్ల దుర్మరణం

**ఇంపాల్, జూన్ 13:** ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం మణిపూర్‌లో తీవ్ర విషాదం నింపింది. ఈ దుర్ఘటనలో ఆ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రతిభావంతులైన యువతులు, ఎయిర్ ఇండియాలో ఫ్లైట్ అటెండెంట్లుగా పనిచేస్తున్న నంగ్థోయ్ శర్మ కొంగ్‌బ్రైలత్‌పమ్ (21), లామ్నుంథెమ్ సింగ్‌సన్ ప్రాణాలు కోల్పోయారు. ఈ సమాచారంతో వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు విషాదంలో మునిగిపోయారు. ఇంఫాల్‌లోని డీఎం కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో నంగ్థోయ్ శర్మ ఎంపికయ్యారు. ముగ్గురు ఆడపిల్లల్లో రెండోదైన నంగ్థోయ్, టీనేజ్‌లోనే ఎయిర్ ఇండియాలో ఉద్యోగం సంపాదించి కుటుంబానికి ఆసరాగా నిలిచారు. ఆమె తండ్రి నందేశ్ కుమార్ శర్మ మాట్లాడుతూ 12న ఉదయం 11:30 గంటలకు నంగ్థోయ్ తన సోదరికి చివరిసారిగా ఫోన్ చేసింది. తాను లండన్ వెళ్తున్నానని, కొన్ని రోజులు మాట్లాడలేనని చెప్పింది. జూన్ 15న తిరిగి రావాల్సి ఉంది. అదే మాకు ఆమె చివరి మాటలవుతాయని ఊహించలేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఆమె కాల్ చేసిన మూడు గంటల తర్వాత విమాన ప్రమాదం గురించి ఓ బంధువు ఫోన్‌లో చెప్పడంతో నంగ్థోయ్ సోదరి తీవ్ర ఆందోళనకు గురైంది. గత వారం అరమ్‌బాయ్ టెంగ్‌గోల్ సభ్యుడి అరెస్ట్‌కు నిరసనగా కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో వారికి ఆన్‌లైన్ వార్తలు అందుబాటులో లేవు. నంగ్థోయ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు రాసిన వెంటనే స్నేహితులతో కలిసి ఎయిర్ హోస్టెస్ ఇంటర్వ్యూకు హాజరై ఉద్యోగం సాధించిందని,



ముంబైలో మణిపూర్‌కు చెందిన ఇతర ఎయిర్ ఇండియా ఉద్యోగినులతో కలిసి ఉండేదని ఆమె తండ్రి గుర్తుచేసుకున్నారు. ఎప్పటికైనా మణిపూర్‌లో స్థిరమైన ఉద్యోగం చేస్తుందని ఆశించామని తెలిపారు.

మరో మృతురాలు లామ్నుంథెమ్ సింగ్‌సన్ కుటుంబం 2023లో జరిగిన జాతి ఘర్షణల కారణంగా ఇంఫాల్‌లోని ఓల్డ్ లంబులేన్‌లో ఉన్న తమ సర్వస్వాన్నీ వదిలేసి వచ్చింది. ప్రస్తుతం వారు కాంగ్‌పోక్పి జిల్లాలో అంతర్గతంగా నిరాశ్రయులైన వ్యక్తులుగా (ఐడీపీలు) ఓ చిన్న అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. లామ్నుంథెమ్ తండ్రి కొన్నేళ్ల క్రితం మరణించగా, ఆమె తల్లి నెమ్నెయిల్‌హింగ్ సింగ్‌సన్ ముగ్గురు పిల్లలను ఒంటరిగా పెంచారు. లామ్నుంథెమ్ ఆమెకు ఏకైక కుమార్తె. ప్రమాద వార్త తెలిసినప్పటి నుంచి స్థానికులు వారి ఇంటికి చేరుకుని ధైర్యం చెబుతున్నారు. తన కుమార్తె క్షేమంగా ఉందని ఏదైనా అధికారిక సమాచారం వస్తుందేమోనని తల్లి నెమ్నెయిల్‌హింగ్ ఇంకా ఆశతో ఎదురు చూస్తున్నారు. చివరిసారిగా తన తల్లికి ఫోన్ చేసినప్పుడు, తాను డ్యూటీ మీద అహ్మదాబాద్ వెళ్తున్నట్టు లామ్నుంథెమ్ చెప్పారని కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఇరాన్ గగనతలం మూసివేత: ఎయిరిండియా సర్వీసుల దారిమళ్లింపు

**న్యూఢిల్లీ,జూన్ 13:** ఇరాన్ తన గగనతలాన్ని మూసివేయడంతో అంతర్జాతీయ విమానయాన మార్గాల్లో తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ప్రభావంతో ఎయిర్ ఇండియాకు చెందిన పలు విమానాలు తమ ప్రయాణాలను అర్ధాంతరంగా ముగించుకోవాల్సి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున ముంబయి నుంచి లండన్ హీత్రూకు బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ129, గాలిలో సుమారు మూడు గంటల పాటు ప్రయాణించిన అనంతరం తిరిగి ముంబయి చేరుకుంది. ఫ్లైట్‌రాడార్24 వివరాల ప్రకారం ఏఐ129 విమానం ఉదయం 5:39 గంటలకు ముంబయి నుంచి టేకాఫ్ అయింది. అయితే, ఇరాన్ గగనతలాన్ని మూసివేయడంతో ప్రయాణాన్ని అర్ధాంతరంగా నిలిపివేసి విమానాన్ని వెనక్కి మళ్లించక తప్పలేదని తెలిసింది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌లో నెలకొన్న



పరిస్థితులు, అక్కడి గగనతలం మూసివేత కారణంగా మా పలు విమానాలు దారి మళ్లించబడుతున్నాయి లేదా బయలుదేరిన చోటుకే తిరిగి వస్తున్నాయని ఎయిర్ ఇండియా వెల్లడించింది. ప్రయాణికులు మరియు సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని సంస్థ పేర్కొంది. ముంబయి-లండన్ సర్వీసుతో పాటు ఇతర అంతర్జాతీయ ఎయిర్ ఇండియా విమానాలపైనా ఈ ప్రభావం పడింది. లండన్ హీత్రూ నుంచి ముంబయి వస్తున్న ఏఐ130 విమానాన్ని వియన్నాకు, న్యూయార్క్ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ102 విమానాన్ని షార్జాకు, న్యూయార్క్ నుంచి ముంబై వస్తున్న ఏఐ116 విమానాన్ని జెడ్డాకు, లండన్ హీత్రూ నుంచి ఢిల్లీ వస్తున్న ఏఐ2018 విమానాన్ని ముంబయికి దారి మళ్లించారు. ముంబయి నుంచి న్యూయార్క్‌కు వెళ్తున్న ఏఐ119, ఢిల్లీ నుంచి వాషింగ్టన్‌కు వెళ్తున్న ఏఐ103 విమానాలు కూడా తాము బయలుదేరిన విమానాశ్రయాలకే వెనుదిరిగాయి. ఈ అంతరాయం వల్ల ప్రయాణికులకు కలిగిన అసౌకర్యాన్ని తగ్గించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎయిర్ ఇండియా హామీ ఇచ్చింది. ప్రయాణికులకు వసతి, టికెట్ డబ్బు వాపసు (రీఫండ్) లేదా ఎటువంటి అదనపు రుసుము లేకుండా ప్రయాణ తేదీ మార్పు (రీషెడ్యూలింగ్) వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. ప్రయాణికులు వీలైనంత త్వరగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ప్రత్యామ్నాయ మార్గాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ వివరించింది.

## ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో విమానసర్వీసులకు బ్రేక్
### 3 గంటలు ప్రయాణించి వెనక్కు వచ్చేసిన ఎయిరిండియా విమానం

**ముంబయి,జూన్ 13:** అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు విమాన సర్వీసులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇజ్రాయెల్ జరిపిన దాడి కారణంగా ఇరాన్ తమ గగనతలాన్ని శుక్రవారం మూసివేసింది. ఈ పరిణామంతో ముంబై నుంచి లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ131ను అత్యవసరంగా దారి మళ్లించాల్సి వచ్చింది. అలాగే, మొత్తం 16 విమానాలను ఎయిరిండియా దారి మళ్లించడమో, వెనక్కి పిలిపించడమో చేసినట్టు సమాచారం. షెడ్యూల్ ప్రకారం నేడు ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌లోని హీత్రూ విమానాశ్రయానికి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం సాధారణంగా ఇరాన్ గగనతలం మీదుగా ప్రయాణిస్తుంది. అయితే, ఇజ్రాయెల్ జరిపిన సైనిక చర్య నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా తమ దేశ గగనతలాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు ప్రకటించింది.

## ఇండో-చైనాలమధ్య నిలిచిన విమానసర్వీసుల పునర్ధురణ



**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత్, చైనాల మధ్య నిలిచిపోయిన ప్రత్యక్ష విమాన సర్వీసులు త్వరలో తిరిగి ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా నిలిచిపోయిన ఈ సేవలను పునరుద్ధరించడం ద్వారా ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలను నెలకొల్పడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలను తిరిగి గాడిలో పెట్టే దిశగా ఇది ఒక కీలకమైన ముందడుగుగా భావిస్తున్నారు. ఇరు దేశాల విమానయాన, దౌత్య అధికారులు గత కొన్ని నెలలుగా చర్చలను ముమ్మరం చేశారు. ప్రత్యక్ష విమాన సేవలను తిరిగి ప్రారంభించడానికి అవసరమైన కార్యాచరణ, నియంత్రణాపరమైన అంశాలపై సాంకేతిక బృందాలు కృషి చేస్తున్నాయి. 2020 ప్రారంభంలో కొవిడ్19 మహమ్మారి వ్యాప్తి, గల్వాన్ లోయ ఘర్షణలతో తలెత్తిన సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్, చైనాల మధ్య ప్రత్యక్ష విమాన సేవలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అంతకుముందు బీజింగ్, షాంఘై, గ్వాంగ్‌జౌ, కున్‌మింగ్ వంటి చైనా నగరాల నుంచి న్యూఢిల్లీ, ముంబయి, కోల్‌కతా వంటి భారతీయ నగరాలకు పలు విమానయాన సంస్థలు వారానికి అనేక డజన్ల కొద్దీ విమానాలను నడిపేవి. ప్రస్తుతం జరుగుతున్న చర్చలు ప్రధానంగా విమానాశ్రయాలలో స్లాట్ కేటాయింపులు, గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవలు, నవీకరించిన నియంత్రణ ప్రక్రియలు వంటి కీలక కార్యాచరణ అంశాలపై దృష్టి సారించాయి. భారత్‌లో చైనా రాయబారి జూ ఫీహాంగ్ ఇటీవల మాట్లాడుతూ, ప్రత్యక్ష విమానాల పునరుద్ధరణపై ఆశాభావం వ్యక్తం చేశారు. "భారత్‌లో నేను కలిసిన ప్రతి ఒక్కరూ ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష విమానాలను ఆశిస్తున్నారు. త్వరలోనే విమానాల పునరుద్ధరణ జరుగుతుందని నేను ఆశిస్తున్నాను" అని ఆయన తెలిపారు. విమాన కార్యకలాపాలను సూత్రప్రాయంగా తిరిగి ప్రారంభించడానికి ఇరు పక్షాలు అంగీకరించాయని, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), దాని చైనా విభాగం సాంకేతిక ఏర్పాట్లను ఖరారు చేస్తున్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. విమానాల పునరుద్ధరణకు కచ్చితమైన కాలపరిమితిని ఇంకా ప్రకటించనప్పటికీ, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేశాయి. 2025 మొదటి నాలుగు నెలల్లోనే చైనా భారతీయ పౌరులకు 85,000 వీసాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో విమానాల పునరుద్ధరణ వాణిజ్యం, పర్యాటకం, విద్యా సంబంధాలను ప్రోత్సహిస్తుందని అంచనా వేస్తున్నారు. పౌర విమానయాన కార్యదర్శి ఉమ్లున్‌మాంగ్ ఉల్నామ్ మాట్లాడుతూ, చర్చలు ఇంకా ప్రాథ మిక దశలోనే ఉన్నాయని, అయితే కనెక్టివిటీని పునరుద్ధరించడంలో పరస్పర ఆసక్తి ఉందని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ఎదురైన అంతరాయాలను అధిగమించి, ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచడంలో విమాన సర్వీసుల పునరుద్ధరణ ఒక సానుకూల పరిణామంగా పరిగణించబడుతోంది. ఇది ఇరు దేశాలకు ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను అందిస్తుందని భావిస్తున్నారు.

## పుకెట్ ఢిల్లీ ఎయిరిండియా విమానం అత్యవసర ల్యాండింగ్!

**పుకెట్(థాయిలాండ్),జూన్ 13:** థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానంలో శుక్రవారం ఉదయం తీవ్ర కలకలం రేగింది. విమానంలో బాంబు ఉందన్న బెదిరింపు రావడంతో అప్రమత్తమైన పైలట్, విమానాన్ని వెనక్కి మళ్లించి ఫుకెట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ సమయంలో విమానంలో 156 మంది ప్రయాణికులు ఉన్నారు. ఏరోనాటికల్ రేడియో ఆఫ్ థాయ్‌లాండ్ అధికారుల వివరాల ప్రకారం ఎయిర్ ఇండియాకు చెందిన ఏఐ 379 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పైలట్‌కు బాంబు బెదిరింపు గురించి సమాచారం అందింది. దీంతో ఆయన వెంటనే ఫుకెట్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతి కోరారు. ఫుకెట్ విమానాశ్రయ అధికారులు తక్షణమే స్పందించి, ఎయిర్‌పోర్ట్ కంటింజెన్సీ ప్లాన్‌ను అమలులోకి తెచ్చారు. బాంబు బెదిరింపుల సమయంలో అనుసరించాల్సిన నిర్దేశిత అత్యవసర నిబంధనల ప్రకారం ప్రయాణికులందరినీ విమానం నుంచి దించివేసి, సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం అధికారులు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రాథమిక సోదాల్లో ఎలాంటి బాంబు లభ్యం కాలేదని తాజా సమాచారం ద్వారా తెలిసింది. అయితే, విమానంలో ఒక బాంబు బెదిరింపు నోటు దొరికిందని అధికారులు ధ్రువీకరించారు. ఆ నోటును ఎవరు రాశారు, దానిని ఎవరు గుర్తించారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ నోటును కనుగొన్న ప్రయాణికుడిని అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం. గత కొంతకాలంగా భారతీయ విమానయాన సంస్థలు, విమానాశ్రయాలకు నకిలీ బాంబు బెదిరింపులు వెల్లువెత్తుతున్న విషయం తెలిసిందే. గతేడాది తొలి పది నెలల్లోనే దాదాపు 1,000 వరకు ఇలాంటి తప్పుడు కాల్స్, సందేశాలు అందాయి.

## బోయింగ్ ప్రమాదంపై దర్యాప్తునకు పూర్తి సహకారం
### అమెరికా రక్షణశాఖ, ఫెడరల్ ఏవియేషన్ వెల్లడి

**వాషింగ్టన్,జూన్ 13:** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానం ఘోర ప్రమాదానికి గురై 265 మందికి పైగా మరణించినప్పటికీ, ప్రస్తుతానికి బోయింగ్ 787 విమానాల రాకపోకలను నిలిపివేయడానికి తక్షణ కారణాలు ఏవీ లేవని అమెరికా అధికారులు స్పష్టం చేశారు. ఈ దుర్ఘటనపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని, భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యమని వారు తెలిపారు. అమెరికా రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ, ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) తాత్కాలిక నిర్వాహకుడు క్రిస్ రోచెల్యూ మీడియాతో మాట్లాడుతూ ప్రమాదా నికి సంబంధించిన కొన్ని వీడియో క్లిప్‌లను చూశామని, అయితే బోయింగ్ 787 విమాన నమూనాలో భద్రతా లోపాలు ఉన్నాయని చెప్పడానికి ప్రస్తుతం తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని వారు పేర్కొన్నారు. నిపుణులు ప్రమాద స్థలానికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉంది. కేవలం వీడియోలను చూసి అంచనాలకు రావడం తొందరపాటు అవుతుంది. అది సరైన పద్ధతి కాదని డఫీ అన్నారు. భారతీయ అధికారులతో పాటు విమాన తయారీ సంస్థ బోయింగ్, ఇంజన్ల తయారీ సంస్థ జీఈ ఏరోస్పేస్‌తో కలిసి ఎఫ్ఏఏ, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్టీఎస్బీ) బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని డఫీ తెలిపారు. దర్యాప్తునకు సహకరించేందుకు ఇప్పటికే ఒక అమెరికన్ బృందం భారత్‌కు బయల్దేరిందని, అవసరమైతే మరిన్ని వనరులను పంపేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన హామీ ఇచ్చారు. దర్యాప్తులో భాగంగా విమాన ప్రయాణానికి సంబంధించి ఏదైనా ప్రమాద సంకేతం మా దృష్టికి వస్తే, దాన్ని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని రోచెల్యూ స్పష్టం చేశారు. భద్రతే మాకు అత్యంత ముఖ్యం. ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తాం. దర్యాప్తులో వెల్లడయ్యే భద్రతా సిఫార్సులను అమలు చేయడానికి వెనుకాడబోమని డఫీ దృఢంగా చెప్పారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పట్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ విషాద సమయంలో భారత్‌కు అన్ని విధాలా సాయం అందించడానికి అమెరికా సిద్ధంగా ఉందని ప్రకటించారు. భారత్ ఒక పెద్ద, బల మైన దేశం వారు ఈ పరిస్థితిని అధిగమిం చగలరు. మా వైపు నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా తక్షణమే అందిస్తామని వారికి తెలియజేశానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి బోయింగ్ 787 విమాన సర్వీసులు యథావిధిగా కొనసాగుతాయని, దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రయాణికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను వెలికి తీయడంలో భారత్‌కు పూర్తిగా సహకరిస్తామని అమెరికా అధికారులు పునరుద్ఘాటించారు.

# మాజీ సిఎంకు కలిసిరాని లక్కీనంబర్..

**అహ్మదాబాద్,జూన్ 13:** అహ్మదాబాద్ నుంచి లండన్ బయలు దేరిన ఏఐ 171 బోయింగ్ విమానం ప్రమాదానికి గురైంది. గాల్లోకి లేచిన 30 సెకన్లకే కుప్పకూలిపోయిన ఘటనలో 241 మంది ప్రాణాలు కోల్పోగా, చనిపోయిన వారిలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా ఉన్నారు. ఇక్కడ విషాదకరమైన విషయం ఏంటంటే విజయ్ రూపానీ జీవితంలో లక్కీ నెంబర్.. అన్ లక్కీ నెంబర్‌గా మారింది. లక్కీ నెంబర్ రోజే ఆయన ప్రాణాలు కోల్పోయారు. అది కూడా దారుణమైన స్థితిలో మరణించారు. మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీకి 1206 నెంబర్ అంటే పిచ్చి. ఆ నెంబర్‌ను తన లక్కీ నెంబర్‌గా భావించేవారు. ఆ నెంబర్‌తో సంబంధం ఉన్న రోజే ముఖ్యమైన కార్యక్రమాలు మొదలుపెట్టేవారు. కార్లకు, బైకులకూ అదే నెంబర్ తీసుకున్నారు. అయితే, ఊహించని విధంగా 1206(12వ తేదీ, 6 నెల) రోజే విమాన ప్రమాదంలో చనిపోయారు. ఆయన లండన్‌లోని తన కుటుంబాన్ని కలుసుకోవడానికి విమానం ఎక్కారు. ఇక్కడ ఆశ్చర్యకరమైన




విషయం ఏంటంటే రూపానీ విమానంలో కూర్చున్న సీటు నెంబర్ కూడా 12. విమానం ఎక్కిన సమయమూ 12.10. పాపం లక్కీ నెంబర్ ఆయన్ని ప్రమాదం నుంచి కాపాడలేకపోయింది. ఆయన విమానంలో కూర్చుని ఉండగా దిగిన చివరి ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ప్రమాదం జరిగిన ప్రదేశానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ వెళ్లారు. అక్కడ పర్యటించారు. అనంతరం ప్రమాదంలో గాయపడ్డ వారి దగ్గరకు వెళ్లి పరామర్శించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.

# బోయింగ్‌ప్రమాదంపై పాక్ అగ్రనేతల సంతాపం

**కరాచి,జూన్ 13:** దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాల్లో ఒకటైనా అహ్మదాబాద్ ఎయిరిండియా విమానం కూలిన ఘటనపై ప్రపంచ దేశాలు తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశాయి. మన పొరుగున ఉన్న పాకిస్తాన్ కూడా ఈ విషాదకరమైన ఘటనపై స్పందించింది. పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్, మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్, పీపీపీ పార్టీ అధ్యక్షుడు బిలావల్ భుట్టో జర్దారీ సహా పలువురు నేతలు సంతాపం తెలిపారు. పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఎక్స్ వేదికగా అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపట్ల తాను ఎంతో బాధపడినట్లు వెల్లడించారు. ఈ ఘటనలో తమ వారిని కోల్పోయి దుఃఖిస్తున్న బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ హృదయ విదారక విషాదం వల్ల ప్రభావితం అయిన వారందరి కోసం పాకిస్తాన్ ప్రార్థనలు చేస్తోందని షెహబాజ్ షరీఫ్ తనపోస్టులో వెల్లడించారు. షెహబాజ్ షరీఫ్ సోదరుడు, పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూడా ఇదే రకమైన సందేశం ఇచ్చారు. ఈ ఘటన మానవత్వానికి అతీతమైనదని అని ట్వీట్ చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన హృదయ విదారక ఎయిరిండియా విమాన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ వినాశకరమైన నష్టం సరిహద్దులను దాటి భారత్, పాకిస్తాన్ ఉమ్మడి మానవత్వాన్ని గుర్తు చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాధితులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు, మాజీ విదేశాంగ మంత్రి భిలావల్ భుట్టో జర్దారీ కూడా సానుభూతిని తెలియజేశారు. అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఎయిరిండియా విమానం కూలిపోయిన విషాదకరమైన సంఘటన గురించి వినడం బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నానని తెలిపారు. ఈ ఘటనపై అంతర్జాతీయంగా ప్రపంచ నాయకులు ప్రాణ నష్టంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ ఘటన దృశ్యాలు తమ హృదయాలు కలిచివేసాయని ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

# ఎయిర్‌లైన్స్ ఉద్యోగినని నమ్మించి 120సార్లు ఉచిత ప్రయాణం

## చివరకు పోలీసులకు చిక్కిన ఎయిర్‌వేస్ చీటర్

**ఫ్లోరిడా, జూన్ 13:** ఫ్లోరిడాకు చెందిన ఒక వ్యక్తి విమానయాన సంస్థల సిబ్బందిగా నటిస్తూ ఆరేళ్ల వ్యవధిలో 120సార్లకుపైగా విమాన ప్రయాణాలను ఉచితంగా చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిరాన్ అలెగ్జాండర్ అనే ఈ వ్యక్తి, పైలట్ లేదా ఫ్లైట్ అటెండెంట్‌గా నమ్మించి వివిధ ఎయిర్‌లైన్స్‌ను మోసం చేసినట్టు అధికారులు గుర్తించారు. అలెగ్జాండర్ ఏకంగా ఏడు వేర్వేరు విమానయాన సంస్థలలో తాను ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పుకుని 'నాన్‌రెవ్' అంటే ఉద్యోగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం పద్ధతిలో ప్రయాణించాడు. ఇందుకోసం ఒక ఎయిర్‌లైన్‌కు చెందిన అంతర్గత టికెట్ పోర్టల్‌ను ఉపయోగించి ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకున్నాడు. ఈ మోసపూరిత చర్యలకు పాల్పడేందుకు అలెగ్జాండర్ అసలైన విమానయాన సంస్థల ఉద్యోగుల గుర్తింపు వివరాలను సంపాదించాడు. వారి బ్యాడ్జ్ నంబర్లను కూడా దొంగిలించి తాను ఆయా సంస్థల ఉద్యోగినని నిరూపించుకునే ప్రయత్నం చేశాడు. మొత్తం మీద ఉచిత ప్రయాణాల కోసం అతడు 30వేర్వేరు సెట్ల గుర్తింపు కోడ్స్‌ను ఉపయోగించినట్టు తేలింది. ఈ మోసపూరిత బుకింగ్‌లను అలెగ్జాండర్ ప్రధానంగా స్పిరిట్ ఎయిర్‌లైన్స్ ఉద్యోగుల ట్రావెల్ పోర్టల్ ద్వారా చేసినట్టు అధికారులు గుర్తించారు. చాలా విమానయాన సంస్థలకు ఇతర సంస్థలతో పరస్పర ఒప్పందాలు ఉంటాయి. దీనివల్ల ఒక సంస్థ ఉద్యోగులు తమ అంతర్గత ట్రావెల్ బుకింగ్ సైట్ ద్వారా ఇతర ఎయిర్‌లైన్స్‌లో కూడా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. వారు ఉద్యోగంలో చేరిన తేదీ, బ్యాడ్జ్ నంబర్, వారు పనిచేస్తున్న సంస్థ పేరు వంటి వివరాలను నమోదు చేసి ఉచిత విమాన ప్రయాణాలను పొందాడు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ వివరాల ప్రకారం అలెగ్జాండర్ 2018 నుంచి 2024 వరకు ఈ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడ్డాడు. ఇతర క్యారియర్‌ల ఉద్యోగిగా నటిస్తూ అతను స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌లో 34 ట్రిప్పులు చేశాడు. అలెగ్జాండర్ ఫ్లైట్ అటెండెంట్‌గా అబద్ధం చెప్పి 120 కంటే ఎక్కువ ఉచిత విమాన ప్రయాణాలు బుక్ చేసుకున్నాడని కోర్టు పత్రాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు రుజువైతే అలెగ్జాండర్‌కు 20 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు భారీగా జరిమానా విధించే అవకాశం ఉంది.

## వచ్చే యేడాదికల్లా ఎన్‌డిబి రోడ్ల విస్తరణ పూర్తి కావాలి

### :మంత్రి బిసి జనార్ధనరెడ్డి

**విజయవాడ జూన్ 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఎన్‌డీబీ రుణంతో చేపట్టిన రహదారులు విస్తరణ వచ్చే ఏడాది చివరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరగాలని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో ఎన్‌డీబీ పనులు జరుగుతున్న తీరుపై అధ్యయనానికి ఆ బ్యాంక్ ప్రతినిధులు బృందం నాలుగు రోజులు పర్యటనకు వచ్చింది. వీరితోను,ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లతో మంత్రి జనార్తనరెడ్డి గురువారం ఆర్ అండ్ బీ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ క్రింద ఇప్పటికి రూ.637.76 కోట్ల మేర పనులు పూర్తి కాగా రూ.488.30 కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు.బ్యాంకు తొలుత ఇచ్చిన రుణ అడ్వాన్స్ రూ.233 కోట్లు సద్వినియోగం చేసుకుందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.100 కోట్లు వెచ్చించాల్సి ఉండగా రూ.225 కోట్ల మేర గుత్తేదార్లకు ప్రభుత్వం చెల్లింపులు చేసిందని వెల్లడించారు. ఎన్‌డీబీ ప్రతినిధులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ పనుల్లో పురోగతి వచ్చిందని వెల్లడించారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అటకెక్కిన రక్తనిల్వ కేంద్రం

### - పట్టించుకోని వైద్యశాఖ ఉన్నతాధికారులు



ప్రభుత్వ ఆసుపత్రిలో నేమ్‌బోర్డుకు పరిమితమైన రక్తనిల్వ కేంద్రం

**జగ్గయ్యపేట, జూన్ 13, ప్రభాతవార్త :** ప్రాణాపాయస్థితిలోవున్న వారిని తక్షణమే ఆదుకునే వీలు కల్పిస్తూ ఏర్పాటుచేసిన రక్తనిల్వ కేంద్రం అటకెక్కింది. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రం (ప్రభుత్వవైద్యశాల)లోని సిబ్బందిపై ఆరోపణలు రావటంతో ఉన్నతాధికారులు వారిని రెండు వారాల క్రితం విధుల నుండి తొలగించారు. దీంతో రోగులకు అత్యవసర వైద్యసహాయం అందించే విషయంలో ప్రభుత్వ వైద్యులు నిస్సహాలవుతున్నారు. ఈసమస్యపై సిపిఐ పట్టణ కార్యదర్శి, సీనియర్ న్యాయవాది జూనెబోయిన శ్రీనివాసరావు లిఖితపూర్వకంగా ప్రభుత్వానికి ఫిర్యాదుచేసినట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు. యుద్ధప్రాతిపదికన రక్తనిల్వ కేంద్రాన్ని తిరిగి పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఇంతకు ముందు ప్రైవేట్ మార్గంలో రక్త దందాకు పాల్పడిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై ఆరోపణలు రాగా జిల్లా అధికారులు వారిని విధుల నుండి తొలగించారని, తిరిగి ఈ యూనిట్ కొనసాగేందుకు సిబ్బందిని ఏర్పాటుచేయటంలో నిర్లక్ష్యం జరుగుతోందని ఆయన విమర్శించారు. కాగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ హరీష్‌ను వివరణ కోరగా తొలగించిన ఇరువురి స్థానాలను భర్తీ చేయాల్సివుందని ప్రభుత్వానికి తాము ప్రతిపాదన పంపామని, త్వరలో ఏర్పాటుచేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. నియోజకవర్గ మూల కేంద్రమైన పట్టణంలోని ప్రభుత్వవైద్యశాలకు నిత్యం వందలాది మంది వచ్చి వైద్యం పొందుతుంటారు. అందువల్ల ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి రక్తనిల్వ కేంద్రం పనిచేసేవిధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావుతోపాటు పట్టణవాసులు కోరుతున్నారు.


సతీష్‌చంద్ర దంపతులకు దుర్గమ్మవారి జ్ఞాపిక అందిస్తున్న ఇఒ

## ప్రత్యేక ఉత్సవాలకు సన్నద్ధమవ్వండి

### : అధికారులకు ఇఒ ఆదేశం

### - మల్లేశ్వర స్వామి ఆలయంలో ఉచిత ప్రసాదం పంపిణీ

**ఇంద్రకీలాద్రి, జూన్ 13, ప్రభాతవార్త** బెజవాడ దుర్గమ్మవారిని దర్శించుకోడానికి వచ్చే భక్తుల సౌకర్యాలను రాబోయే ప్రత్యేక ఉత్సవాల్లో సక్రమంగా నిర్వహించే చర్యలు చేపట్టాలని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఇఒ వికె శీనా నాయక్ ఆదేశాలిచ్చారు. శుక్రవారం ఇఒ అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడుతూ జూన్ 24 నుండి జూలై 26 వరకు ఆషాడ మాసం సారె సమర్పణ, జూన్ 26 నుండి జూలై 4 వరకు వారాహి నవరాత్రులు (గుప్తనవరాత్రులు), జూలై 8 నుండి జూలై 10 వరకు శాకంబరి ఉత్సవాలు జరుగుతాయని ఆ ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటినుండే క్రమబద్ధమైన ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. ఆద్యాత్మికంగా, ధార్మికంగా మరింత ఉన్నతంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అభివృద్ధి పనులు జరుగుతున్న దృష్ట్యా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సంవత్సరం భక్తుల సంఖ్య పెరిగే అవకాశమున్నందున ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒ కోటేశ్వరరావు, వన్‌టౌన్ సిఐ గురుప్రకాష్ , వైదిక కమిటీ సభ్యులు వి శ్యావశ్య మహర్షి, సి హెచ్ ఆంజనేయ ఘనాపాఠి, ప్రధాన అర్చకులు ఎల్ దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, ఎఇఓలు ఎన్ రమేష్‌బాబు, బి వెంకటరెడ్డిలు పాల్గొన్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో నెలవైయున్న శ్రీ మల్లేశ్వర స్వామివార్లను దర్శించుకునే భక్తులకు ఇకపై ఉచిత ప్రసాదం అందించేలా ఇఒ చర్యలు తీసుకున్నారు. ఉచిత ప్రసాదాన్ని భక్తులకు శుక్రవారం ఇఒ అందించి ప్రారంభించారు. ఈ ఉచిత ప్రసాదాన్ని అందించడానికి విరాళాలు అందించే భక్తులు వీలైన మొత్తం దేవస్థానంలో చెల్లించాలన్నారు. దుర్గమ్మను శుక్రవారం మాజీ ఐఏఎస్ అధికారి సతీష్‌చంద్ర సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను ఇఒ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

శుక్రవారం దుర్గమ్మవారి ఆలయంలో కళావేదికపై చెన్నైకు చెందిన శ్రీ భరతకళ ఆర్ట్స్ అకాడమి ఆచార్యులు రోజా రాణి నేతృత్వంలో 25 మంది కళాకారులు కూచిపూడి నృత్యార్చనను దుర్గమ్మవారికి అర్పించారు. వారికి దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం ప్రసాదాలు అందించారు. దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న గోపురానికి స్వర్ణతాపడం చేయడానికి గాను శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన మెరుగు గోపాల్ రు.1లక్షను ఆలయ ఇఒ కోటేశ్వరరావుకు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేసిన అనంతరం ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.


నృత్యనీరాజనమందిస్తున్న కళాకారులు

## యేడాదిలో రక్తహీనత తగ్గించాలన్నదే లక్ష్యం

### - ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి



రక్తహీనత నియంత్రణపై శిక్షణా శిబిరంలో ప్రసంగిస్తున్న ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏడాదిలో రక్తహీనతను(ఎనీమియా) తగ్గించాలన్న లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తున్నామని ఎనీమియా ముక్త్ భారత్ రాష్ట్ర నోడలాఫీసర్ డాక్టర్ ఎల్‌బియస్‌హెచ్ దేవి అన్నారు సంబంధిత శాఖల అధికారులతో కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలపై రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా హాయ్ ల్యాండ్లో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ శుక్రవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వైద్యారోగ్య, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలకు చెందిన అధికారులు, జిల్లా ఇమ్మునైజేషన్ అధికారులు, డిపిహెచ్ ఎన్వోలు, ఆర్బీయస్కే పీఓలు దాదాపు 150 మంది హాజరయ్యారు. వీరినుద్దేశించి ఆమె మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎనీమియా నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ తీసుకున్న వారు వారివారి జిల్లాల్లో కింది స్థాయి వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన వారు నేర్చుకున్న విషయాలన్నీ కింది స్థాయి వారికి వివరంగా చెప్పి అవగాహన కలిగించాలన్నారు. ఎనీమియా గుర్తించడానికి క్షేత్రస్థాయిలో స్ర్కీనింగ్‌ను పూర్తి చేసి సత్వరం చికిత్స అందించేందుకు వైద్య ఆరోగ్య శాఖకు సహకరించాలని ఆమె కోరారు. రక్త హీనత ఉన్న 59 ఏళ్ల మధ్య వయసున్న వారు రోజూ ఒక మాత్ర చొప్పున రెండు నెలలపాటు, అలాగే కౌమార దశలో (1019 ఏళ్ల మధ్య వయసున్న వారు) వారు రోజుకొక మాత్ర చొప్పున మూడు నెలల పాటు కచ్చితంగా వాడాలన్నారు. రక్తహీనత లేని 59 మరియు, 1019 వయసు వారు వారానికొక మాత్ర తప్పనిసరిగా ఐరన్ మాత్ర వేసుకోవాలి. సంబంధిత ఎఎన్ఎం హిమోగ్లోబిన్ స్థాయిని పరీక్షించాలన్నారు. స్కూళ్లలో ఐరన్ మాత్రలు ప్రతి నెలా 50 శాతం పంపిణీ జరిగిన వెంటనే ఇండెంట్ పెడితే మిగతా 50 శాతం పంపిణీ చేయడానికి ముందే పంపించే ప్రయత్నం చేస్తామన్నారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో రక్తహీనత బాధితులకు చికిత్స అందించే విషయంలో ఏమాత్రం అలసత్వం జరక్కుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.రక్తహీనత లేకపోయినా గర్భిణిలు రోజుకో ఐరన్ మాత్రను 180 రోజులు తప్పకుండా వాడాలని, రక్తహీనత ఉన్నవారు రోజుకు రెండు మాత్రలు వేసుకోవాలని, హిమోగ్లోబిన్ పరీక్షను ప్రతి నెలా ఎఎన్ ఎం చేస్తారన్నారు.మధ్యస్త, తీవ్ర రక్తహీనత ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్లు ఇస్తారనీ, అవసరాన్ని బట్టి బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ కూడా చేస్తారని, ఈ కార్యక్రమాలన్నీ అమలయ్యేలా డిఐఓలు, డిపిహెచ్‌ఎన్ ఓలు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. రక్త హీనత లేని 20 నుండి 49 ఏళ్ల మధ్య వయసున్న మహిళలందరూ తప్పని సరిగా వారానికొక ఐరన్ మాత్ర వేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టెస్ట్, ట్రీట్మెంట్, టాక్(టి3) పై పెద్ద ఎత్తున ప్రచారంచేసి అవగాహన కల్పించాలన్నారు.

## వెంకటాచలంలో ఆటో బోల్తా ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు

### - బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

**వెంకటా చలం (నెల్లూరు), జూన్ 13, ప్రభాతవార్త :** వెంకటాచలం మండల పరిధిలోని సర్వేపల్లి సమీపంలోని మల్లుగుంట సంఘం వద్ద ఆటో బోల్తా పడి ఒక్కరు మృతి చెందగా ఏడు మందికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది.ఇడిమేపల్లి పంచాయతీలోని పలుకూరువారి పాళెం గ్రామానికి చెందిన మహిళలు ఆటోలు వ్యవసాయ పనులు నిమిత్తం పొట్టెంపాడు గ్రామానికి వెల్తుండగా మల్లుగుంట సంఘం రాగానే ఎదురుగా బైకు రావడంతో బైకుని తప్పించే ప్రయత్నంలో ఆటో బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఆటో లో సుమారు పది మంది ఉండగా మల్లి లక్ష్మీదేవమ్మ అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందింది మిగిలిన ఏడు మందికి గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విశయం తెలుసుకున్న వెంకటాచలం ఎస్సై ఆంజినేయులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి గాయాలుతో ఉన్న మహిళలను వైద్య పరీక్షలు నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడిన విశయం తెలుసుకున్న సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అటాహుటిన నెల్లూరు ఆసుపత్రికి చేరుకున్నారు.చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పి మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.అనంతరం మృతి చెందిన మల్లి లక్ష్మీదేవమ్మ మృతు దేహం వద్దకు వెళ్లి నివాళులర్పించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు.కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని పార్టీ పూర్తిగా అండగా ఉంటుమాని తెలిపారు.ఈ కార్యక్రమాలు ఇడిమేపల్లి నీటి సంఘ అధ్యక్షులు ఏలూరు కృష్ణ రెడ్డి మాజీ సర్పంచ్ మాజీ సీనయ్య ఏడుకొండలు పెద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.



## మానసికంగా ఆనాడే చచ్చిపోయా

### - మాజీ మంత్రి పేర్ని నాని సంచలన వ్యాఖ్యలు



**'విజయవాడ, జూన్13, ప్రభాత వార్తప్రతి నిధి:**రేషన్ బియ్యం' కేసులో తన అక్రమంగా ఇరికించిన రోజే మానసికంగా చనిపోయానని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య(నాని) సంచలన వ్యాఖ్యలు చేసారు.ఈ కేసులో తన భార్యను తీసుకుని 15 రోజులు రోజుకొక చోట దాక్కుంటూ తిరిగాను, ఆ రోజే నేను మానసికంగా చచ్చిపోయాను. అదృష్టవశాత్తూ బెయిలు వచ్చింది. అయినా వదలకుండా నా భార్యను విచారించారు' అని పేర్ని నాని ఆవేదన వ్యక్తం చేసారు,.పోలీసుల తీరుపై ఆయన అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అక్రమ రేషన్ బియ్యం కేసులో కొన్ని నెలల కిందట పేర్ని నాని భార్యను పోలీసులు విచారించారు. నకిలీ పట్టాల వివాదంలో పేర్ని నానిని అరెస్ట్ చేస్తారనే ప్రచారం నేపథ్యంలో ఆయన ముందస్తుగా ఏపీ ఉన్నత న్యాయస్దానాన్ని ఆశ్రయించారు.ఈ కేసులో తానేమీ భయపడలేదన్నారు.అయితే ప్రభుత్వంలో కొందరు మంత్రులు తప్పుడు కేసుల పెట్టమని ఆదేశించడం,పోలీసులు అత్యుత్సాహం చూపించడం రివాజుగా మారినందునే న్యాయస్దానాన్ని ఆశ్రయించానన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా తనను అరెస్ట్ ఎలా చేస్తారన్నారు.ఎవో ప్రచారాలు చేస్తున్నారు.చేయనివ్వండి, న్యాయస్దానం ఉంది,చట్టం ఉందన్నారు.

## హైకోర్టు భవన ప్రాంగణంలో వీధి దీపాలు, హైమాస్ట్ లైట్ల మరమ్మతులకు టెండర్లు

**విజయవాడ జూన్ 13 ప్రభాతవార్త ప్రతినిధి:** నేలపాడులోని ఏపీ హైకోర్టు భవనం ప్రాంగణంలో ఉన్న వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లకు కొన్ని విద్యుత్ మరమ్మతులు అందించేందుకు రూ.16,60,000 అంచనాతో టెండర్లు. ఈ నెల 21 వ తేదీ వరకు దాఖ లు చేసుకునే అవకాశం. జియో డేటా తయారీ కోసం టెండర్ పిలిచిన ప్రభుత్వంవరల్డ్ క్లాస్ అమరావతి నిర్మాణంలో భాగంగా జియో డేటా తయారీ కోసం టెండర్ పిలిచిన ప్రభుత్వం. అమరావతి నగర పరిధిలో ప్రతి ఆస్తికి, భూమికి ఇంటికి నంబర్లు ఇవ్వనుంది. యూనిక్ ల్యాండ్ పార్సిల్ ఐడెంటిఫికేషన్ నంబర్, యూనిక్ ప్రాపర్టీ ఐడెంటిఫికేషన్ నంబర్, డిజిటల్ డోర్ నంబర్ ఇవ్వనుంది. డిజాస్టర్ రెస్క్యూ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటుకు ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు అమరావతి రాజధాని నగరంలో వరదలు, విపత్తులు నివారణకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 100 ఏళ్ల రికార్డ్ ఆధారంగా ముంపు, ఇతర ప్రకృతి విపత్తుల నివారణ కోసం డిజాస్టర్ రెస్క్యూ మేనేజ్మెంట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం కాలువలు, రిజర్వాయర్ల వెంట ముందస్తు నివారణ కోసం సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం సి ఆర్ డి ఏ ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లు ఆహ్వానించింది.

## కృష్ణా జలాల బకాయిలు రూ.153 కోట్లు చెల్లించండి

### - తమినాడును కోరిన ఎపి

**విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జలాల సరఫరాకు సంబంధించిన తమిళనాడు ప్రభుత్వం ఏపీకి బారీగా బకాయిపడింది..చెన్నై మంచి నీటి అవసరాలు తీర్చేలా అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు నేతృత్వంతో 1983లో ఒప్పందం కుదిరింది.ఈ మేరకు తెలుగు గంగ ప్రాజెక్ట్ ద్వారా ఏటా రెండు విడతలుగా 12 టీఎంసీల కృష్ణా జలాలను ఏపీ తమిళనాడుకు అందిస్తోంది. ఆ ప్రకారం తమిళనాడు 2023 మార్చి వరకు రూ.1385 కోట్లు చెల్లించాలని, అందులో రూ.1232 కోట్లు ఇదివరకే ఇచ్చిందని, ఇంకా రూ.153 కోట్లు ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం చెబుతున్నట్లు సమాచారం. అయితే బకాయి అంత ఉండదని తమిళనాడు అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా నీటి లెక్కలను ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ పరిశీలిస్తున్నట్లు సమాచారం.ఈ బకాయిలు రూ.153 కోట్లు ఇవ్వాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ కోరింది. ఈ నేపథ్యంలో కృష్ణా నీటి లెక్కలను తమిళనాడు ఆర్థిక శాఖ పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

## ఎయిరిండియా బోయింగ్‌ల తనిఖీలు పెంచాలి: డిజిసిఎ

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787/8/9 డ్రీమ్‌లైనర్ విమానాల భద్రతా తనిఖీని పెంచాలని పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ఆదేశించింది. టాటా గ్రూప్ యాజమాన్యంలోని ఎయిర్ ఇండియా నిర్వ హించే బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాల్లోని పలు వ్యవస్థలను ఎప్పటికప్పుడు చెక్ చేయాలని, టేకాఫ్ నిబంధనలను సమీక్షించాలని సూచిం చింది. క్యాబిన్ ఎయిర్ కంప్రెసర్, అనుబంధ వ్యవస్థల తనిఖీ, ఎలక్ట్రానిక్ ఇంజిన్ కంట్రోల్ సిస్టమ్ టెస్ట్, ఇంజిన్ ఇంధనంతో నడిచే యాక్చుయేటర్ ,ఆపరేషనల్ టెస్ట్, ఆయిల్ సిస్టమ్ తనిఖీలను చేపట్టాలని డీజీసీఏ శుక్రవారం ఆదేశించింది. ఎలక్ట్రానిక్ ఇంజిన్ నియంత్రణ వ్యవస్థ, హైడ్రాలిక్ వ్యవస్థ, టేకాఫ్ ప్రమాణాల స్నింటినీ పరిశీలించాలని సూచించింది. కాగా, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కూలిన ప్రమాదంలో అందులోని ప్రయాణికులు, సిబ్బం దితో సహా 241 మంది మరణించారు. ఈ నేపథ్యంలో బోయింగ్ డ్రీమ్ లైనర్ 787 8 విమానాల గ్రౌండింగ్ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలి స్తున్నది. పాత కాలం నాటి బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878/9 విమా నాలను నిలిపివేసే విషయంలో భారత్, అమెరికా ఏజెన్సీల మధ్య చర్చలు జరుగుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. అయితే ఎయిర్ ఇండియా విమానాల నిర్వహణ, ఆపరేటింగ్ విధానాలను కూడా లోతుగా పరిశీలించిన తర్వాతే బోయింగ్ డ్రీమ్‌లైనర్ 7878 విమానాల గ్రౌండింగ్‌పై తుది నిర్ణయం తీసు కునే అవకాశమున్నట్లు వివరించాయి.

## అర్హత కలిగి తల్లికి వందనం పథకం అందకపోతే వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయండి: ప్రభుత్వం

విజయవాడ,జూన్13,ప్రభాతవార్తప్రతినిధి: అర్హత కలిగి తల్లికి వందనం పథకం అందకపోతే గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిర్యాదు చేయొచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు 15 వేల మేర లబ్ధి చేకూరుస్తూ తల్లికి వందనం పథకం ఉత్తర్వులు జారీ చేసింది. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా ఎంతమంది ఉంటే అంతమందికి పథకం వర్తిస్తుందని వెల్లడించింది. తల్లికి వందనం పథకం మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ విడివిడిగా జారీ చేశారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఒకటో తరగతి, ఇంటర్ మొదటి ఏడాదిలో చేరే విద్యార్థులకు జులై 5వ తేదీన తల్లికి వందనం నిధులు జమ చేయనున్నారు. ప్రవేశాల వివరాలు వచ్చేందుకు కొంత సమయం పడుతున్నందున వీరికి తర్వాత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2025 - 26 విద్యా సంవత్సం ప్రామాణికంగా పథకాన్ని వర్తింపజేస్తుంది. అర్హుల నిబంధనలకు సంబంధించి గత ప్రభుత్వం అమలు చేసిన వాటినే కూటమి ప్రభుత్వం కొనసాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ ఆదాయం నెలకు 10 వేలు, పట్టణ ప్రాంతాల్లో 12 వేలు మించకూడదు. రేషన్ కార్డు ఉండాలి. కుటుంబానికి మగాణి 3 ఎకరాల్లోపు, మెట్ట 10 ఎకరాల్లోపు లేదా రెండూ కలిపి పది ఎకరాల్లోపు ఉండాలి. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా నాలుగు చక్రాల వాహనం ఉంటే పథకం వర్తించదు. ట్యాక్సీలు, ట్రాక్టర్లు, ఆటోలకు మినహాయింపు ఉంటుంది. విద్యార్థి డేటాబేస్‌లో ఉండి, తల్లి లేకపోతే క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి మ్యాపింగ్ చేస్తారు. విద్యార్థులు ఒకటి నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు గుర్తింపు పొందిన పాఠశాలలు, జూనియర్ కళాశాలలో చదువుతూ ఉండాలి. ఐటీఐ, పాలిటెక్నిక్, ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఇది వర్తించదు. విద్యార్థి కనీసం 75 శాతం హాజరు కలిగి ఉండాలి. అర్హత ధ్రువీకరణ పూర్తయిన అనంతరం గ్రామ, వార్డు సచివాలయాల విభాగం, సంక్షేమ, ఆర్థిక శాఖలు కలిసి సమన్వయంతో నిధుల బదిలీ ప్రక్రియ అమలు చేస్తాయి. విద్యాహక్కు చట్టం కింద ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు మేరకు సమగ్ర శిక్షా అభియాన్ నోడల్ ఖాతా ద్వారా ఆయా పాఠశాలకు నేరుగా చెల్లిస్తారు.

ఫీజు చెల్లింపు మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ ఉపకార వేతనాలు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఆ మొత్తాన్ని మినహాయించి మిగిలిన మొత్తాన్ని తల్లికి వందనం కింద చెల్లిస్తారు. సామాజిక ఆడిట్ కోసం లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయంలో ప్రదర్శిస్తారు. అర్హత ఉండి ఎవరినైనా అనర్హులుగా తిరస్కరిస్తే గ్రామ, వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యావ్యవస్థ సమగ్రాభివృద్ధి కోసం 2 వేల రూపాయలు మినహాయించి మిగతా 13 వేలు జమ చేయనుంది.

## కృష్ణయ్య! బిసి సంఘాల నాయకుడివా? బిజెపి లీడర్‌వా?

### బిజెపి ఆఫీస్ ముందు ధర్నా చేపట్టాలి : ఈరవత్రి అనిల్

**హైదరాబాద్,జూన్ 13, ప్రభాతవార్త:** గాంధీ భవన్ ముందు ధర్నా చేయడం కాదు,బీజేపీ ఆపిస్ ముందు ధర్నా చేయాలని ఆర్ కృష్ణయ్య బిసి సంఘాల నాయకు డుగా మాట్లాడుతుండా లేక బీజేపీ నాయకుడిగా మాట్లాడుతున్నడో చెప్పాలని మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. గాంధీభవన్‌లో విలేఖరులతో శుక్రవారం మాట్లాడుతూ 74 యేళ్ల నుండి ఇప్పటి వరకు దేశంలో కులగణన చేయలేదని రాహుల్‌గాంధీ ఒత్తిడి తోనే కులగణన జరుగుతోందని ఆయన అన్నారు. బిసిలకోసం పోరాడుతున్న రాహుల్ గాంధీని విమర్శించడం కృష్ణయ్యకు తగదని అన్నారు. రేవంత్ రెడ్డి 42 శాతం బిసిలకు రిజర్వేషన్ కల్పించినందుకు కృషిచేస్తుంటే కృష్ణయ్యకు కంటగింపుగా ఉందని ఆవేదన చెందారు. ట్రిపుల్ టెస్ట్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ వేసి కులగణన పై సర్వే చేసిందని అన్నారు.ఆర్ కృష్ణయ్య కు రాజ్యసభ సీటు వస్తే సరిపోద్దా?బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు.

## రఘువంశీ హత్యకు మూడుసార్లు విఫలయత్నం!

**షిల్లాంగ్, జూన్ 13:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హనీమూన్ హత్య కేసులో రోజుకో షాకింగ్ విషయం వెలుగుచూస్తోంది. తాజాగా, నిందితురాలు సోనమ్, ఆమె నియమించుకున్న హంతకులు భర్త రాజా రఘువంశీని అంత మొందించేందుకు మూడుసార్లు విఫలయత్నం చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఎస్పీ వివేక్ సియామ్ ఈ వివరాలను స్వయంగా తెలిపారు. నాలు గో ప్రయత్నంలో హంతకులు తమ ప్లాన్‌ను విజయవంతంగా అమలుచేసి రాజా రఘువంశీని దారుణంగా హత్య చేశారని ఆయన తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హంతకులు రాజా రఘువంశీని హత్య చేయడానికి అనేక ప్రణాళికలు రచిం చారు. తొలిసారిగా గువా హటిలో హత్యచేసి, మృత దేహాన్ని ఎక్కడైనా పడేయాలని పథకం వేశారు. అయితే, కొన్ని కారణాల వల్ల ఆ ప్లాన్ వాయిదా పడింది. ఆ తర్వాత మేఘాలయలోని సోహ్రా ప్రాంతంలో రెండుసార్లు హత్యకు ప్రయత్నించినా అవి కూడా విఫలమయ్యాయి. మొదట నంగ్రిట్ వద్ద హత్య చేసి, మృతదేహాన్ని పార వేసేందుకు అనువైన ప్రదేశం దొరకకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విర మించుకున్నారు. అనంతరం మవ్లాఖియట్, వెయిసావ్‌డోంగ్ వద్ద కూడా ప్రయత్నించారు.

రఘువంశీ వాష్ రూమ్‌కు వెళ్లినప్పుడు హత్య చేయా లనుకున్నా అది కూడా సాధ్యపడలేదు. చివరకు, వెయిసావ్‌డోంగ్ జలపాతం వద్ద రఘువంశీపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశారని ఎస్పీ వివరించారు. సోనమ్, రఘువంశీల వివాహం మే 11న జరిగింది. వివాహం అనంతరం ఈ జంట గువాహటిలోని కామాఖ్య అమ్మవారి ఆలయంలో పూజలు చేసేం దుకు వెళ్లారు. అయితే, హంతకులు మే 19వ తేదీనే గువాహటి చేరుకుని సిద్ధంగా ఉన్నారు. అక్కడి నుంచి సోనమ్ షిల్లాంగ్, సోహ్రా వెళ్లాలని నిర్ణ యించుకోవడంతో, హంతకులు గువహటిలో తమ ప్రణాళికను రద్దు చేసు కుని, ఆమెను అనుసరించినట్లు ఎస్పీ తెలిపారు.

## దమ్ముంటే లై డిటెక్టర్ టెస్టుకు రా: సిఎంకు కెటిఆర్ సవాల్

### ప్రభుత్వం నడపలేక ప్రజల దృష్టి మరల్చేందుకే ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 13:** ఫార్ములాఈ కేసులో తనకు ఏసీబీ నుంచి నోటీసులు అందాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దమ్ముంటే ఇద్దరం కలిసి లై డిటెక్టర్ పరీక్షకు హాజరవుదామని సవాల్ విసిరారు. ప్రభుత్వం నడపడం చేతకాక, ప్రజల దృష్టిని మరల్చేందుకు కాంగ్రెస్ పార్టీ సర్కస్‌లు చేస్తోందని ఆయన ఆరోపించారు.

ఫార్ములాఈ కేసులో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనను ఆదేశించిందని కేటీఆర్ తెలిపారు. ఈ కేసులో రూ. 44 కోట్లు బ్యాంకు నుంచి బ్యాంకుకు బదిలీ అయ్యాయని, ఆ మొత్తం ఫార్ములాఈ సంస్థ ఖాతాలోనే భద్రంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

చట్టాన్ని గౌరవించే పౌరుడిగా తాను సోమవారం ఏసీబీ అధికారుల ముందు హాజరై, దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశిస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పదేళ్ల క్రితం నల్ల సంచి నిండా డబ్బులతో దొరికిపోయిన వ్యక్తి ఎవరో ఎవరైనా గుర్తు చేయగలరా?" అంటూ పరోక్షంగా ఓటుకు నోటు కేసును ప్రస్తావించారు. "మిస్టర్ రేవంత్ రెడ్డి, మనమిద్దరం ఏసీబీ దర్యాప్తును ఎదుర్కొంటున్నాం కదా. అలాంటప్పుడు ఒక న్యాయమూర్తి సమక్షంలో ఇద్దరం లై డిటెక్టర్ పరీక్ష తీసుకుందాం. దానిని టీవీలో ప్రత్యక్ష ప్రసారం చేద్దాం. తెలంగాణ ప్రజలే ఎవరు దోషో నిర్ణయిస్తారు.

నాతో పాటు ఈ పరీక్షకు వచ్చే ధైర్యం మీకుందా?" అని కేటీఆర్ సవాల్ విసిరారు. రాష్ట్రం దివాలా తీసిందని ప్రతిరోజూ చెబుతున్న మీరు, పదేపదే విచారణలు, ప్రచారాలతో ప్రజాధనాన్ని ఎందుకు వృథా చేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. "ప్రభుత్వం నడపడం చేతకాకపోతే, ప్రజలను సర్కస్‌లు, ఇతర పరధ్యానాలతో బిజీగా ఉంచుతారు! కాంగ్రెస్, వారి ముఖ్యమంత్రి చేసే విన్యాసాలు మమ్మల్ని నిరోధించలేవు" అని కేటీఆర్ తీవ్రంగా వ్యాఖ్యానించారు.

ఫార్ములాఈ కారు రేస్ లాంటి అంతర్జాతీయ ఈవెంట్ ద్వారా హైదరాబాద్ కీర్తిని పెంచే ప్రయత్నం చేస్తే, దానిపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిధులన్నీ పక్కాగా ఖాతాలోనే ఉన్నప్పుడు, ఈ విచారణల పేరిట రాద్ధాంతం ఎందుకని ఆయన నిలదీశారు.


## ప్రశాంతంగా ముగిసిన బార్ల డ్రా

### ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** బార్ల దరఖాస్తుదారుల సమక్షంలో ప్రశాంతంగా డ్రా ప్రక్రియ ముగిసిందని, ఈ కార్యక్రమానికి సహకరించిన దరఖాస్తుదారులకు, ఎక్సైజ్ అధికారులందరికీ ధన్యవాదాలు, డ్రాలో గెలు పొందిన లబ్ధిదారులకు కమిషనర్ హరికిరణ్ అభినందనలు తెలిపారు. శనివారం గోల్కొండ నార్సింగ్ ప్రాంతంలో ది అడ్రస్ కన్వెన్షన్స్ అండ్ ఎగ్జిబిషన్ హాల్లో జిహెచ్ఎంసి పరిధిలోని 24 బార్లకు 3,525 దరఖాస్తులు వచినట్లు చెప్పారు.దరఖాస్తుదారుల సమక్షంలో కమిషనర్ డ్రా తీశారు.డ్రా బాక్స్‌లోని కమిషనర్ కాయిన్స్ తీసి ఇవ్వగా జాయింట్ కమిషనర్ కే ఏ బి శాస్త్రి నెంబర్ దరఖాస్తుదారుల సమక్షంలో వెల్లడించారు.డ్రాలో బార్ షాప్ గెలుపొందిన లబ్ధిదారులు లబ్ధిదారులు అలాట్ మెంట్ లెటర్‌ని తీసుకొని వెళ్లాలన్నారు.90 రోజుల్లోగా బార్ల ప్రక్రియను పూర్తి చేసుకుని నడిపించుకోవాల్సిందిగా కోరారు.హైదరాబాద్ రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్లు పి. దశరథ్, కే ఏ బి శాస్త్రి, అసిస్టెంట్ కమిషనర్ ఆర్ కిషన్ అనిల్ కుమార్ ఒడ్డిలతోపాటు హైదరాబాద్ రంగారెడ్డిలోని అన్ని డివిజన్‌లలో అదికారులకు పేరుపేరునా కమిషనర్ అభినందనలు తెలిపారు.బాక్సులోకాయిన్స్ తీసిన జీవన్‌కిరణ్‌ను కమిషనర్ అభినందించారు. జిహెచ్ఎంసితోపాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్ జాల్‌పల్లి ప్రాంతాల్లో డ్రా ప్రశాంతంగా ముగిసిందని కమిషనర్ వెల్లడించారు.అంతకు ముందు అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళర్పించారు.

## పిసిసి చీఫ్ మహేష్‌తో గనుల శాఖ మంత్రి వివేక్ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ మైనింగ్,లేబర్ మంత్రి గడ్డం వివేక్ శుక్రవారం గాంధీభవన్‌లో టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను



మర్యాదపూర్వకంగా కలిశారు. గడ్డం వివేక్ మంత్రిగా తొలిసారి గాంధీభవన్‌కు రావడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు, ఆయన ఇతర అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి ఆయనకు పుష్ప గుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. మధ్యాహ్నం రెండున్నరగంటలకు ఆయన రాగా అభిమానులు ఆయనకు అభివాదం చేశారు. టిపిసిసిచీఫ్ మహేష్‌కుమార్ వద్దకు వెళ్ళి ఆయనకు కృతజ్ఞతులు తెలిపారు. అనంతరం సుమారు అర్ధగంటపాటు వారు ఏకాంతంగా చర్చలు జరిపారు.

## సిపిఐ నారాయణతో మందకృష్ణ మాదిగ భేటీ

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శుక్రవారం ఉదయం తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణ .. పద్మశ్రీ అవార్డ్‌ను వరించినందుకు మంద కృష్ణ మాదిగను ప్రత్యేకంగా అభినందించారు. పద్మశ్రీ అవార్డు పట్ల గతంలో భిన్నమైన అభిప్రాయం ఉండేదని.. కానీ పద్మశ్రీ అవార్డును మందకృష్ణకు ఇవ్వడం వల్ల ఆ అవార్డుకే గౌరవం వచ్చిందన్నారు. ఇదే విషయాన్ని గతంలో మీడియా ముందు కూడా మాట్లాడినట్లు గుర్తు చేశారు. నమ్మిన ఆశయం కోసం, ఎత్తుకున్న ఎజెండా కోసం మూడు దశాబ్దాలపాటు అలుపెరగని పోరాట ఫలితమే ఈ పద్మశ్రీ అవార్డ్ అని నారాయణ కొనియాడారు. సుమారు గంటసేపు ఎస్సీ వర్గీకరణ, చట్టసభల్లో బిసిల రిజర్వేషన్లు, కులగణన మొదలైన అంశాల గురించి ఇరువురు చర్చించారు. ప్రస్తుతం దేశంలో క్లిష్ట పరిస్థితులు ఉన్న నేపథ్యంలో ఐక్య ఉద్యమాలు నిర్వహించాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక వాదులపై ఉన్నదని గుర్తు చేసుకున్నారు. చిన్నచిన్న అంశాలను పక్కన పెట్టి, భిన్నాభిప్రాయాలను గౌరవిస్తూనే విశాల ప్రజా ఆకాంక్షల మేరకు కలిసి పనిచేయాల్సిన అవసరముందని నారాయణ మందకృష్ణ మాదిగతో అన్నారు.




సౌదీ నుంచి తన భర్తను రప్పించాలంటూ సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తున్న అలేఖ్య.

## సౌదీ నుంచి నా భర్తను ఇండియాకు రప్పించండి

### బాధితుడి భార్య సిఎం ప్రజావాణిలో ఫిర్యాదు

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** ఉపాధికోసం సౌదీ అరేబియాకు వెళ్లిన తన భర్త తో డ్రైవర్ ఉద్యోగానికి బదులు వ్యవసాయ పనులు చేయిస్తూ ఇబ్బంది పెడుతున్నారని,వెంటనే తన భర్తను ఇండియాకు రప్పించాలంటూ అతని భార్య గుడిసె అలేఖ్య శుక్రవారం సీఎం ప్రజాభవన్‌లోని ప్రవాసీ ప్రజావాణీలో సీఎం రేవంత్‌రెడ్డి పేరుతో ఒక వినతి పత్రం అందజేసారు.భద్రాద్రి కొత్తగూడెం ఇల్లెందు కు చెందిన గుడిసె యాకూబ్‌ను ఏజెంటు డ్రైవర్ పని ఇప్పిస్తానంటూ నమ్మించి సౌదీలోని దమ్మాంకు పంపించాడని, అయితే అక్కడ తన భర్తతో వ్యవసాయ పనులు చేయిస్తున్నాడని, వెంటనే తన భర్తను సౌదీ నుంచి ఇండియాకు రప్పించాలంటూ ఆమె ఫిర్యాదులో విజ్ఞప్తి చేసింది.తెలంగాణా ప్రభుత్వ నియమిత ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ డా.బిఎం వినోద్‌కుమార్,వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డిలకు ఆమె తన గోడు వెళ్లబోసుకుంది.యాకూబ్‌ను ఎక్కువ గంటలు పనిచేయిస్తున్నారని,సరైన తిండి పెట్టడంలేదని ఆమె వివరించారు.వారు ముందుగా చెప్పిన ప్రకారం డ్రైవర్ పని ఇప్పించాలని,లేకుంటే ఇండియాకు తిరిగి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరింది.

## సిజిఎఫ్ నిధులు పారదర్శకంగా వినియోగించాలి

### టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి : మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్ జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా టెంపుల్ టూరిజాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలని దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎండోమెంటు డిపార్టుమెంటు అధికారులు ప్రధానంగా ఈ అంశంపైనే దృష్టి పెట్టాల్సిన అనివార్యత ఉందని మంత్రి ఉద్ఘాటించారు. ఈ విషయంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇక ఆషాఢ బోనాలు ఈ దఫా వరంగల్ భద్రాకాళి టెంపుల్‌లో ఘనంగా నిర్వహించాలని నిర్ణయిం చినట్టు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పండగను,సంస్కృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే తమ ఉద్దేశమన్నారు. మన రాష్ట్ర ప్రజలను ధార్మిక చింతన వైపు తీసుకెళ్లడంలో తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తుందని చెప్పారు. దేవాలయాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సీజీఎఫ్ నిధులను పారదర్శకంగా వినియోగించాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఎండోమెంటు డిపార్టుమెంటు సిజిఎఫ్ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చిన్న చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి ఈఓలు, ఆ శాఖ ఉన్నతాధికారుల కృషి అనివార్యమ న్నారు. సిజిఎఫ్‌లో భాగంగా,చిన్న దేవాలయాల అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులపై మంత్రి సురేఖకు అధికారులు వివరించారు. బడ్జెట్ అనుమతులు, సిజిఎఫ్ నిధుల కోసం వచ్చిన విజ్ఞప్తుల మీద అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. శుక్రవారం జరిగిన సిజిఎఫ్ సమావేశంలోరూ. 72.47 కోట్ల విలువైన, మొత్తం 297 పనులకు ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఈఓ పాటించాల న్నారు.సిజిఎఫ్ పనులపై క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యంన సరికాదన్నారు.సిజిఎఫ్ పనుల మీద రెండు రెండుసార్లు పనుల ప్రతిపాదనలు పంపవద్ద న్నారు. స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి ఎస్టిమేషన్స్ ఎంత వేస్తే అంత తమకు పంపకూడదని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సరైన విధంగా అంచనాలు వేయాలన్నారు. జిల్లాలోని 3ప్రధాన ఆలయాలను కలిపి ఒక సర్క్యూట్‌గాప్రణా ళికలను రూపొంది వెళ్తున్నామన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ వెంకట్‌రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, ఇతర ఉన్న తాధికారులు, ఇఒలు, సిజిఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని సర్వనాశనం చేసిన బిఆర్ఎస్

### చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆ పార్టీ అవసరం లేదని తేల్చడంతోపాటు తిరస్కరించారని, ప్రజలు తిరస్కరించిన పార్టీపైన వేధింపులకు దిగాల్సిన అవసరం తమకు లేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. సిఎల్‌పి మీడియా హాల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ హయాంలోనే తెలంగాణలో ప్రభుత్వ విద్యారంగం సర్వనాశనం అయిందని ఆవేదన చెందారు. బిఆర్ ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కొత్తగా విద్యా రంగం రుజాగ్రస్తం అయినట్లు కాకమ్మ కబుర్లు చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. ఆరు నెలలు సావాసం చేస్తే వారు వీరు అవుతారన్నట్లుగా, కెటిఆర్ వెంట తిరిగి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆబద్దాలు నేర్చుకున్నాడని దుయ్యబట్టారు. గురుకులాల కార్యదర్శిగా 8 యేళ్ల పాటు పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విద్యారంగాన్ని ఏం ఉద్ధరించాడని సత్యం ప్రశ్నించారు. మా ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకోకుండానే విద్యారంగాన్ని ప్రక్షాళనకు ప్రయత్నం చేస్తున్నదని, నాణ్యమైన విద్య అందించే విషయంలో రేవంత్ సర్కార్ చేస్తున్న కృషిని చూసి ఆర్ఎస్ ప్రవీణ్ ఆత్మవిమర్శ చేసు కోవాలని హితవు చెప్పారు. బిఆర్ఎస్ హయాంలో అస్తవ్యస్తంగా గురుకులాలను ఏర్పాటు చేశారని గురుకులాలకు అద్దె కూడా చెల్లించనప్పుడు కేసీఆర్‌ను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు నిలదీయలేదని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల పాటు ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకపోయినా ఆర్ఎస్ మాట్లాడలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖ ను పర్యవేక్షి స్తున్నారు,

కొత్తగా ఉపాధ్యాయ నియా మకాలు చేపట్టాం, బదలీలు, ప్రమోషన్లు ఇచ్చాం ఒక్క యేడాదిలో 60 వేల ఉద్యోగాలను భర్తీ చేసి మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది మా ప్రభుత్వం మాత్రమే అని ఆయన అన్నారు. బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచింది మా ప్రభుత్వమే అని ఆయన అన్నారు. బిఆర్ఎస్ హయాంలో విద్యా రంగం సర్వనాశనం అయిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గానికి ఒక స్కూల్‌లో పథకం ప్రారంభించి చివరకు ఆ నిధులను కూడా పెండింగ్ లో పెట్టి పోయాడని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ ను ప్రయోగాత్మకంగా ప్రభుత్వం ప్రారంభించిందని, రూ.200తో ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ ను దేశంలో రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి మా ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతున్నాడని వివరించారు. విద్యారంగంపై గోబెల్స్ ప్రచారం చేయడం కోసం ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను కేసీఆర్, కేటీఆర్ ముందు పెడుతున్నారని అన్నారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్ విచారణకు హాజరు కావాల్సిందే అని అన్నారు,. అమెరికా పర్యటన ను సాకుగా చూపించి గతంలో విచారణకు హాజరు కాలేదని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్ అడ్డంగా దొరికిపోయాడని ప్రకటించారు.

## రేవంత్‌రెడ్డి కక్ష సాధించాలనుకుంటే జైలుకెళ్లేవారు

### బిఆర్ఎస్ నేతలపై పిసిసి ప్రధానకార్యదర్శి గజ్జెల కాంతం వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు చేస్తే ఇప్పటికే కెటిఆర్, కెసిఆర్, హరీశ్‌రావు, కవితలు చర్లపల్లి జైల్లో ఊచలు లెక్కించేవారని, మీ అవినీతిపైపూర్తి విచారణ చేసి మిమ్ముల్ని తీహార్ జైలుకు పంపుతారని పిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ ఇంకోసారి సిఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే మీ ఇంటిని ముట్టడి చేస్తామని హెచ్చ రించారు. కాంగ్రెస్‌పై నోరు పారేసుకొంటే ప్రజలు కెసిఆర్ కుటుంబాన్ని తెలంగాణ నుండి తరిమికొడతారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందనే కెసిఆర్ ను విచారణ కు పిలిచారు. అవినీతి జరిగితే ముఖ్యమంత్రి అయినా, ప్రధాని అయినా విచారిస్తారు. ప్రాజెక్టుల పేరు మీద మీరు అవినీతి చేసింది నిజం కాదా? ఇప్పుడు మీ ఆస్తులు మూడు లక్షల కోట్లు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు లో అవినీతి జరిగిందనే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ కు అధికారం ఇచ్చారు. ప్రాజెక్టులో చీఫ్ ఇంజనీర్లు, అధికారులను కూడా విచారణ చేశారని గుర్తుచేశారు. తర్వాత ఈటెల రాజేందర్, హరీష్ రావు,కెసిఆర్ ను విచారిస్తే కెటిఆర్ కు ఎందుకు అంత ఇబ్బంది అని ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ తప్పించుకోవాలని చూడొద్దు,తప్పు చేస్తే జైలుకు పోవడం ఖాయం అని ఆయన అన్నారు. అవినీతి చేసి రాష్ట్రం ఆగం అయినా విచారణ చేయొద్దా?ప్రాజెక్టు ఏమైనా మీ అబ్బ సొత్తా కెటిఆర్ అనిఆయన నిలదీశారు. హైదరాబాద్ చుట్టూ 30 వేల ఎకరాలు మీకు ఎక్కడి నుండి వచ్చాయి అని ఆయన ప్రశ్నించారు. కేటిఆర్ తాగుబోతోడు, తెలంగాణ ను దోచుకున్నోడు కేసీఆర్ జాతిపిత ఎట్లా అయితడు జాతిపిత కేవలం మహాత్మాగాంధీ మాత్రమే అని ఆయన అన్నారు. టిపిసిసి జనరల్ సెక్రటరీ అవకాశం కల్పించిన మల్లి ఖార్జున ఖర్గే,రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు, వేం నరేందర్ రెడ్డి లకు నాయకులందరికి అధిష్టానానికి రుణపడి ఉంటా అని గజ్జెల కాంతం అన్నారు.

## 18 నుంచి సిపిజెట్-2025 దరఖాస్తుల స్వీకరణ

### జూలై 17 తుది గడువు.. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే తెలంగాణ కామన్ పిజి ఎంట్రన్స్ టెస్ట్(టిజిసిపిజిఈటి)-2025 దరఖాస్తులను ఈ నెల 18 నుంచి స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శుక్రవారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ ఉప కులపతి(విసి) ప్రొఫెసర్ ఎం కుమార్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తోపాటు శాతవాహన యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ యు ఉమేష్ కుమార్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ ఇన్‌ఛార్జ్ విసి ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, సిపిజిఈటి-2025 కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి పాల్గొన్నారు. పిజి కోర్సులైన ఎంఏ, ఎంఎస్సీ, ఎంకామ్, ఎంఈడి, ఎంపిఈడి వంటి పోస్ట్‌గ్రాడ్యుయేట్ (పిజి) ప్రోగ్రామ్‌లతోపాటు 5 సంవత్స రాల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సిపిజెట్ పరీక్షను నిర్వహించనున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శాతవాహన విశ్వ విద్యాలయం, తెలంగాణ విశ్వ విద్యాలయం, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, పాలమూరు విశ్వవిద్యాలయం, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యా లయం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) లో ప్రవేశాల కోసం సిపిజెట్‌ను నిర్వహించ నున్నారు. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. జులై 17 వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తులను స్వీకరించనున్నారు. రూ. 500 అపరాధ రుసుంతో జులై 24 వరకు, రూ. 2000తో జులై 28 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్టు తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో పరీక్షలను నిర్వహించనున్నారు. రాష్ట్రంలో 297 కాలేజీల్లో సుమారు 50వేల సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. మొత్తం 51 సబ్జెక్టులలో 108 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పరీక్ష ఫీజు జనరల్ వారికి రూ. 800 కాగా.. ఎస్సీ, ఎస్టీలకు రూ. 600గా నిర్ణయించారు. అదనపు సబ్జెక్టుకి రూ. 450 చెల్లించాల్సి ఉం టుంది. గత ఏడాది 46,742 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 21,560 సీట్లు భర్తీ అయినట్టు తెలిపారు. ఈ ఏడాది అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 4వేల సీట్లు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో సుమారు 50వేల సీట్లలో ప్రవేశాలను చేపట్టను న్నారు. త్వరలోనే ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీకి అనుమతి వస్తే అందులో కూడా అడ్మిషన్లను చేపట్టనున్నట్టు ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్ కుమార్ తెలిపారు.

## బిసి అభ్యర్థులకు సివిల్ సర్వీస్ లాంగ్‌టర్మ్ తరగతులు

### జూలై 25 నుంచి ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** సివిల్స్-2026కి ప్రిపేర్ అవుతున్న బిసి అభ్యర్థులకు తెలంగాణ బిసి స్టడి సర్కిల్ అధ్వర్యంలో ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన తరగతులను జులై 25 నుంచి ప్రారంభించనున్నట్టు బిసి స్టడి సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యం సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ (ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్) కోచింగ్ తరగతులను ఇవ్వనున్నట్టు డైరెక్టర్ తెలిపారు. సివిల్స్-2026 కోసం కోచింగ్ తరగతులు జులై 25 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు టిజి బిసిఐఎస్‌డిటిసి (టిజి బిసి స్టడీ సర్కిల్), లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్‌లో నిర్వహించబడుతుందని సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 150 మంది అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని.. వారిలో 100 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను జులై 12న నిర్వహించే ఆన్ లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరో 50 మంది అభ్యర్థులను, గతంలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమ్స్) పరీక్షలో ఉత్తీర్ణులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. వారు సంబందిత పత్రాలతో నేరుగా సైదాబాద్‌లో ఉన్న బిసి స్టడీ సర్కిల్ ఆఫీసులో ఈ నెల 16 నుంచి జులై 8 లోపల దరఖాస్తు చేయాల్సి ఉంటుందని సూచించారు. దరఖాస్తు చేసిన వారిని మాత్రమే ఎంపిక చేయబడుతుందని డైరెక్టర్ స్పష్టం చేశారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, బోర్డింగ్, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5000/ స్టయిఫండ్, రూ.5000/ బుక్ ఫండ్‌ను ఒక్కసారి అందించబడుతుందని.. గ్రంథాలయ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందని డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరులో సంప్రదించాలని సూచించారు.

## గంధపు చెక్కను తరలిస్తున్న నలుగురు నిందితులు అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** గుట్టుచప్పుడు కాకుండా గంధపుచెక్కల అక్రమ రవాణా చేస్తున్న వివిధ రాష్ట్రాలకు చెందిన నల్గురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో పందొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నారు. పోలీసులు గాలింపు చర్యలు చేపట్టిందని, త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనపై వివరాలను వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలాన్‌బై పర్ది (26), షానాజ్ (35), ఇద్దరు మహిళలు నిమత్ (43), మాధురి ఆదివాసి (25)లతో పాటు పరారీలో ఉన్న పలువురు నిందితులు నగరానికి వచ్చి ఇరవై రోజుల క్రితం జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, యూసుఫ్‌గూడ పరిధిలోని గంధపుచెక్కలను అక్రమంగా నరికేసిట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి సీసీకెమెరాల ఆధారంగా ఇరవైమూడు మందిని గుర్తించారు. అయితే వీరంతా ఇరవైకుటుంబాలకు చెందిన స్మగ్లర్లు అని, ప్రజలను ఎలాంటి అనుమానాలు రాకుండా కుటుంబంగా ఉంటూ గంధపు చెక్కలను పోలీసుల కంటపడకుండా రాష్ట్రాన్ని దాటి వేయించారని పేర్కొన్నారు.




కమిటీ నియామకాలను రిలీజ్ చేస్తున్న జస్టిస్ చంద్రకుమార్, గాలి వినోద్‌కుమార్, రాజేశ్‌కుమార్ తదితరులు

## నియోజకవర్గాల పునర్విభజనను రద్దు చేయాలి

### దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్‌ను చేయాలి

### ఎపిని విభజించిన పార్టీలు యుపిని ఎందుకు విభజించలేవు? గాలి వినోద్‌కుమార్

**హైదరాబాద్ (సైఫాబాద్), జూన్ 13, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే నియోజకవర్గాల పునర్విభజనను రద్దు చేయాలని సౌత్ ఇండియా పొలిటికల్ జెఎసి ఛైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక అని కేంద్రం అంటున్నదని, కాని కేంద్రం 5 కోట్లు జనాభా ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పార్టీ, బిజెపి విభజించాయని, 25 కోట్ల జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్‌ను ఎందుకు విభజించలేదని ఆయన ప్రశ్నించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న నార్త్ ప్రాంతాలు సౌత్ ప్రాంతాలపై వివక్ష చూపిస్తు న్నాయని, శాసిస్తున్నాయని, నార్త్‌లో తెల్లవారు, సౌత్‌లో నల్లవారు అన్న వివక్ష కొనసాగుతూనే ఉందని ఆరోపించారు. 2028లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో సౌత్ ఇండియానే నంబర్-1గా ఉండాలని, నార్త్ ఇండియాను ఓడించి సౌత్ ఇండియాకు చెందిన దళితుడుగాని, బిసిగాని ప్రధానమంత్రి కావాలని ఆయన చెప్పారు. జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా ఆధర్యంలో శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెద్దపెద్ద పార్టీలు చిన్నిచిన్న రాజకీయ పార్టీలను దోపిడీ చేస్తున్నాయని, భారతదేశం ఒక్క నార్త్ ఇండియన్స్‌దే కాదని, దేశంలోని 146 కోట్లమంది భారతీయులదని ఆయన స్పష్టం చేశారు. దేశానికి రెండోవ రాజధానిగా హైదరాబాద్‌ను, సుప్రీంకోర్టు బెంచ్ హైదరాబాద్‌లో ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ దేశం ఐక్యంగా ఉండాలని, రాజ్యాంగం ప్రకారం సౌత్ ఇండియన్ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జస్టిస్ ఫర్ సౌత్ ఇండియా కన్వీనర్ కరణం రాజేశ్‌కుమార్, ఆమ్‌ఆద్మీపార్టీ డాక్టర్స్ విభాగం కన్వీనర్ డాక్టర్ లక్ష్మానాయుడు తదితరులు ప్రసంగించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.చిన్నారెడ్డి

## ప్రజావాణికి అందిన దరఖాస్తులు 185

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 13, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 185 దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 35 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 45దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 46 దరఖాస్తులు, విద్యుత్‌శాఖకు సంబంధించి 24 దరఖాస్తులు, మున్సిపల్ శాఖకు సంబంధించి 11 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 24 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

## సంస్థాగత నిర్మాణంలోనూ సామాజిక సమతుల్యత

### జూమ్ మీటింగ్‌లో ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్

### గ్రామస్థాయి నుంచి పటిష్టంగా సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో సామాజిక సమతుల్యత పాటిస్తూ పార్టీ కోసం పాటుపడే కార్యకర్తలను గుర్తించి పదవులు ఇస్తామని ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. శుక్రవారం టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన డిసిసి అధ్యక్షులతో,రాష్ట్ర పార్టీ సంస్థాగత నిర్మాణ పరిశీలకులతో జూమ్ సమావేశం జరుగగా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు లభిస్తుందని హామి ఇచ్చారు.కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని కాపాడుతూ పార్టీ లో ప్రభుత్వంలో పదవుల పంపిణీ చేస్తుందని ఆమె వివరించారు.రాహుల్ గాంధీ గారు సమాజంలో ఎవరి వాటా వారికి ఇవ్వాలన్న సిద్ధాంతంతో పని చేస్తున్నారని ఈ విషయం ప్రజాక్షేత్రంలో బహుళ ప్రచారం చేసి ప్రజాభిప్రాయం ఆయన సిద్దాంతంకు అనుగుణంగా కూడగట్టాలని ఇదే అణగారిన వర్గాలకు వనరులపై ఆదిపత్యం పొందేందుకు దోహదం చేస్తుందని అప్పుడే దేశంలో పేదరికం నిర్మూలన సాధ్యమవుతుందని ఆమె అన్నారు.

సమాజంలోని అన్ని వర్గాలు, దేశంలోని వివిధ ప్రాంతాలు సంతులిత అభివృద్ధి చేయాలంటే సామాజిక న్యాయం, దేశంలోని ప్రజల మధ్య సౌభ్రాతృత్వం, శాస్త్రీయచింతన పెంపొం దించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమసమాజరీతి ప్రజాస్వామికన దేశాన్ని నిర్మిం చాలనే సిద్ధాంతం ప్రాతిపదికనే పనిచేస్తుందని అందరి కోసం ఒక్కరం ఒక్కరి కోసం అందరం అనే సహకారస్ఫూర్తిని ప్రజల్లో పెందించేదిశగా పార్టీ సిద్ధాంతాలు అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజల మధ్య విభజన,విద్వేషాలు లేని అఖండ భారత దేశం నిర్మాణంకోసం గ్రామీణ ప్రాంతం నుంచి కాంగ్రెస్ పార్టీ పటిష్ఠంగా సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆవిధంగానే నిర్మాణాలు ఉండాలని సూచించారు. ఇప్పటి వరకు ఇచ్చిన అన్ని పదవులలో సామాజిక న్యాయాన్ని పాటించాము.పార్టీ కోసం పని చేసిన అందరికి పదవులు వస్తాయని మీనాక్షి హామి ఇచ్చారు.

టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను తెలంగాణ లో పెద్దఎత్తున నిర్వహించామని వివరించారు. మనమే అన్ని రాష్ట్రాల కంటే బాగా చేసామని కితాబు ఇచ్చుకున్నారు.

ఎఐసిసి అగ్రనేతలు కూడా తెలంగాణ ను ఆదర్శంగా తీసుకోవాలని చెప్పడం మనకు గర్వకారణం అని చెప్పారు.సంస్థాగత నిర్మాణం కూడా మన రాష్ట్రంలోనే బాగా జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర పరిశీలకులు, కో ఆర్డినేటర్లు బాగా పని చేస్తున్నారు. మండల జిల్లా స్థాయి కమిటీల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో వస్తున్న నేపథ్యంలో గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణం పకడ్బందీగా చేయాలని ఆయన సూచించారు. పార్టీ లో చిత్తశుద్ధితో పని చేసిన వారికి అందరిని పార్టీ వారి వారి స్థాయిలలో తప్పకుండా గుర్తిస్తుందని ఆయన తెలిపారు. ఎఐసిసి కార్యదర్శి విశ్వనాథం కూడా పాల్గొని సంస్థాగత నిర్మాణంకు సూచనలు అందించారు.

# తీవ్ర ఒత్తిడిలోనూ అద్భుత ఇన్నింగ్స్

## నాకౌట్లలోనూ హాఫ్ సెంచరీలు

### కీలక విజయాలు అందించిన హీరోలు



సచిన్ టెండుల్కర్



విరాట్ కోహ్లీ



స్టీవ్ స్మిత్



జాక్వెస్ కల్లిస్

**న్యూఢిల్లీ:** క్రికెట్‌లో ఐసిసి టోర్నమెంట్లు అంటేనే ఆటగాళ్లకి అగ్నిపరీక్ష. అందులోనూ నాకౌట్‌మ్యాచ్‌లుఅంటే ఒత్తిడి తారాస్థాయిలో ఉంటుంది. అలాంటి కీలక సమయాల్లో నిలకడగా రాణించడం ఏ బ్యాట్స్‌మెన్‌కైనా పెద్ద సవాలు. అయితే ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మెన్ స్టీవ్ స్మిత్ ఈ సవాలును ఛేదించి, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో అత్యధిక 50+ స్కోర్లు సాధించిన ఆటగాళ్ల ఎలైట్ జాబితాలో చేరి అరుదైన రికార్డును నెలకొల్పాడు. ఈ ఎలైట్ జాబితాలో అగ్రస్థానంలో టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ ఉన్నాడు. అతను ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో పది 50+ స్కోర్లతో అసమానంగా నిలిచాడు. తన కెరీర్‌లో 22 ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, కోహ్లీ 51.20 సగటుతో 1000 పైగా పరుగులు సాధించాడు. ఇందులో తొమ్మిది హాఫ్ సెంచరీలు, 2023 ప్రపంచ కప్ సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌పై వచ్చిన సెంచరీ ఉన్నాయి. ఆస్ట్రేలియాకు చెందిన స్టీవ్ స్మిత్ టెస్ట్ క్రికెట్‌లో, ఈ తరంలో అతిపెద్ద క్లచ్ ప్లేయర్‌గా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ఇక ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో, 36 ఏళ్ల అనుభవజ్ఞుడు కేవలం 13 మ్యాచ్‌లలో ఏడు 50+ స్కోర్‌లను నమోదుచేశాడు. 59.09 సగటుతో 5 హాఫ్ సెంచరీలు, రెండు మ్యాచ్ డిఫైనింగ్ సెంచరీలు ఉన్నాయి. ఈ రెండూ 2015 ఐసిసి ప్రపంచ కప్, 2023 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో ఆస్ట్రేలియాకు టైటిల్స్‌సాధించడంలో కీలకంగామారాయి. ఈ జాబితాలో మూడో స్థానంలో నిలిచిన టీమిండియా దిగ్గజం సచిన్, ఐసిసి నాకౌట్ మ్యాచ్‌లలో ఆరు 50+ స్కోర్లు సాధించాడు.

అలాగే, టెండూల్కర్ మొత్తం 682 పరుగులు సాధించాడు. వాటిలో ఐదు హాఫ్ సెంచరీలు, ఒక సెంచరీఉన్నాయి. అలాగే సౌరవ్ గంగూలీ, జాక్వెస్ కల్లిస్, కుమార్ సంగక్కర, కేన్ విలియమ్సన్‌లు ఐసిసి నాకౌట్‌లలో ఐదుసార్లు 50+ స్కోర్లు సాధించారు. తీవ్రమైన ఒత్తిడిలోనూ వీరు అద్భుతమైన ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుని, తమ జట్టుకు కీలక విజయాలను అందించారు.



# టి20 ముంబై లీగ్‌లో.. విజేతగా మరాఠా రాయల్స్

## 5 వికెట్ల తేడాతో ముంబై ఫాల్కన్స్ ఓటమి

**న్యూఢిల్లీ:** టి20 ముంబై లీగ్-2025, ఫైనల్ మ్యాచ్‌లో సోబో ముంబై ఫాల్కన్స్‌ను ఓడించి మరాఠా రాయల్స్ ట్రోఫీని ఎత్తేసింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే పరిమితం చేసి, ఆపై టి20 ముంబై లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను గెలుచుకోవడానికి నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. రాజేష్ సుతార్ అర్ధ సెంచరీ, అవాయిస్ నౌషాద్ ఉపయోగకరమైన సహకారం ముంబై సౌత్ సెంట్రల్ మరాఠా రాయల్స్‌ను విజేతగా నిలిపింది. తొలుత బౌలింగ్ ఎంచుకున్న మరాఠా రాయల్స్ ముంబై ఫాల్కన్స్‌ను 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 పరుగులకే కట్టడి చేసింది. ఆతర్వాత సుతార్ 49 బంతుల్లో 53 పరుగులు చేసి, రెండు బౌండరీలు, సిక్సర్లతో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేరుకుంది. నౌషాద్ 38 (24 బంతులు) పరుగులు చేసి, సుతార్‌తో కలిసి నాల్గవ వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు, ఈ జంట మరాఠా రాయల్స్‌ను విజయ ద్వారం వద్దకు తీసుకెళ్లింది. అంతకుముందు, మయూరేష్ టాండెల్ (50 నాటౌట్), హర్ష్ అఘవ్ (45 నాటౌట్) 49 బంతుల్లో 85 పరుగుల అజేయ భాగస్వామ్యంతో ముంబై ఫాల్కన్స్ 157/4 స్కోరు చేయగలిగింది. 12వ ఓవర్లో కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ అవుట్ కావడంతో జట్టు స్కోరు 72/4కి తగ్గే వరకు ఆటలో సగం సమయానికి 60/3తో కష్టాల్లో పడింది. నాలుగు సిక్సర్లు బాదిన అఘవ్, టాండెల్ తో కలిసి స్కోరింగ్ ను వేగవంతం చేసాడు, అయినప్పటికీ జట్టు తక్కువ స్కోరుతో ముగిసింది. సోబో ముంబై ఫాల్కన్స్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 157 (మయూరేష్ టాండెల్ 50 నాటౌట్, హర్ష్ అఘవ్ 45 నాటౌట్; వైభవ్ మాలి 2/32) ఎమ్మెసి మరాఠా రాయల్స్ చేతిలో 19.2 ఓవర్లలో 158/5 (చిన్మయ్ సుతార్ 53, అవాయిస్ ఖాన్ 38) ఐదు వికెట్ల తేడాతో ఓడిపోయింది.



# యూరోపియన్ టూర్‌లో.. భారత్ మూడో విజయం

## బెల్జియం 3-2 తేడాతో ఓటమి

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల యూరప్‌టూర్‌లో భారత్ వరుసగా మూడో విజయాన్ని సాధించింది. ఆంట్వెర్ప్‌లోని విల్రిజ్క్బ్ ప్లీన్‌లోని హాకీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శుక్రవారం బెల్జియంపై 3-2 తేడాతో విజయంసాధించి భారత్ జూనియర్ మహిళల హాకీ జట్టు యూరప్‌లో తన విజయాల పరుగును కొనసాగించింది. భారత్‌తరపున సోనమ్ (4వనిముషం), లాల్తాంట్లుంగి (32వ నిముషం), మరియు కనికా సివాచ్ (51వ నిముషం) గోల్స్ సాధించగా, బెల్జియం మేరీ గోయెన్స్ (37వ నిముషం) మరియు మార్టే మేరీ (40వ నిముషం) ద్వారా ప్రతిస్పందించింది. నాల్గవనిమిషంలోనే సోనమ్ ఫీల్డ్‌గోల్‌ద్వారా గోల్ చేయడంతో భారతదేశం ప్రారంభంలోనేగోల్‌చేసింది. మూడవక్వార్టర్ ప్రారంభంలో లాల్తాంట్లు వాంగి పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మార్చడం ద్వారా, మొదటి అర్ధభాగం వరకు 1-0 ఆధిక్యాన్ని కొనసాగించిన ఆతిథ్య జట్టు మూడవ క్వార్టర్ ప్రారంభంలో ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. అయితే బెల్జియం పుంజుకుని మూడు నిమిషాల వ్యవధిలో రెండుసార్లు గోల్స్‌చేసింది. 37వనిమిషంలో గోయెన్స్ పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచింది. 40వ నిమిషంలో మార్టే మేరీ ఫీల్డ్ గోల్ చేసి మ్యాచ్‌ను 2-2తో సమం చేసింది. అయితే, నాల్గవ క్వార్టర్ చివరిలో భారత్ తిరిగి నియంత్రణ సాధించింది. 51వ నిమిషంలో కనికా పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని పునరుద్ధరించింది, దీనితో జట్టు గట్టి పోరాటంతో విజయం సాధించింది.

# టేబుల్ టెన్నిస్‌లో.. సెమీఫైనల్స్‌కు యు ముంబా, దబాంగ్ ఢిల్లీ



**న్యూఢిల్లీ:** ఇండియన్ ఆయిల్ అల్టిమేట్ టేబుల్ టెన్నిస్, సీజన్ 6లో యు ముంబా టిటి 10-5 తేడాతో దబాంగ్ ఢిల్లీ టిటిసిపై విజయం సాధించి నాల్గవ మరియు చివరి సెమీఫైనల్ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ ఓటమితో ఢిల్లీ జట్టు నాలుగు టైలతో గెలిచిన విజయ పరంపరకు తెరపడింది. అయితే సీజన్ 2 ఛాంపియన్స్ ఇప్పటికీ 44 పాయింట్లతో లీగ్ పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.

శుక్రవారం జరిగిన ఈ గేమ్‌లో తొలి సింగిల్స్‌లో లిలియన్ బార్డెట్ యు ముంబా టిటికి సరైన ఆరంభాన్ని ఇచ్చి సత్యన్ జ్ఞానశేఖరన్‌ను 2-1 తేడాతో ఓడించాడు. మొదటి గేమ్‌ను 11-10 తేడాతో ముగించిన తర్వాత, బార్డెట్ రెండవ గేమ్‌ను 4-11 తేడాతో కోల్పోయాడు, కానీ నిర్ణయాత్మక మ్యాచ్‌లో 11-4 తేడాతో విజయం సాధించి బలంగా స్పందించాడు. ఆ తర్వాత బెర్నాడెట్ సోక్స్ దియా చిటాలేపై 2-1 తేడాతో విజయం సాధించింది. చిటాలే మొదటి గేమ్‌ను 11-3 తేడాతో గెలుచుకున్నాడు, కానీ సోక్స్ 11-10 గోల్డెన్ పాయింట్ విజయంతో సమంచేసి మ్యాచ్‌ను 11-8 తేడాతో ముగించాడు. ఈ జోరు మిక్స్‌డ్ డబుల్స్‌లో కూడా కొనసాగింది, ఆకాష్ పాల్‌తో కలిసి స్జోక్స్ తొలిగేమ్‌లో ఇజాక్‌క్యూక్ మరియు దియా చిటాలేలను ఓడించి యు ముంబా సెమీఫైనల్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించింది. ఢిల్లీ తిరిగి పుంజుకుని, మిగిలిన రెండు గేమ్‌లను గెలుచుకుంది మరియు ఆ తర్వాత మ్యాచ్‌ను కూడా గెలుచుకుంది. సింగపూర్‌కు చెందిన ఇజాక్ క్యూక్‌పై 2-1 తేడాతో విజయం సాధించి అభినంద్ పిబి యు ముంబాకు మరోరెండు పాయింట్లు జోడించాడు. ఈ సీజన్‌లో తొలిసారి ఆడిన అభినంద్ మొదటి రెండు గేమ్‌లను బలంగా ప్రారంభించాడు, ఆ తర్వాత ఇజాక్ 11-7 తేడాతో ఒక విజయం సాధించి దబాంగ్ ఢిల్లీని పట్టికలో అగ్రస్థానానికి చేర్చాడు. చివరి రబ్బర్‌లో, యశస్విని ఘోర్పడే తన ప్రపంచ యూత్ ఛాంపియన్‌షిప్స్ 2023 సహచరురాలు సుహానా సైనిని 3-0 తేడాతో ఓడించి, గోల్డెన్ పాయింట్‌పై రెండు గట్టి గేమ్‌లను గెలిచి 11-3 తేడాతో మ్యాచ్‌ను ముగించింది. స్జోక్స్ విదేశీ ఆటగాడు మరియు షాట్ ఆఫ్ ది టై అనే డబుల్ గౌరవాలను గెలుచుకోగా, యశస్విని ఇండియన్ ప్లేయర్ ఆఫ్ ది టైగా ఎంపికైంది.

# క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు జెంగ్ క్విన్వెన్

**న్యూఢిల్లీ:** క్వీన్స్ క్లబ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్ కార్ట్నీ కెస్లర్‌కు ఓటమి ఎదురైంది. లండన్‌లో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో చైనా టాప్ సీడ్ క్రీడాకారిణి మెక్‌కార్ట్నీ కెస్లర్‌ను 6-3, 4-6, 7-5 తేడాతో ఓడించడంతో జెంగ్ క్విన్వెన్ క్వీన్స్ క్లబ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. ప్రపంచ 42వ ర్యాంక్ ప్లేయర్ జెంగ్‌తో జరిగిన చివరి 16వ ర్యాంక్ మ్యాచ్‌లో చివరి సెట్‌లో 42తో వెనుకబడి ఉంది. కానీ పారిస్ ఒలింపిక్ ఛాంపియన్ పశ్చిమ లండన్‌లో జరిగిన వింబుల్డన్ వార్మప్ ఈవెంట్‌లో ఓటమిని నివారించడానికి ప్రయత్నించింది. గత సంవత్సరం రోలాండ్ గారోస్‌లో జరిగిన క్లే కోర్టులో డోనా వెకిక్‌ను ఓడించి జెంగ్ సింగిల్స్ ఈవెంట్‌లో ఒలింపిక్ స్వర్ణం గెలిచిన తొలి ఆసియా క్రీడాకారిణిగా నిలిచింది. ప్రస్తుతం డబ్ల్యూటిఏ ర్యాంకింగ్స్‌లో ఐదవ స్థానంలో ఉన్న 22 ఏళ్ల ఆమె ఇటీవల ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో ఓడిపోయింది. 52 సంవత్సరాల తర్వాత క్వీన్స్‌లో జరిగిన తొలి మహిళల ఈవెంట్‌లో, 2022 వింబుల్డన్ ఛాంపియన్ మరియు నాల్గవ సీడ్ ఎలెనా రైబాకినా బ్రిటన్‌కు చెందిన హీథర్ వాట్సన్‌పై 6-4, 6-2 తేడాతో విజయం సాధించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. కాగా చివరి ఎనిమిది మ్యాచ్‌లో రైబాకినా జర్మనీకి చెందిన టాట్జానా మరియాతో తలపడనుంది, ఆస్ట్రేలియన్ ఓపెన్ హోల్డర్ మాడిసన్ కీస్ ష్నైడర్‌తో తలపడనుంది.

# మొబైల్ వినియోగదారులకు టెలికాం కొత్త రూల్స్

**ముంబై, జూన్ 13:** మొబైల్ వినియోగదారులకు కేంద్ర టెలికాం శాఖ (డాట్) ఒక శుభవార్త అందించింది. ప్రీపెయిడ్ కనెక్షన్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు లేదా పోస్ట్‌పెయిడ్ నుంచి ప్రీపెయిడ్‌కు మారాలనుకునే కస్టమర్ల కోసం నిబంధనలను సరళతరం చేసింది. దీనివల్ల వినియోగదారులు తమకు నచ్చిన ప్లాన్‌కు మారేందుకు పట్టే సమయం గణనీయంగా తగ్గనుంది. ఓటీపీ (వన్ టైమ్ పాస్‌వర్డ్) ఆధారిత కేవైసీ ప్రక్రియ ద్వారా ఈ మార్పులను సులభతరం చేసినట్లు టెలికాం శాఖ వెల్లడించింది. ఇంతకుముందు, ఒక వినియోగదారుడు తన మొబైల్ సర్వీస్‌ను ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్‌కు మార్చుకున్న తర్వాత, మళ్లీ మరోసారి ప్లాన్ మార్చుకోవాలంటే కనీసం 90 రోజుల పాటు వేచి ఉండాల్సి వచ్చేది. ఈ వ్యవధిని కూలింగ్ ఆఫ్ పీరియడ్‌గా పరిగణించేవారు. అయితే, జూన్ 10న టెలికాం శాఖ జారీ చేసిన నూతన మార్గదర్శకాల ప్రకారం, ఈ నిరీక్షణ కాలాన్ని 30 రోజులకు కుదించారు. అంటే, ఒకసారి ప్లాన్ మార్చుకున్న తర్వాత, కేవలం 30 రోజుల వ్యవధిలోనే మరోసారి తమకు అనుకూలమైన ప్లాన్‌కు మారేందుకు అవకాశం కల్పించారు. ఈ కొత్త సదుపాయాన్ని పొందాలనుకునే వినియోగదారులు తమ సమీపంలోని టెలికాం సర్వీస్ ప్రొవైడర్ల యొక్క కస్టమర్ సర్వీస్ కేంద్రాలను లేదా అధీకృత ఔట్‌లెట్‌లను సంప్రదించాల్సి ఉంటుంది. అక్కడ ఓటీపీ ఆధారిత కేవైసీ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ఈ మార్పును చేసుకోవచ్చు. ఈ విషయాన్ని డాట్ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తెలియజేసింది. అయితే, ఈ 30 రోజుల నిరీక్షణ కాలపు తగ్గింపు



సౌకర్యం కేవలం మొదటిసారి తమ ప్లాన్‌ను మార్చుకునే వారికి మాత్రమే వర్తిస్తుందని టెలికాం శాఖ స్పష్టం చేసింది. ఒక వినియోగదారుడు ఈ వెసులుబాటును ఒకసారి ఉపయోగించుకున్న తర్వాత, భవిష్యత్తులో మళ్లీ ప్లాన్ మార్చుకోవాలనుకుంటే, అప్పుడు పాత పద్ధతిలోనే 90 రోజుల నిరీక్షణ కాలాన్ని పాటించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కొత్త నిబంధన వల్ల వినియోగదారుల సమయం ఆదా అవ్వడంతో పాటు, వారి అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన సర్వీసులను మార్చుకునేందుకు వీలు కలుగుతుంది.

# భారత్ నుంచే అమెరికాకు 97% ఐఫోన్ల ఎగుమతి..

**వాషింగ్టన్, జూన్ 13:** చైనాపై అమెరికా విధించిన సుంకాలను ఎదుర్కొనే ప్రక్రియలో భాగంగా ఆపిల్ వ్యూహాత్మక చర్యలు చేపట్టింది. భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులను గణనీయంగా పెంచింది. ఈ ఏడాది మార్చి-మే మధ్య భారత్ నుంచి ఎగుమతి చేసిన ఐఫోన్‌లలో 97శాతం అమెరికాకు చేరాయి. గతంలో భారత్ నుంచి నెదర్లాండ్, బ్రిటన్ వంటిదేశాలకు ఐఫోన్లు ఎక్కువగా ఎగుమతయ్యేవి. కానీ ఇప్పుడు పూర్తిగా అమెరికాపై యాపిల్ దృష్టి కేంద్రీకరించింది. చైనా నుంచి ఎగుమతి చేసే ఐఫోన్‌లపై అధిక సుంకాలు ఉండటంతో యాపిల్ భారత్‌లో ఉత్పత్తిని వేగవంతం చేసింది. మార్చి-మే మధ్య కాలంలో భారత్ నుంచి 3.2 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను అమెరికాకు ఎగుమతి చేసింది. మార్చిలో రికార్డు స్థాయిలో 1.3 బిలియన్ డాలర్లు, మేలో 1 బిలి యన్ డాలర్ల విలువైన ఐఫోన్‌లను అమెరికాకు పంపింది. ఈ ఏడాది మొదటి ఐదు నెలల్లోనే 4.4 బిలియన్ డాలర్ల



విలువైన ఐఫోన్‌లను ఎగుమతి చేసింది. ఇది గతేడాదిలో ఎగుమతైన 3.7 బిలియన్ డాలర్ల ఐఫోన్ల విలువ కంటే ఎక్కువ. అమెరికా.. భారత్‌పై విధించిన అదనపు 26 శాతం సుంకాలను జులై 9 వరకు తాత్కాలికంగా నిలిపివేసిన నేపథ్యంలో అదనపు సుంకాన్ని నివారించేందుకు భారత్ చర్చలు కొనసాగిస్తోంది. ఈ 90 రోజుల వ్యవధిని ఉపయోగించుకొని ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. ఇక 10 శాతం బేస్‌లైన్ సుంకం యథాతథంగా కొనసాగుతుంది. మరోవైపు చైనా, అమెరికా దేశాలు సుంకాలను తగ్గించే ఒప్పందం కోసం చర్చలు జరుపుతున్నాయి.

# వరల్డ్ టాప్ 20 ధనవంతుల్లో అంబానీ, అదానీ

**ముంబై, జూన్ 13:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ మరోసారి బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్‌లో తన సత్తా చాటారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత



త ధనవంతుల జాబితా ఉన్న ఈ సూచీలో ముఖేష్ అంబానీ 17వ స్థానంలో నిలిచారు. అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ గౌతమ్ అదానీ 20 స్థానాన్ని దక్కించుకున్నారు. అయితే ఈ ఇండెక్స్‌లో టాప్‌లో టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్, తర్వాత స్థానాల్లో మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్, అమెజాన్ అధినేత జెఫ్‌బెజోస్ నిలిచారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ 500 అత్యంత ధనవంతుల జాబితాలో ఇండియా నుంచి ముఖేష్ అంబానీ 17వ స్థానం, గౌతమ్ అదానీ 20వ స్థానంలో, శివ్‌నాడార్ 41వ స్థానంలో, షాపూర్ మిస్త్రీ 52వ స్థానంలో, సావిత్రి జిందాల్ 59వ స్థానంలో, అజీమ్ ప్రేమ్‌జీ 69వ స్థానంలో, సునిల్ మిట్టల్ 73వ స్థానంలో, దిలీప్ సంఘ్వీ 79వ స్థానంలో, లక్ష్మీ మిట్టల్ 86వ స్థానంలలో నిలిచారు.

# వాణిజ్యం

# స్టాక్ సూచీలను దెబ్బతీసిన ఇన్వెస్టర్ సెంటిమెంట్


**ముంబై, జూన్ 13:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపై పడింది. దీంతో ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,600 దిగువకు చేరింది. చివరకు రెండు ప్రధాన సూచీలు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 80,427.81 పాయింట్ల (క్రితం ముగింపు 81,691.98) వద్ద భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,354.59 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 573 పాయింట్ల నష్టంతో 81,118 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 24,473.00 వద్ద కనిష్ఠాన్ని తాకిన నిఫ్టీ చివరకు 169 పాయింట్ల నష్టంతో 24,718 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.07గా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు కూడా మార్కెట్ సెంటిమెంటును దెబ్బతీశాయి. ముఖ్యంగా చమురు రంగ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, ఎస్‌బీఐ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, టైటాన్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, బజాజ్‌ఫిన్‌సర్వ్, ఎటర్నల్, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. టెక్ మహీంద్రా, టీసీఎస్, సన్‌ఫార్మా, మారుతీ సుజుకీ షేర్లు మాత్రమే లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్



బ్యారెల్ ధర 75.39 డాలర్ల వద్ద ట్రేడవగా.. బంగారం ఔన్సు 3,445 డాలర్ల వద్ద కొనసాగింది. ఇజ్రాయెల్-ఇరాన్ సంక్షోభం అంతర్జాతీయ మార్కెట్లను మాత్రమే కాకుండా, దేశీయ మార్కెట్లపై కూడా భారీ ప్రభావాన్ని చూపుతోంది. చమురు ధరలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, రూపాయిమారకం విలువ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యూహాలు అమలు చేయాలి.

# చమురు ధరలపై ఇరాన్-ఇజ్రాయెల్ వార్ ఎఫెక్ట్

**ముంబై, జూన్ 13:** ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేసింది. దీంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి. దీంతో శుక్రవారం అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతం పైగా పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరింది. ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం చమురు ధరలపై ప్రభావం చూపుతోంది. ఈ దాడులతో హార్మోజ్ జలసంధి ద్వారా జరిగే గ్లోబల్ ఆయిల్ సరఫరాకు అంతరాయం ఏర్పడొచ్చనే ఆందోళనలు పెరిగాయి. ఈ నేపథ్యంలో చమురు రంగ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి



రూ.299.20 వద్ద ట్రేడవుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి. దాదాపు 40 కి.మీ. మేర ఇరుకైన ప్రదేశం ఉండగా.. అందులో 2. కి.మీ.లు నౌకల రాకపోకల కోసం నావిగేషన్ ఛానల్ ఉంటుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1 కోట్ల (21 మిలియన్) బ్యారెళ్ల చమురుఎగుమతి అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా రోజు వారీ వినియోగంలో ఇది 21శాతం. అంతర్జాతీయంగా ఎల్ఎన్‌జీ వినియోగంలోనూ 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది.

# పెట్టుబడులకు మద్దతుగా పిఎల్ఐ స్కీమ్

**న్యూఢిల్లీ, జూన్ 13:** ఎలక్ట్రిక్, ఇతరత్రా ప్రత్యామ్నాయ ఇంధనాలతో పని చేసే హెవీ ఎర్త్ మూవింగ్ మెషినరీ తయారీ కోసం ప్రత్యేకంగా ఉత్పత్తి ప్రోత్సాహక పథకాన్ని (పిఎల్ఐ) ప్రవేశపెడ్తితే మరిన్ని కొత్త పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలవుతుందని ఓ నివేదిక తెలిపింది. ప్రస్తుతం దేశీయంగా ఇలాంటి వాహనాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడంతో భారీ పెట్టుబడులు అవసరమయ్యే ఈ విభాగంపై తయారీ సంస్థలు, సరఫరాదారులు పెద్ద స్థాయిలో ఇన్వెస్ట్ చేయకపోవచ్చని పేర్కొంది. పిఎల్ఐ స్కీమును ప్రకటిస్తే కొత్త పెట్టుబడులు వస్తాయి. తయారీ, ఇంజినీరింగ్, ఆర్‌అండ్‌డి విభాగాల్లో ఉద్యోగాల కల్పన జరుగుతుంది. ఎలక్ట్రిక్, ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే హెచ్ఇఎంఎంలను దేశీయంగా ఉత్పత్తి చేసుకునే సామర్థ్యాలు పెరుగుతాయి అని భారతీయ ఖనిజ పరిశ్రమ సమాఖ్య (ఎఫ్ఐఎంఐ) రూపొందించిన నివేదిక తెలిపింది. కన్సల్టెన్సీ సంస్థ డెలాయిట్‌తో కలిసి ఎఫ్ఐఎంఐ దీన్ని రూపొందించింది. మైనింగ్ కార్యకలాపాల్లో కీలకమైన హెచ్ఇఎంఎంలు, కర్బన ఉద్గారాలకు కారణంగా ఉంటున్నందున పర్యావరణహితమైన మెషినరీపై ఆసక్తి ఏర్పడుతోంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14